కమలం గుర్తుకే మన ఓటు
SAVE TELANGANA... VOTE FOR BJP

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

నిజామాబాద్ : fb.com/vaartha Digital

కమలం గుర్తుకే మన ఓటు
SAVE TELANGANA... VOTE FOR BJP

Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-2-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 11 పేజీలు: 10+4 వెల: 6.50




వికసిత తెలంగాణ పట్టణ ప్రణాళిక

## బిజెపితోనే అభివృద్ధికి గ్యారెంటీ!!

ఇంటి పన్ను సహా ఎలాంటి పన్నుల పెంపూ ఉండదు.

దోమలు, కోతులు, పందులు, కుక్కల బెడద నివారిస్తాం.

ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు అండర్ పాస్, ఓవర్ హెడ్ బ్రిడ్జిలు నిర్మిస్తాం.

100% అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, ఇంటింటి చెత్త సేకరణ, 'వేస్ట్-టు-ఎనర్జీ' ప్లాంట్ల ఏర్పాటు.

మోడ్రన్ వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, రిక్రియేషన్ ఫెసిలిటీస్ తో ప్రతి మున్సిపాలిటీలో మల్టీ పర్పస్ పార్కులు.

ఆన్ లైన్, సింగిల్ విండో సిస్టం ద్వారా వారం రోజులలో అన్ని రకాల అనుమతులు.

యువత కోసం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు, క్రమం తప్పకుండా జాబ్ మేళాలు.

కేంద్ర ప్రభుత్వ సహకారంతో
మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల సమగ్ర అభివృద్ధి
ఇది తెలంగాణ ప్రజలకు మోదీ గ్యారెంటీ

## కమలం గుర్తుకే మన ఓటు

## భారతీయ జనతా పార్టీ - తెలంగాణ

పోలింగ్ తేది మరియు సమయం: 11 ఫిబ్రవరి 2026, ఉదయం 7 గం.ల నుండి సాయంత్రం 5 గం.ల వరకు

Published by N. Gowtham Rao, State General Secretary, BJP Telangana




సస్పెండ్ అయిన ఎంపీలు మంగళవారం పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన ప్రదర్శనలు చేస్తుండగా వారితో మాట్లాడుతున్న రాహుల్

# యాప్‌తో యాతన

>> లేదు. అదే సమయంలో బుక్ చేసుకున్న చాలా సమయం తర్వాత ఓటీపీ వస్తుండడంతో అప్పటి వరకు అన్నదాతలు ఫర్టిలైజర్ షాపుల వద్దనే పడిగాపులుగాయాల్సి వస్తోంది. అదే సమయంలో చాలా మంది రైతులకు యూరియా షాపుల పేర్లు కూడా తెలియకపోవడంతో యాప్‌లో ఎరువులు బుక్ చేసుకుంటే ఊరు, దుకాణం పేరు తదితర వివరాల నమోదు రైతులను తికమకపెట్టిస్తోంది. ఏ షాపు పేరు బుక్ చేస్తే అదే దుకాణానికి వెళ్లి ఓటీపీ నంబర్ చెబితేనే ఎరువులు ఇస్తుండడం అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక స్మార్ట్ ఫోన్ ఉన్న రైతులకూ యూరియా యాప్ ఇబ్బందులను సృష్టిస్తోంది. పేరు నమోదు చేసిన షాపులో స్టాక్ లేదని చెబుతుండడంతో సుదూరంగా ఉన్న ఫర్టిలైజర్ షాపు పేరుతో అనివార్యంగా అన్నదాతలు యూరియాను బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. బుక్ చేశాక నిర్దేశిత గడువులోగా షాపుకు వెళ్లి తీసుకోకపోతే బుకింగ్ క్యాన్సిల్ అవుతోంది. ఇక బుకింగ్ సమయంలో రైతులు సీజన్, పాస్ బుక్ వివరాలు, పంట రకాలు, సాగు విస్తీర్ణం ఎంత ఉంది అనే వివరాలను యాప్ లో నమోదు చేయాలి. ఈ సమాచారం ఆధారంగా రైతుకు అవసరమైన యూరియా పరిమాణాన్ని తెలియజేస్తూ దానిని ఎప్పుడు బుక్ చేసుకోవచ్చు అనేది యాప్ స్వయంగా లెక్కించి చెబుతుండడంతో అవసరం మేర యూరియా కొనుగోలు చేయలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో గతంలో ఇచ్చినట్లే యూరియాను పాత పద్ధతిలోనే ఇవ్వాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. వానాకాలంలో యూరియా ఇచ్చినట్లు గోదాంలో పైసలు కట్టి తీసుకపోయినట్లు ఇస్తే బాగుంటదని అభిప్రాయపడుతున్నారు. తాజాగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలు గ్రామాల రైతులు యూరియా కోసం బుకింగ్‌కు ప్రయత్నించగా నిల్వల వివరాలు యాప్‌లో కనిపించకపోవడంతో మంగళవారం ధర్నాకు దిగారు. యూరియా యాప్‌తో కష్టాలు తప్పడం లేదంటూ ఆందోళన నిర్వహించారు.

# ఉద్యోగులను బాధపెట్టొద్దు

>> కోరారు. ఈమేరకు బహిరంగ లేఖ రాసారు. రాష్ట్రంలో 3 లక్షల మందికిపైగా రెగ్యులర్ ఉద్యోగులు, 4 లక్షల మందికిపైగా రిటైర్డ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం 5 డిఎలను పెండింగ్‌లో ఉంచిందని, ఉద్యోగులు దాచుకున్న గ్రాట్యుటి, ఈపిఎఫ్, లీవ్ ఎన్ క్యాష్ మెంట్ బకాయిలను కూడా చెల్లించడం లేదన్నారు. 2023 జులై నుండి అమలు చేయాల్సిన పిఆర్‌సిని రెండున్నరేళ్లు అవుతున్నా ఊసే ఎత్తకపోవడం శోచనీయమని, కనీసం పిఆర్‌సి రిపోర్ట్‌ను కూడా తెప్పించకపోవడం చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగులంటే ఎంతటి నిరక్ష్య వైఖరి ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు. ఇంకా బాధాకరమైన విషయం ఏమిటంటే జీవితాంతం ప్రభుత్వానికి సేవ చేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు ఇవ్వాల్సిన సొమ్మును సైతం ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. 2024 నుండి నేటి వరకు దాదాపు 13 వేల మంది ఉద్యోగులు రిటైర్డ్ అయ్యారు. ఆనాటి నుండి నేటి వరకు వారికి రావాల్సిన బెన్ ఫిట్స్, 5 డిఏలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బంది పెట్టడం ఎంతవరకు న్యాయం? తమ పిల్లలకు పెళ్లిళ్ల చేయడం కోసం, ఉన్నత చదవులు చదివించడం కోసం దాచుకున్న సొమ్మును చెల్లించకపోవడంతో వారంతా తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. జీవిత మలి సంధ్యలో ప్రశాంతమైన జీవితాన్ని గడపాల్సిన రిటైర్డ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వమే మానసిక వేదనకు గురిచేస్తుండటం క్షమించరానిదని, ముక్కు మొఖం తెలియని వృద్ధులు కష్టాల్లో ఉంటేనే చేతనైనంత సాయం చేయాలని భావించే గొప్ప మానవతా హృదయమున్న తెలంగాణ సమాజం మనది. అట్లాంటిది జీవితాంతం ప్రభుత్వానికి ఊడిగం చేసిన ఉద్యోగులు రిటైర్డ్ అయితే వారిని బెన్ ఫిట్స్ అన్నీ చెల్లించి సగౌరవంగా సన్మానించి పంపాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ వారి ఉసురు పోసుకోవడం అత్యంత శోచనీయం అన్నారు. మీ నిరక్ష్యంవల్ల బెన్ ఫిట్స్ అందక గత ఏడాది నుండి ఇప్పటి వరకు 61 మంది రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర మానసిక వేదనకు లోనై మరణించారన్నారు. ఈ చావులకు రాష్ట్ర ప్రభుత్వం కారణం కాదా? వారిపై ఆధారపడిన కుటుంబాలకు మీరేం సమాధానం చెబుతారు? ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులపట్ల పాలకులు ఇంతటి కర్కశంగా వ్యవహరించడం తెలంగాణకు మాయని మచ్చ తెస్తుందనే విషయం మరిచిపోయారా? రిటైర్డ్ ఉద్యోగులతోపాటు ఉద్యోగ, ఉపాధ్యాయలకు చెల్లించాల్సిన బకాయిలన్నీ కలిపితే రూ.12 వేల కోట్లకుపైగా ఉన్నట్లు తెలుస్తుందన్నారు. యేటా రూ.2.5 కోట్లకు పైగా వార్షిక బడ్జెట్ కలిగిన రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు రూ.12వేల కోట్ల బకాయిలు చెల్లించడం భారంగా భావించడం అంటే అంతకంటే దురదృష్టకరమైన విషయం ఇంకోటి లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలో ప్రాధాన్యత లేని కేటగిరీగా భావిస్తున్నట్లు కన్పిస్తుందని, ఇలాంటి ఆలోచన కలిగి ఉండటం రాష్ట్ర ప్రభుత్వానికి, తెలంగాణ పురోభివృద్ధికి గొడ్డలిపెట్టుగా మారుతుందన్నారు. ఇకనైనా వారిపట్ల మీకున్న నిరక్ష్య ధోరణిని విడనాడి బకాయిలన్నీ చెల్లించాలని కోరుతున్నామన్నారు. ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగుల బెన్ ఫిట్స్ బకాయిలను అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకుని యుద్ధ ప్రాతిపదికన చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నామని, లేనిపక్షంలో మున్సిపల్ ఎన్నికల అనంతరం రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగుల పక్షాన భారతీయ జనతా పార్టీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేసేందుకూ వెనుకాడబోమన్నారు. అవసరమైతే హైదరాబాద్ నడిబొడ్డున ఆయా ఉద్యోగుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చే వరకు దీక్ష చేసేందుకు తగిన కార్యాచరణను రూపొందించుకునేందుకు వెనుకంజ వేసే ప్రసక్తే లేదని సిఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

## వేములవాడ, కీసరగుట్ట శివరాత్రి ఉత్సవాలకు సిఎం రేవంత్‌కు ఆహ్వానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి10:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి మహా శివరాత్రి జాతర మహోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఆలయ ఈవో రమాదేవి, ఆలయ అర్చకులు సిఎం రేవంత్‌ను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందించారు. తర్వాత సిఎం రేవంత్‌రెడ్డికి కీసరగుట్ట మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు2026 కూడా రావాల్సిందిగా మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఈవో సుధాకర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేష్, ఆలయ అర్చకులు ఆహ్వాన పత్రాన్ని అందించారు.

# కేంద్ర గ్రాంట్లలో రాష్ట్రానికి కోత

>> వస్తుందని బడ్జెట్‌లో అంచనా వేసింది. అయితే ఆ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుండి కేవలం రూ.8 వేల కోట్లు మాత్రమే వచ్చాయి. అప్పటి నుండి ఇప్పటి వరకూ గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధుల విషయంలో భారీగా కోతలు పడుతూనే ఉంది. రాష్ట్ర సర్కార్ ఆశించిన మొత్తంలో గరిష్టంగా 30 శాతం నిధులు కూడా గ్రాంట్ ఇన్ ఎయిడ్ గా రావడం లేదని ఆర్థిక శాఖ అధికారవర్గాల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లో గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా రూ.22,782.50 కోట్లు వస్తాయని ప్రతిపాదించగా, ఇప్పటి వరకు ఇచ్చింది దాదాపు రూ.3 వేల కోట్లు మాత్రమే. గత ఐదేళ్లుగా రాష్ట్రానికి రావాల్సిన గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధుల్లో కోత పడుతోంది. ఆర్థిక శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం 2024-25 వార్షిక బడ్జెట్‌లో కేటాయించిన రూ.21,636 కోట్లకు గాను రాష్ట్రం కేవలం రూ.7,913.08 కోట్ల మేర గ్రాంట్స్ ఇన్ ఎయిడ్‌ను అందుకుంది. అదే 2023-24లో రూ.41,259.17 కోట్ల బడ్జెట్ అంచనాకు వ్యతిరేకంగా రూ.9,729.91 కోట్లు, 2022-23లో రాష్ట్ర బడ్జెట్‌లో రూ.41,007.73 కోట్లు వస్తాయని లెక్క చూపగా, అందులో రూ.13,179.21 కోట్లు, 2021-22లో బడ్జెట్‌లో రూ.38,669.46 కోట్లు వస్తుందని అంచనా వేయగా, కేవలం 8,619.26 కోట్ల రూపాయలు రాగా, ఇలా రాష్ట్రం ఆశించిన మేర రాకుండా భారీగా కోత పడుతూ వస్తోంది. ఈ ధోరణి గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతోంది. బిజెపి లేదా దాని మిత్రపక్షాలు పరిపాలిస్తున్న రాష్ట్రాలు కేటాయింపులలో మెరుగ్గా ఉన్నాయనేది ఆర్థిక శాఖ వివరాలు స్పష్టం చేస్తున్నాయి. మరోపక్క సీఎస్ఎస్ కింద 2022-23లో 5,387 కోట్ల రూపాయలు, 2023-24లో 6,158 కోట్ల రూపాయలు మాత్రమే తెలంగాణకు కేంద్రం నుంచి అందాయి. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 15,168 కోట్ల రూపాయల మేర కేటాయింపులు చేసింది. కేంద్రం తన వాటాను విడుదల చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్‌లను విడుదల చేయలేదు.

నిధులు అందుకోవడానికి రాష్ట్రం తన వాటాను మ్యాచింగ్ గ్రాంట్‌లలో అందించాలని కేంద్రం వైఖరి స్పష్టం చేస్తోంది. కాగా తగ్గుతున్న పన్నుల రాబడి, పెరుగుతున్న ఆర్థిక ఒత్తిళ్ల నేపథ్యంలో కేంద్రం నుండి కీలకమైన నిధులు రాకపోవడంతో రాష్ట్ర ఖజానా ఆర్థిక పరిస్థితి మరింత ఇబ్బందులు పాలవుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## వారం - వర్జ్యం

11-02-2026, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, ధనిష్ఠ కార్తె
నవమి ఉ.9.58
అనూరాధ ఉ.10.52
వర్జ్యం : సా.5.07-6.54
దు.ఉ.11.59-12.45
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** కొద్దిపాటి మానసిక ఆందోళనకు గురిఅయినా, ఆచరణలో చెడు ఫలితాలను అందుకోరు. విదేశీయాన యత్నాలు ఫలిస్తాయి.

**వృషభం:** విదేశాలలో మీ బంధువుల నుండి సహాయసహకారాలను అందుకుంటారు. వాహనాల కొనుగోలు.

**మిథునం:** ముఖ్యమైన జటిలమైన సమస్యలు పరిష్కారమవుతాయి. సోదరులతో విభేదాలు తలెత్తుతాయి.

**కర్కాటకం :** భూముల విషయంలో ఏర్పడిన వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. ఆరోగ్యం జాగ్రత్త అవసరం.

**సింహం:** సంతాన విద్యా విషయంలో నూతన బాధ్యతలు చేపడుతారు. కొత్త పెట్టుబడులకు అనుకూలం. వస్త్రలాభం.

**కన్య :** రాజకీయ, కళా రంగాలోని వారికి ప్రభుత్వం నుండి ఆహ్వానాలు అందుతాయి. గృహం కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి.

**తుల :** బ్యాంకు ఋణాలు మంజూరవుతాయి. దీర్ఘాలోచనలు కొనసాగుతాయి, నూతన విద్యావకాశాలు పొందుతారు.

**వృశ్చికం:** అన్ని అవకాశాలు అప్రయత్నంగా లభిస్తాయి. వివాదాస్పదమైన అంశాలలో తలదూర్చకండి.

**ధనుస్సు:** ఎంతగానో శ్రమించి వ్యయప్రయాసలకూర్చి ఓ కార్యక్రమాన్ని పూర్తి చేయగలుగుతారు. వాహన సౌలభ్యం.

**మకరం:** విద్యార్థినీ, విద్యార్థులు మరింత శ్రద్ధను కనబరచవలసి ఉంటుంది. ధనం అధికంగా ఖర్చు అవుతుంది. శ్రమ అధికం.

**కుంభం:** నిర్మాణ సంబంధమైన విషయాలు, స్పెక్యులేషన్‌కు సంబంధమైన విషయాలలో ఆచి, తూచి వ్యవహరించండి.

**మీనం :** కుటుంబ సమస్యల పైన దృష్టి సారిస్తారు. స్వయం కృతాపరాధాలు చోటుచేసుకుంటాయి. శుభవార్తలు అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మున్సిపల్ అభ్యర్థి ఆత్మహత్య.. రాజకీయ రగడ

>> బీజేపీ నిరసనలతో మక్తల్‌తోపాటు హైదరాబాద్‌లోనూ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

**బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత...**

మహాదేవప్ప మృతికి కారకులైన వారిని తక్షణమే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శ్రేణులు డీజీపీ కార్యాలయాన్ని ముట్టడించడం ఉద్రిక్తతకు దారితీసింది. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులకు వ్యతిరేకంగా బీజేపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తమకు న్యాయం చేయాలంటూ డీజీపీ కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన బీజేపీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు, ఆందోళనకారుల మధ్య జరిగిన పెనుగులాటలో ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి ఒక్కసారిగా కిందపడిపోయారు. ఈ ఘటనతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. పోలీసులు ఆందోళనకారులను నిలువరించేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. దీంతో పలువురు బీజేపీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీకరెడ్డి, తూళ్ల వీరేందర్ గౌడ్, రవి నాయక్, గణేష్ కుండే, గంధమల్ల ఆనంద్ గౌడ్, ఉమామహేంద్ర, రవి నాయక్ తదితరులు అరెస్టయ్యారు. కాగా... డీజీపీ కార్యాలయ ముట్టడి నేపథ్యంలో మంగళవారం ఉదయం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు.

**ఆత్మహత్య ఘటనను లోక్‌సభలో ప్రస్తావించిన కిషన్‌రెడ్డి....**

మక్తల్ మున్సిపాలిటీలోని 6వ వార్డు నుంచి బీజేపీ తరఫున పోటీ చేస్తున్న ఎస్టీ అభ్యర్థి ఎరుకల మహాదేవప్ప ఆత్మహత్య చేసుకోవడాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లోక్‌సభలో ప్రస్తావించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో ఇలాంటి దారుణం జరగడం దారుణమన్నారు. "నేను గెలవడం ఖాయం. గెలిచిన తర్వాత కూడా నన్ను అధికార పార్టీ వేధిస్తుంది." అని భార్యతో స్పష్టంగా చెప్పి మరీ మహాదేవప్ప ఆత్మహత్య చేసుకున్నారని సభకు వివరించారు. ఈఘటనపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

**రాజ్యసభలో ప్రస్తావించిన ఎంపీ లక్ష్మణ్....**

తెలంగాణ సీఎం సొంత జిల్లాలో మంత్రి వాకిటి శ్రీహరి, అధికార పార్టీ నేతల వేధింపులతో గిరిజన అభ్యర్థి మహాదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం దారుణమని ఎంపీ లక్ష్మణ్ విచారం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ తరఫున బరిలో ఉన్న గిరిజన అభ్యర్థి మహాదేవప్ప ఆత్మహత్య ఘటనను రాజ్యసభలో ఆయన ప్రస్తావించారు. ఈ దారుణ ఘటనను సభాముఖంగా కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చానని అనంతరం రాజ్యసభ ఆవరణలో మాట్లాడుతూ చెప్పారు. ఆత్మహత్యకు బాధ్యులైన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ఈసీకి ఫిర్యాదు చేసిన బీజేపీ....**

మహాదేవప్ప ఆత్మహత్య ఘటన కాంగ్రెస్ నేతల వేధింపుల కారణంగానే జరిగిందని, పోలీసులు అధికార పార్టీ నేతలకు పూర్తిగా సహకరించారని, ఈ అంశంలో విచారణ జరిపి బాధ్యులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని కలిశారు. ఈ కేసు నుండి అధికార పార్టీ నేతలను కాపాడేందుకు పోలీసులు మహాదేవప్ప ఇంటికి వెళ్లి ఆయన కూతురుతో తెల్లకాగితంపై బలవంతంగా రాయించుకున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో ఆ జిల్లా పోలీసు ఎస్పీ, సీఐ, ఎస్సైని ఎన్నికల విధుల నుంచి తొలగించాలని ఈసీకి విన్నవించారు.

**పిరికితనంగా భావించొద్దు... కేంద్రమంత్రి బండి సంజయ్....**

బీజేపీ అభ్యర్థి మహాదేవప్ప మృతిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహాదేవప్పది బలవన్మరణం కాదని కాంగ్రెస్ చేసిన హత్య అని ఆరోపించారు. మా సహనాన్ని పిరికితనంగా భావిస్తారా అని ఫైర్ అయ్యారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పై బీజేపీ యుద్ధం చేయబోతోందని చెప్పారు. బీఆర్ఎస్ అరాచకాలకు ఎదురొడ్డి పోరాడిన చరిత్ర బీజేపీకార్యకర్తలదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసే రోజులు వచ్చాయన్నారు. ఈ మృతిపై నిష్పక్ష దర్యాప్తు జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

**దోషులను కఠినంగా శిక్షించాలి: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి...**

మక్తల్ పట్టణంలో బీజేపీ నేత మహాదేవప్ప మరణానికి అధికార కాంగ్రెస్ నేతల వేధింపులే కారణమని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి తప్పదని ఈ తరహా వేధింపులకు కాంగ్రెస్ దిగుతోందని దుయ్యబట్టారు. సిఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో, మంత్రి వాకిటి శ్రీహరి అసెంబ్లీ సెగ్మెంట్ మక్తల్‌లో బీజేపీ బలంగా ఉందన్నారు.

**డీజీపీ ఆఫీసు వద్ద పోలీసుల దమనకాండ: ఎన్‌వీ. సుభాష్**

ప్రజాస్వామ్య పద్ధతిలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో డిజిపి కార్యాలయం వద్ద బీజేపీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టిందని, కానీ ప్రభుత్వం దమనకాండతో కార్యకర్తలపై, నాయకులపై దాడికి దిగిందని బీజేపీ అధికార ప్రతినిధి ఎన్‌వీ. సుభాష్ మండిపడ్డారు.

# ప్రాణం తీసిన మున్సిపల్ పోరు

## ఒకే కుటుంబం నుంచి ముగ్గురు అన్నదమ్ముల పోటీ.. ఒక తమ్ముడు ఉపసంహారణ.. ఒత్తిడి తట్టుకోలేక అన్న బిజెపి అభ్యర్థి మహాదేవప్ప ఆత్మహత్య

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** మున్సిపాలిటీ ఎన్నకలు ఒకే కుటుంబంలో చిచ్చుపెట్టాయి. నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలోని ఆరో వార్డుఎస్టీ రిజర్వ్ కావడంతో ఒకే కుటుంబం నుంచి ముగ్గురు అన్నదమ్ములు బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్‌నుంచి పోటీలో నిలిచారు. తమ్ముడు బిఆర్ఎస్ అభ్యర్థి తన నామినేషన్ ను ఉపసంహరించుకోగా ఇద్దరు అన్నదమ్ములే బరిలో ఉన్నారు. రోజు లాగే సోమవారం ఎన్నికల ప్రచారానికి మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణ మహాదేవప్పకు మద్దతుగా ప్రచారం నిర్వహించి ఎన్నికల్లో గెలుస్తావని భరోసానిచ్చారు. ప్రచారం ముగించుకొని ఇంటికి వెళ్లిన బిజెపి అభ్యర్థి మహాదేవప్ప అర్థరాత్రి ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. ఈ విషయం తెల్లవారుజామున కుటుంబ సభ్యులకు తెలియడంతో పెద్ద ఎత్తున కార్యకర్తలు నాయకులు వారి ఇంటికి చేరుకున్నారు. బిజెపి అభ్యర్థి అయిన మహాదేవప్ప ఆకస్మిక మరణంతో మక్తల్‌లో విషాద ఛాయలు చోటుచేసుకున్నాయి. మరణానికి నిజానిర్ధారణలు తెలియాల్సి ఉంది. 6వ వార్డు ఎన్నిక ప్రస్తుతానికి వాయిదా పడినట్లు మక్తల్ మున్సిపాలిటీ రిటర్నింగ్ అధికారి శివయ్య ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఆయన ఆత్మహత్యకు గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉన్నది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న మహబూబ్నగర్ ఎంపీ డీకేఅరుణ, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు కి సమాచారం అందివ్వడంతో ఇద్దరు కలిసి పార్టీ శ్రేణులు నాయకులతో మక్తల్ కు చేరుకున్నారు. బిజెపి కార్పొరేటర్ అభ్యర్థి ఆత్మహత్యపై రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ గుండాల బెదిరింపులకే ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు.

**నిజ నిర్ధారణ జరగాల్సిందే..**

పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మక్తల్ ఆరో వార్డు బిజెపి అభ్యర్థి మహాదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం వెనుక అసలు నిజాలు ప్రతి ఒక్కరికి తెలియాలని, బాధ్యులు ఎంతటి వారైనా శిక్ష పడాల్సిందే అని పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాదేవప్ప కుటుంబానికి ఎలా న్యాయం చేయాలో ఆలోచించాల్సిన ఇలాంటి సందర్భంలో బిజెపి నేతలు లక్ష్మణ్, రామచంద్రరావు, డీకే అరుణ రాజకీయాలు చేయడం సరికాదన్నారు.

**ఒక వర్గం నాయకుల బెదిరింపు..**

మక్తల్ మున్సిపాలిటీలో ఒక వర్గానికి చెందిన నాయకులు సోమవారం రాత్రి మహాదేవప్ప ఇంటికి చేరుకొని బెదిరించినట్లు సమాచారం. ఎన్నికల నుంచి తప్పుకోవాలని తమకు సహకరించకుంటే పోటీలో అలాగే కొనసాగితే తదుపరి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని గట్టిగా బెదిరించడం తోనే మహాదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణంలో గుసగుసలు వినిపించాయి. ఏదేమైనా పూర్తి వివరాలు తెలియాలంటే నిజనిర్ధారణ పోస్టుమార్టం పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




పార్లమెంట్ ఆవరణలో మంగళవారం ఆందోళన చేస్తున్న ఆర్జేడీ ఎంపీలు

# నేడే మున్సి'పోల్స్'

>> పరిధిలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు ఈ సెలవు వర్తించనుంది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఓటు హక్కు వినియోగించు కునేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో మాత్రమే ఈ సెలవు వర్తించనుంది. తెలంగాణ వ్యాప్తంగా ఒకే విడతలో మున్సిపల్ ఎన్నికలు జరుగనున్నాయి. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7కార్పొరేషన్లకు పోలింగ్ జరుగనుంది. మొత్తం 12,930 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఎన్నికల పోలింగ్ కోసం 8,203 పోలింగ్ కేంద్రాలు, 16,301 బాలెట్ బాక్సులను ఎన్నికల సంఘం సిద్ధం చేసింది. బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 13న ఫలితాలను ప్రకటించనున్నారు. పోలింగ్ కోసం ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలింగ్ సమయంలో మద్యం షాపులు మూసేయడంతో పాటు, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోనున్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు. 137 స్ట్రాంగ్‌రూమ్‌లు, 136 ఓట్ల లెక్కింపు కేంద్రాలను రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధం చేసింది. అలాగే 742 మంది జోనల్ అధికారులు, 279 ఫ్లయింగ్ స్క్వాడ్, 381 స్క్వాడ్ బృందాలు,1,370 రిటర్నింగ్ అధికారులు, 1,547 ఏఆర్‌వోలు, 9వేల 560 పోలింగ్ అధికారులు, 31 వేల 428 మంది సిబ్బందిని నియమించి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ సంస్థల ఎన్నికల కోసం సుమారు 25 వేల మంది పోలీసు సిబ్బందిని సిద్ధం చేశారు. పోలీసులతో పాటు ఎక్సైజ్, ఫారెస్టు సిబ్బందిని భద్రతలో వినియోగించనున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేశారు. ఎక్కడైనా రీపోలింగ్ అవసరమైతే మరుసటి రోజున నిర్వహిస్తారు. ఈనెల 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఓట్లు లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 2982 వార్డుల్లో 12,930 మంది భవితవ్యం తేలనుంది. రాష్ట్రవ్యాప్తంగా 22,519 మంది అభ్యర్థులు 29,742 నామినేషన్లు వేశారు. అయితే నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ తర్వాత 12,944 మంది బరిలో మిగిలారు. అందులో రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది మున్సిపాల్టీలు, రెండు కార్పొరేషన్లలో 14 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పన్నెండు మంది కాంగ్రెస్ ఇద్దరు బీఆర్ఎస్ అభ్యర్థులు ఏకగ్రీవాలు సాధించారు. కోదాడ మున్సిపాల్టీలో ముగ్గురు వికారాబాద్‌లో ఇద్దరు ఎన్నిక లేకుండానే కౌన్సిలర్లయ్యారు. మహబూబ్‌నగర్, కరీంనగర్ కార్పొరేషన్‌లలో ఒకరు చొప్పున ఏకగ్రీవమయ్యారు. ఆలంపూర్, వికారాబాద్ మున్సిపాల్టీల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలవగా మిగతా 12 చోట్ల కాంగ్రెస్ నాయకులకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్లలోని 2,996 వార్డుల్లో కాంగ్రెస్ 2,948, బీఆర్ఎస్ 2,634, బీజేపీ 2,634 వార్డుల్లో పోటీలో ఉంది. రాష్ట్రంలోని అన్ని వార్డుల్లో కలిపి 2,786 మంది ఇండిపెండెంట్లు బరిలో నిలిచారు. ఆమ్ ఆద్మీ పార్టీ 38, బీఎస్పీ 213, సీపీఎం 128, ఎంఐఎం 282, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ 288, సీపీఐ 168, జనసేన 332 స్థానాల్లో పోటీలో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు యాభైరెండున్నర లక్షల మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో పురుషుల కంటే మహిళ ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. 32 జిల్లాల్లోని 7 కార్పొరేషన్లు, 116 కార్పొరేషన్లలోని 2,996 వార్డుల్లో కలిపి పురుష ఓటర్లు 25 లక్షల62 వేల 369 ఉండగా మహిళలు 26లక్షల 80వేల 014 మంది, థర్డ్‌జెండర్లు 640 ఓటర్లు ఉన్నట్లు ఎస్ఈసీ వెల్లడించింది. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో 52 లక్షల 43,023 మంది ఓటర్లు ఉన్నారు. రాష్ట్రంలోని 32 జిల్లాల్లో(హైదరాబాద్ మినహా) జరుగుతున్న ఈ మున్సిపల్ ఎన్నికలు పట్టణ ప్రాంతాల అభివృద్ధికి దిక్సూచి వంటివి. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికలను అధికార కాంగ్రెస్ తో పాటు ప్రతిపక్ష బిఆర్ఎస్, బిజెపి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. బుధవారం జరిగే మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం: సర్వం సిద్ధం చేసింది. జిల్లా కేంద్రాల నుంచి పోలింగ్ నిర్వహణ సిబ్బందిని ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు పంపించారు.

# నీళ్లను తీసుకుపోతున్న ఎపి

>> అగ్రిమెంట్ ప్రకారం ఏపీ 66 శాతమే వాడాలి. కానీ 80 శాతం వాడిందని పేర్కొన్నారు. చేతులు కాలినంక ఆకులు పట్టుకున్నట్లుఉత్తరాలు రాయడం తప్ప ఏం చేస్తున్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి నీళ్ల తరలించుకుపోతుంటే ఈ ప్రభుత్వం కండ్లు మూసుకు ప్రవర్తిస్తున్నదని మండిపడ్డారు. వేసవి వస్తున్నది, తెలంగాణకు నీటి అవసరాలు ఉన్నయి. పంటలకు, పారిశ్రామిక అవసరాలు ఉన్నాయన్నారు.

తెలంగాణ అవసరాలు పట్టించుకునే బాధ్యత ఈ ప్రభుత్వానికి లేదా..? తాత్కాలికంగా అయినా మనం 34శాతం వినియోగించుకోవాలి కానీ వినియోగించుకున్నది 20 శాతం వాటా. మన రాష్ట్రానికి 174 టీఎంసీలు వాడుకునేది ఉన్నది. అయినా వినియోగించుకోరు. ఈ రోజుకు కూడా ఏపీ 1.5 టీఎంసీల నీళ్ల తీసుకుపోతున్నది. మన పంటలు ఏం కావాలె. మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో పంటల పరిస్థితి ఏం కావాలి. సర్కారు నడుపుతున్నరా..? సర్కస్ నడుపుతున్నరా..? అని ధ్వజమెత్తారు. ఏపీ అడ్డగోలుగా నీళ్ల వాడుతున్నది అడ్డుకోమని ఇప్పుడు లేఖ రాశారు. మేం ప్రశ్నించినప్పుడే మీరు నిద్ర లేచి బాధ్యతగా వ్యవహరించి ఉంటే తెలంగాణకు ఇంత నష్టం అవుతుండేనా..? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నామమాత్రంగా లేఖ రాయడం తప్ప మీరు చేస్తున్నదేం లేదు. 664 టీఎంసీలు ఏపీ తీసుకుపోయిందని ఈఎన్‌సీ కేఆర్ఎంబీకి లేఖ రాస్తే, కేఆర్ఎంబి రాసిన లేఖలో 555 టీఎంసీలు తీసుకుపోయిందని ప్రస్తావించింది. వంద టీఎంసీలు తక్కువ చేసి కేఆర్ఎంబీ చెబుతున్నది అంటే.. అడగాల్సిన రేవంత్ రెడ్డి అడగడు, హక్కులు కాపాడాల్సిన కేఆర్ఎంబీ ఏపీని ప్రశ్నించదు. బీజేపీ ప్రభుత్వం చేతిలో కేఆర్ఎంబీ ఉన్నది. రాష్ట్రంలో ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేసీఆర్ మీద పడి ఏడ్వడం తప్పిదే..నీళ్ల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం గురించి ఎందుకు మాట్లాడరు..? కేఆర్ఎంబీని ఎందుకు నిలదీయరని ప్రశ్నించారు.

# అవిశ్వాసంపై చర్చ పూర్తయ్యే దాకా లోక్‌సభకు రాను!

## - స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కీలక నిర్ణయం తీసుకున్నారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ పూర్తయ్యేంత వరకూ సభకు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. స్పీకర్‌ను తొలగించాలంటూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ సెక్రటరీకి కాంగ్రెస్ నోటీసు ఇచ్చిన నేపథ్యంలో ఓం బిర్లా ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో రాహుల్ గాంధీకి స్పీకర్ అవకాశం ఇవ్వలేదని, నిలదీసిన 8 మంది ఎంపీలపై సస్పెన్స్ వేటువేశారని విపక్షాలు తప్పుపడుతున్నాయి. విపక్షానికి చెందిన మహిళా ఎంపీలు దాడికి ప్రయత్నిస్తారనే సమాచారంతో ప్రధాని ప్రసంగం లేదని సభాపతి స్థానం నుంచి ఓం బిర్లా ప్రకటించడం, మహిళా ఎంపీలపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసిన బీజేపీ ఎంపీపై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ క్రమంలో 118 మంది సభ్యుల సంతకాలతో మంగళవారం ఉదయం లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు విపక్షాలు అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేశాయి. అంతకుముందు అధికార పార్టీకి తలొగ్గి తమపై నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ ఓం బిర్లాకు రాసిన లేఖలో కాంగ్రెస్ మహిళా ఎంపీలు నిరసన తెలిపారు. మరోవైపు బిజెపి మహిళా ఎంపిలు కూడా విపక్ష మహిళా ఎంపిలు ఆరోజు మోడీ సీటు వద్దకు దూసుకురావడంసభా సాంప్రదాయాలను మంటగలపడమేనని, ఈఎంపిలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేసారు. ఆరోజు విపక్ష ఎంపిల నిరసనవల్లనే మోడీ సభలో రాష్ట్రపతి ధన్యవాదం తెలిపే తీర్మానంపై చర్చలోప్రసంగించలేకపోయారని వారు ఆరోపించారు.



ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-2-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 11 పేజీలు: 10+4 వెల: 6.50


అవిశ్వాసంపై చర్చ పూర్తయ్యే దాకా

## సభకు రాను!

- స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా కీలక నిర్ణయం
- పక్షపాతంగా వ్యవహరిస్తున్నారంటూ సభాధ్యక్షుడిపై విపక్షాల నోటీసు

2


జీవనోపాధిని బలోపేతం చేయడానికి, కుటుంబాలను సుసంపన్నం చేయడానికి పశువుల అభివృద్ధి
గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పెంచడానికి పశుసంవర్ధక, మత్స్య మరియు కోళ్ల పెంపకం మౌలిక సదుపాయాలు
GOVERNMENT OF INDIA
CBC 35101/13/0113/2526



వికసిత భారత్ - రోజ్‌గార్ మరియు ఆజీవిక మిషన్ (గ్రామీణ) కోసం హామీ : విబి -జీ రామ్ జీ
(వికసిత భారత్ - జీ రామ్ జీ) చట్టం, 2025
125 రోజులు
వేతన ఉపాధి హామీ




మక్తల్ మున్సిపల్ అభ్యర్థి ఆత్మహత్య

# రాజకీయ రగడ

డిజిపి ఆఫీసు ముట్టడికి బిజెపి శ్రేణుల యత్నం.. తోపులాట.. అరెస్టు



మక్తల్ అభ్యర్థి మహదేవప్ప (ఫైల్)



మంగళవారం డిజిపి కార్యాలయం ముట్టడికి యత్నించిన బిజెపి శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

- సిఎం సొంత జిల్లాలో కాంగ్రెస్ వేధింపులతోనే ఆత్మహత్య
- లోక్‌సభలో ప్రస్తావించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- రాజ్యసభలోనూ లేవనెత్తిన ఎంపి లక్ష్మణ్
- పోలీసులు కేసును నీరుగారుస్తున్నారంటూ ఇసికి బిజెపి ఫిర్యాదు
- ఇది కాంగ్రెస్ చేసిన హత్య: కేంద్రమంత్రి బండి సంజయ్
- నేనెవరికి ఫోన్ చేయలేదు.. అతన్ని చూడలేదు: మంత్రి శ్రీహరి
- ఎలాంటి సూసైడ్ నోట్ దొరకలేదు.. దర్యాప్తు చేస్తున్నాం: డిజిపి

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** మున్సిపాలిటీ ఎన్నికల వేళ నారాయణపేట జిల్లా మక్తల్ చోటుచేసుకున్న బీజేపీ అభ్యర్థి మృతి ఘటన రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. మక్తల్ 6వ వార్డు బీజేపీ అభ్యర్థి మహదేవప్ప మృతిపై బీజేపీ పార్టీ శ్రేణులు భగ్గుమన్నాయి. ఇది ఆత్మహత్య కాదని, కాంగ్రెస్ నాయకులు చేసిన హత్యేనని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయం ముట్టడికి యత్నించగా కేంద్రమంత్రికిషన్‌రెడ్డి ఈఅంశాన్ని ఏకంగా లోక్‌సభలో,రాజ్యసభలో ఎంపీ లక్ష్మణ్ ప్రస్తావించడం ప్రాధాన్యత సంతరించుకుంది. >>2



మంగళవారం భువనగిరిలో పోలింగ్‌కు సిద్ధమవుతున్న సిబ్బంది

# నేడే మున్సి'పోల్స్'

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

- 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో ఏర్పాట్లు
- 52లక్షల మంది ఓటర్లు,12,930 మంది అభ్యర్థులు
- పోలింగ్‌కు మూడంచెల భద్రత
- 13న 136 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు.. ఫలితాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి10:** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బుధవారం పోలింగ్ రోజును సెలవుగా సర్కార్ ప్రకటించింది. ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని ఫ్యాక్టరీలు,షాపులు, పరిశ్రమలకు సెలవు వర్తించనుంది. అంతేకాకుండా, మున్సిపాలిటీల >>2

కేంద్ర గ్రాంట్లలో

# రాష్ట్రానికి కోత

- అంచనా బడ్జెట్‌లో భారీ ప్రతిపాదనలు
- 2024-25లో రూ.21,636 కోట్లకు రూ.9,730 కోట్లు రాక
- కొన్నేళ్లుగా తగ్గుతున్న గ్రాంట్ ఇన్ ఎయిడ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** రాష్ట్రానికి గ్రాంట్ ఇన్ ఎయిడ్ విడుదలలో కేంద్రం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోంది. కేంద్రం నుండి రాష్ట్ర సర్కార్ ఆశించిన మేర గ్రాంట్ ఇన్ ఎయిడ్ రాక పోగా, భారీగా కోతపడుతోంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో రూ.10 వేల కోట్లు వస్తాయని వార్షిక బడ్జెట్‌లో రాష్ట్రం ప్రతిపాదించగా, ఆ ఏడాది కేంద్రం రూ.15 వేల కోట్ల వరకూ విడుదల చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ మరుసటి ఏడాది 2022-23లో రూ.38 వేల కోట్ల మేర గ్రాంట్ ఇన్ ఎయిడ్ >>2



వేములవాడ రాజన్న శివరాత్రి వేడుకల ఆహ్వాన పత్రాన్ని సిఎం రేవంత్‌కు అందజేస్తున్న మంత్రి సురేఖ, అధికారులు

ఇష్టారాజ్యంగా కృష్ణా నీళ్లను

# తీసుకుపోతున్న ఎపి

- సిఎం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏం చేస్తున్నారు?: మాజీ మంత్రి హరీష్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి10:** కృష్ణా నదీ జలాలను ఏపీ అప్పనంగా తీసుకుపోతున్నదని..సీఎం రేవంత్ రెడ్డి మాత్రం జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో కూర్చొని చోద్యం చూస్తున్నాడని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఆరోపించారు. తాను పూర్తి ఆధారాలతో మాట్లాడుతున్నానని పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండెంట్లు లేవు, బోర్డు అనుమతులు లేవు. ఏపీ ఇష్టారాజ్యంగా కృష్ణా నీళ్లను తీసుకుపోతున్నది. తెలంగాణ ఇరిగేషన్ శాఖ కేఆర్ఎంబీకి రాసిన లేఖ ఇది.దీని ప్రకారం 664 టిఎంసీలు అంటే 80శాతం నీళ్లు ఏపీ వాడుకున్నది. ఇంతగా ఏపీ వినియోగిస్తుంటే ముఖ్యమంత్రి, నీళ్ల మంత్రి ఏం చేస్తున్నడని హరీష్ రావు ప్రశ్నించారు. 28 జనవరి నాడు తాత్కాలిక ఒప్పందం 66:34 ప్రకారం దాటి ఏపీ ఇప్పటికే 664 టీఎంసీలు వాడుకున్నదని హరీష్ రావు తెలిపారు. ఇంకా రెండు రోజుల్లో ఏపీ వినియోగం వాటా దాటుతుంది అని కేఆర్ఎంబీకి లేఖ రాసింది.వెంటనే బోర్డు మీటింగ్ పెట్టండి, ఏపీ నీటి దోపిడిని ఆపండి అని ఈఎన్‌సీ రాసిన లేఖలో ఉంది.28న లేఖ రాసిండు, 31న ఈఎన్‌సీ రిటైర్ అయ్యారు. ఈఎన్‌సీ రిటైర్ అయిన తర్వాత వారం రోజుల దాకా పోస్టు నింపలేదు.లెక్కకు మించి నీళ్లు తీసుకుపోతుంటే మనకు ఈఎన్‌సీ పోస్టు నింపలేదు.వారం రోజుల తర్వాత మీడియా ప్రశ్నిస్తే పోస్టు నింపింది.బోర్డు మెంబర్ ఆయన. ఖాళీ పోస్టు ఎందుకు పెట్టారు.వాటా కుదరలేదా..? మాట కుదరలేదా..? వారం రోజులు ఎందుకు ఖాళీగా ఉంచారు.. రాష్ట్ర ప్రయోజనాలు ఈ ప్రభుత్వానికి పట్టదా.. ? అని హరీష్ రావు ప్రశ్నించారు. ఈ వాటర్ ఇయర్‌లో జనవరి 29,2026 నాటికి ఏపీ 664 టీఎంసీలు వాడుకున్నది. టెంపరరీ >>2



# ఉద్యోగులను బాధపెట్టొద్దు

ఉసురు తగులుతుంది..

- పెండింగ్ డిఎలు, రిటైర్డ్ ఉద్యోగుల బెన్‌ఫిట్స్, పిఆర్‌సి బకాయిలు తక్షణమే చెల్లించండి
- సిఎం రేవంత్‌కు కేంద్రమంత్రి బండి సంజయ్ లేఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** తెలంగాణలోని లక్షలమంది ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల, రిటైర్డ్ ఉద్యోగుల వెతలు పడుతున్నారని వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఎం రేవంత్‌రెడ్డిని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ >>2




# యాప్‌తో యాతన

- మా వద్ద ఉన్నవి చిన్న ఫోన్లే.. ఎలా బుక్ చేయాలి..?
- పాత పద్ధతిలోనే యూరియా పంపిణీ చేయండి
- పలుచోట్ల రైతన్నల ఆందోళనలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** రైతులు యూరియా కోసం పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు వ్యవసాయశాఖ ప్రత్యేకంగా యాప్‌ను తీసుకువచ్చినా రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. యూరియా యాప్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూ రైతులు ఆందోళనలకు దిగుతున్నారు. యూరియాకోసం అన్నదాతలు నిద్రాహారాలు మాని రాత్రింబవళ్లు చాంతాడంతా క్యూలలో పడిగాపులుకాయొద్దన్న లక్ష్యంతో తీసుకువచ్చిన ఫర్టిలైజర్ బుకింగ్/యూరియా యాప్‌తోనూ అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదు. యూరియా కావాలనుకునే రైతులు ఎరువుల డీలర్ల వద్దకు, ప్రాథమిక వ్యవసాయ కేంద్రాల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని ప్రభుత్వం చెప్పున్నా యాప్ వినియోగం అర్థం కాక రైతులు గందరగోళానికి గురవుతున్నారు. ముఖ్యంగా అంతంత మాత్రం చదువులతో సేద్యం చేసుకుంటున్న రైతన్నకు మొబైల్ యాప్ ద్వారా ఎరువులను బుక్ చేసుకోవాలంటే కత్తి మీద సాములాగా మారింది. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నప్పటికీ చాలా మంది రైతులవద్ద ఇప్పటికీ ఆండ్రాయిడ్ ఫోన్లు లేకపోవడంతో యూరియా యాప్‌తో రైతన్నల కష్టాలు రెట్టింపవుతున్నాయి. ఇప్పటికీ కీ ప్యాడ్ ఫోన్లనే చాలా మంది రైతులు ఉపయోగిస్తున్నారు. ఒకవేళ ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్నా యాప్‌లో ఎరువులు బుక్ చేయడం, ఓటీపీలు చెప్పడంపై ఏ మాత్రం అవగాహన అన్నదాతలకు >>2




వార్త

జీవితంలో ప్రతి నిమిషాన్ని వ్యర్థం చేయక ఉపయోగించుకో! లేకుంటే నీవు వృథా చేసినట్టి కాలం భవిష్యత్తులో నీ అదృష్టాన్ని తారుమారు చేయగలదు.

-నెపోలియన్

# ఎప్‌స్టీన్ ఫైళ్ల ప్రకంపనలు

కొందరు ప్రముఖుల రహస్య జీవితాలు, వ్యవహారాలను బయటపెడ్తున్న ఎప్‌స్టీన్ ఫైళ్లు ఇప్పుడు ప్రపంచంలోనే కలకలం సృష్టిస్తున్నాయి. అందులో నిజానిజాల లోగుట్టు పెరుమాళ్లకెరుక. అయినా ఆ ఫైళ్లలోని సమాచార నేపథ్యంలో ప్రస్తుతం యూరప్‌లో రాజకీయ సంక్షోభం తలెత్తింది. అమెరికా న్యాయశాఖ విడుదల చేసిన పత్రాలలో ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు సంబంధించి కూడా కొన్ని అవాకులు చెవాకులు ఉన్నాయన్నది ఆ ఫైళ్ల సమాచారంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాధినేతలు, ప్రముఖులు,వారి వందిమాగధులు వగైరా అన్ని శ్రేణులకు చెందిన వారి రహస్య వ్యవహారాలు బట్టబయలవుతున్నాయి. ఉన్నవీ, లేనివీ, కనుగొన్నవీ కూడా పలు ఊహాగానాలతో ప్రపంచ రాజకీయాలను గడగడలాడిస్తున్నాయి.ఉన్నతస్థాయి వ్యక్తులపై ఈఫైళ్ల ద్వారా బయటపడిన విషయాలు, తద్వారా చెలరేగిన ఆరోపణలపై విచారణలు జరుగుతున్నాయి. ఇందులోని సమాచార నేపథ్యంలో కొంతమంది రాజకీయ పార్టీల అధినేతలు మంత్రులు సైతం రాజీనామాలు చేయాల్సి వస్తోంది. ప్రపంచ రాజకీయాల్లో వివిధదేశాల్లో రాజకీయాలు ఎంతో చిత్ర విచిత్రంగా ఉంటాయి. ఆరోపణలు రాగానే కొన్ని దేశాల్లో ఆరోపణలెదుర్కొనవారు నిజానిజాలు వచ్చేలోపున అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం కానీ రాజీనామా చేసి ప్రజాబాహుళ్యం నుంచి అదృశ్యమైపోవడం, లేదా పదవి నుంచి వైదొలగాల్సి రావడం కూడా మామూలుగా జరిగేదే! యూరప్ దేశాల్లో ఎప్‌స్టీన్ ఫైళ్ల దుమారం ఎక్కువగా ఉంది. అమెరికాలో వీటి ప్రభావం ప్రస్తుతం తటస్థంగా ఉండగా, భారత్‌లో మాత్రం ఎవరూ పట్టించుకున్నట్లు లేదు. భారత ప్రధాని నరేంద్రమోడీ, ఆయనకు అనుకూలంగా పనిచేశారని చెప్పబడుతున్న ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ గురించి ఎక్కువ విషయాలు ఈ ఫైళ్ల ద్వారా వెలుగులోకి వచ్చాయి. ఆఖరికి చైనా దేశానికి సింహస్వప్నంగా ఉన్న టిబెట్ మత గురువు దలైలామా గురించి ఆరోపణలు కూడా ఉన్నాయి. ఎప్‌స్టీన్ అనేవ్యక్తి లైంగిక నేరస్థుడు. అమెరికా ఫైనాన్షియల్ ఏనాడో పట్టుబడి జైల్లో ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఆయన పత్రాలు ప్రముఖులందరినీ వేధిస్తున్నాయి. కానీ అతని సామ్రాజ్యం చాలా విస్తృతమైందని, రాజకీయ ప్రముఖు లు వ్యక్తిగత ప్రవర్తనలోని లోపాల గురించి ప్రత్యేకంగా రూపొందించిన పత్రాల్లోని అంశాల్లో అతి ప్రమాదకరమైన సమాచారం ఉందని చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా రాజకుటుంబీకులు, బిలియనీర్లు, రాజకీయ మేధావులు దౌత్యవేత్తలు సైతం 'ఎప్‌స్టీన్' ఉచ్చులో పడ్డారని తెలియ వచ్చింది. ఎప్‌స్టీన్‌ను కలిసిన వారు, కలియని వారు, సోషల్ మీడియా ద్వారా వివిధ వాట్సాప్ సంకేతాల ద్వారా పరస్పరం చర్చించుకుంటూ 'లింక్'లో ఉన్నవా రందరి గురించిన విషయాలు ఈఫైళ్ల ద్వారా బట్టబయ లయ్యాయి. బ్రిటన్‌లో ప్రధానమంత్రి పదవికి ప్రధానంగా ఇబ్బందులేర్పడ్డాయి. అమెరికాలో బ్రిటన్ మాజీరాయబారి మాండెల్సన్‌కు అతనితోలింకులున్నట్లు బయట పడగానే బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సమస్యల్లోపడ్డారు. 2024లో బ్రిటన్ అత్యున్నత దౌత్య పదవిలో మాండెల్సన్‌ను నియ మించారు. కాగా మాండెల్సన్‌కు ఎప్‌స్టీన్‌కు స్నేహపూర్వక లింకులున్నాయని బహిర్గతం కావడంతో గత సెప్టెంబరులోనే ఆయనను బ్రిటన్ ప్రధానికీ స్టార్టర్ తొలగించారు. అలాంటి వ్యక్తిని కీర్‌స్మార్టర్ నమ్మడమంటే పద్ధతిగాలేదనే ఆరోపణలను బ్రిటన్ ప్రధాని ఎదుర్కొంటున్నారు. అంతేకాదు బ్రిటన్ ప్రభుత్వానికి సంబంధించిన అతి కీలక సమాచారాన్ని మాండెల్సన్ ఎప్‌స్టీన్‌కు అందించారన్న ఆరోపణలు తలకెత్తుకున్నారు. తీవ్ర ఆరోపణలున్నా ఈ అంశంలో తనను తప్పుపట్టేదేమీ లేదన్న ప్రధాని పదవికి రాజీనామా ఆలోచన ఏదీ లేదని కీర్‌స్మార్టర్ స్పష్టం చేశారు. అలాంటి నియామకం తన చేతుల మీదుగా జరుగకుండా ఉండాల్సిందన్న అభిప్రాయాన్ని చెబుతూ ఆయనే స్వయంగా విచారం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలోనే స్మార్టర్ చీఫ్ ఆఫ్ స్టాప్ మోర్గాన్ మేక్ స్వీనే రాజీనామా చేశారు. మెండల్సన్ గురించి తానే సిఫార్సు చేసినందున నైతిక బాధ్యతగా తాను రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఇక మరోప్రముఖుడు బ్రిటన్ రాజకుటుంబ సభ్యుడు ప్రిన్స్ ఆండ్రూ కూడా ఎప్‌స్టీన్‌తో సాన్నిహిత్యం ఉన్నవారేనని తేలింది. బ్రిటన్ వాణిజ్య ప్రతినిధిగా ఉన్న సమయంలో ప్రభుత్వ రహస్య నిర్ణయాలు, పెట్టుబడుల వ్యవహారాలను తన అధికారిక పర్యటనలకు సంబంధించిన అంతర్గత విషయాలను ఎప్‌స్టిన్‌కు ఈ మెయిల్స్ ద్వారా సమాచారాన్ని పంపారు. జోర్డాన్‌లో నార్వే రాయబారిగా ఉన్న మోకా జూల్ కూడా రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆమెతోపాటు మరో దౌత్యవేత్తటెర్జే రోడ్‌లారెన్స్‌కు ఎప్‌స్టీన్ నుంచి 10మిలియన్ డాలర్ల లబ్ధి సమకూరింది. స్లోవేకియా జాతీయ భద్రతా సలహాదారు మకోస్లావ్ లజ్కాక్ కూడా పదవిని త్యజించారు. ఏరకమైన పదవి లేకుండానే ఎప్‌స్టిన్ వంటి లైంగిక నేరస్థుడు ఇంతమంది జీవితాలతో ఎందుకుఆడుకున్నాడు. అదే పనిగాప్రముఖుల రహస్య విశేషాలను వెలికి తీసి వారితో సంబంధాలు నెరపి ఈమెయిల్స్‌ద్వారా పరస్పర సమాచారాన్ని రాబట్టి వారి జీవితాలను భ్రష్టు పట్టించాడు. ఇలాంటి ఫైళ్ల ఎలాంటి ఉద్దేశంతో సేకరించినా ప్రముఖుల జీవిత విశేషాలు, వ్యవహారాలు బయటపడడంతోనే ఆయా దేశాల్లో రాజకీయ గందరగోళం చెలరేగుతోంది. పోలాండ్, లాట్వియా లిధువేనియా వంటి దేశాల తోనే కాకుండా ఇంకా రష్యా,ఇతర దేశాల నిఘా సంస్థల నుండి ఏవైనా రహస్య సమాచారంలో ఏవిషయాలు దాగి ఉంటాయన్న అంశాలపై ప్రపంచ నేతలలో గుబులు బయలుదేరింది.

మనలో చాలా మందికి ఏమీ తెలియదు. తెలిసిన కొద్దిపాటి జ్ఞానంతో మనల్ని మనం గొప్పగా ఊహించుకుంటాం. ఇదే మన అజ్ఞానం.



సోక్రటీస్


క్రమశిక్షణ నుండే జీవితం తన విలువను పొందుతుంది. కాబట్టి జీవితపు క్రమశిక్షణ అన్నది జీవితం కంటే చాలా అమూల్యమైనది.



తిరుక్కురళ్

# నిధుల కొరత..నిబద్ధత కరవు

**ఒక్కమాటలో చెప్పాలంటే తెలుగురాష్ట్రాలలోని దాదాపు అన్ని మున్సిపాలిటీలూ తీవ్ర ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్నాయి. దీనికికారణం.స్వయంకృతాపరాధం కొంత ప్రభుత్వాల ఆశ్రద్ధ మరికొంత ప్రధాన ఆదాయ వనరులపై పాలకవర్గాలు చిన్నచూపు. తమకు కావాల్సిన నిధులన్నీ రాష్ట్రప్రభుత్వమే ఇవ్వా లన్న ధోరణితో చాలామంది స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు వాదిస్తున్నారు. దేశంలో పట్టణాభివృద్ధికి ఫైనాన్స్ కమిషన్ ఇచ్చే కోట్లాది రూపాయలను రాష్ట్ర ప్రభుత్వాలు నేరుగా తమకివ్వకుండా తమకిష్టమైన అభివృద్ధి పనులకు వెచ్చిస్తోందని పాలకవర్గాలు వాదిస్తున్నాయి.**



ఎం. నారాయణ స్వామి

అడుగు ముందుకేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. సామర్థ్యం నిరూపించుకొంటేనే సత్కీర్తి సొంతమవుతుంది. పౌరుడికైనా, పురపాలక సంఘానికైనా ఇవి వర్తిస్తాయి. మహాత్ముడు. కలుగన్న గ్రామ స్వరాజ్యానికి బాటలు వేసే స్థానిక సంస్థలు, ఆశించినంతగా ఫలితాల్ని సాధించలేకపోతున్నాయన్నది అక్షరసత్యం. మున్సిపాలిటీల్లోని 'పొలిటిక్స్' ప్రజల పాలిటి ప్రగతి నిరోధకాలవుతున్నాయి. పాలక సంఘాల్లోని అవినీతి కింది నుంచి పైవరకూ చలవలు పలవలు వేసుకుపోతోంది. పైన పర్సనాలిటీలోని మున్సిపాలిటీ పరిహాసాలకు పురపాలక సంఘాలు లోనవుతున్నాయి. స్వాతంత్ర్యం రాకముందు నుంచి జాతిపిత మహాత్మా గాంధీ 'గ్రామస్వరాజ్యమే నిజమైన స్వరాజ్యం' అంటుండే వారు. ఆయన మాటల్లో చెప్పాలంటే పటిష్టమైన స్థానిక సంస్థలు సాగించే స్వపరిపాలనే నిజమైన ప్రజాస్వామ్యానికి దర్పణం. పైస్థాయిలో చట్టాలు రూపొందించే ప్రభుత్వాలు 'అలా చేస్తే' ఇలా జరుగుతుంది. ఈ ఫలితంవస్తుంది అని ఊహించి కాగితాల్లో రాసుకుంటారు. కానీ స్థానిక సంస్థలకు ప్రాతినిధ్యం వహించే ప్రజా ప్రతినిధులు, సభ్యులంతా సామాన్య ప్రజానీకంతో మమేకమై ఉంటారు. సమాజంలో ఏం జరుగుతోంది. ప్రజానీకానికి ఏమేమి అవసరం అన్న విషయాలపై ప్రత్యక్ష అవగాహనను మొదటగా గ్రహించేది స్థానిక సంస్థల పాలకవర్గాలే. స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలో గ్రామీణ భారతావనిని దృష్టిలో పెట్టుకొని వ్యవసాయం వంటిప్రధాన రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. మనిషి పుట్టిన వెంటనే తీసుకోవాల్సిన జనన ధ్రువీకరణ పత్రంతో మొదలుకుని, శాశ్వత నిద్రలోకి వెళ్లాక అతని కుటుంబానికి కావల్సిన మరణ ధ్రువీకరణ పత్రం దాకా ప్రతి రోజూ మున్సిపాలిటీతో ప్రతి ఒక్కరికీ అవసరముంటుంది. సమాజంలోవచ్చే మార్పులు, చట్టాలు, విధానాలకు అనుగుణంగా పౌరులు ఏదో ఒక సమయంలో మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించక తప్పదు. కళ్లముందు కనిపించే కనీస సౌకర్యాల దగ్గర నుంచి పెద్ద ఆకాశ హర్మ్యాల నిర్మాణం వరకూ ప్రతి ఒక్కపనికి మున్సిపాలిటీల అనుమతి అవసరం. చట్టాలు, విధానాలు రూపొందించేది కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలే అయినా దిగువస్థాయిలో వాటిని అమలు చేయాల్సింది, ఫలితాలను మొదట రాబట్టాల్సింది మున్సిపాలిటీలే. క్రమేణా ఏళ్లు గడిచే కొద్దీ అంతర్జాతీయంగా వస్తున్న ఆధునిక మార్పులకు అనుగుణంగా గ్రామీణ భారతావని పట్టణ సొబగులు దిద్దుకుంటోంది. మరో చెంప వ్యవసాయంలో వస్తున్న నష్టాలు, ఇతర చేతివృత్తులకు నిరాదరణ వంటి కారణాల వల్ల పల్లె ప్రాంతీయులు పట్టణాలకు వలసపోవడం ప్రారంభమైంది. మరో కోణంలో పెద్దపెద్ద గ్రామాలన్నీ ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న జనాభాతో చిన్న చిన్నపట్టణాలుగా, అప్పటి వరకూ చిన్నచిన్న పట్టణాలుగా ఉన్నవి కాస్తా మెగాసిటీలుగా రూపాంతరం చెందాయి. చెందుతున్నాయి. గత అర్ధ శతాబ్దపు భారతదేశ చరిత్రను పరిశీలిస్తే మున్సిపాలిటీల సంఖ్యతో పాటు వాటి పరిధి అనూహ్యంగా పెరుగుతున్న దృశ్యాలు కళ్ళ ముందుంటాయి. ఆధునిక జీవనం వైపు మనిషి చూపుతున్న మొగ్గుకూడా పట్టణ ప్రాంతాల విస్తరణకు మరో కారణం. క్రమేణా పచ్చని చెట్లతో అలరారుతున్న ప్రాంతాలన్నీ 'కాంక్రీట్ జంగిల్స్'గా మారుతున్న ఈఆధునిక యుగంలో వీటిని పాలించే మున్సిపాలిటీలు, వాటి పాలక వర్గాలకున్న ప్రాధా న్యం అపారమైంది. 1992ముందు ఆ తర్వాత ఇలామున్సిపాలిటీల పనితీరును, నిర్మాణాన్ని మన దేశంలో రెండు రకాలుగా విభజించారు.పి.వి.నర్సింహారావు ప్రధాన మంత్రి గా ఉన్న కాలంలో 1991 లో పార్లమెంటు




ఆమోదించిన 74వ రాజ్యాంగసవరణతో పురపాలక సంఘాల పాలనలో కొత్త శకం ఆరంభమైందని చెప్పవచ్చు.'నగర పాలికా 'యా'గా పేరొందిన ఈచట్టంతో మున్సిపల్ కౌన్సిళ్ల నిర్మాణం, ఎన్నికల్లో పెనుమార్పులు జరిగాయి. యాల్లో పేర్కొన్న అధికారాలను మున్సిపాలిటీలకు ఇవ్వాలా వద్దా అన్న విచక్షణాధికారాన్ని రాష్ట్రాలకు కట్టబెట్టడం కొత్తసమస్యలకు దారి తీసింది. ఈఅధికారాన్ని అటు రాష్ట్రప్రభుత్వాలు, ఇటు మున్సిపాలిటీల పాలకవర్గాలు కొత్త రాజకీయ సంగ్రామాలకు ఆసరాగా చేసుకున్నాయి. సాధరణంగా రాష్ట్రాన్ని పాలించేది ఒక రాజకీయ పార్టీ అయితే ఆ రాష్ట్రంలోగల మున్సిపాలిటీలు ఒక్కోసారి సగం, అంతకన్నా ఎక్కువగా ప్రతిపక్షాల చేతిలో ఉండటం మాములైంది. ఆంధ్రరాష్ట్రం విభజించక ముందు మొత్తం 1985లో వీటిలో 94 మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించారు. అప్పుడు రాష్ట్రాన్ని పాలిస్తున్న తెలుగుదేశం పార్టీ34 మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటే, కాంగ్రెస్ పార్టీ 42 స్థానాలతో మెరుగైన స్థితిలో నిలిచింది. ఇక అక్కడితో మొదలైంది రాజకీయ పోరాటం. మున్సిపల్ విధిగా మూడు నెలలకోమారు సమావేశమై పట్టణ ప్రజలసమస్యలపై పరిష్కారాలకు నిధులు కేటాయిస్తూ తీర్మానాలు చేయాలి. ఈ సమావేశాలు మొక్కుబడి తంతుగా సాగుతున్నాయనే అభిప్రాయం ఉంది. కౌన్సిలర్లు వ్యక్తిగత కక్షలు, రాజకీయ విభేదాలతో, వాగ్వివాదాలకు, ఘర్షణలకు దిగుతున్నారు. స్వచ్ఛందంగా అభివృద్ధికి పాటు పడాల్సిన చాలామంది కౌన్సిలర్లు, వార్డుసభ్యులు అభివృద్ధి పనుల కాంట్రాక్టుల్ని దక్కించుకోవడానికి పోటీ పడుతున్నారు. ఆదాయ వనరులపట్ల నిర్లక్ష్యం చూపడంతోపాటు అభివృద్ధి పనులు దుర్వినియోగం మామూలైంది. వివిధ సంక్షేమ పథకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధుల వినియోగానికి మున్సిపాలిటీలు పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఈపనులు కాంట్రాక్టుల కోసం కౌన్సిలర్ల మధ్య పోటీ సాధారణమైంది. పరస్పరావగాహనతో ఒడంబడిక కుదరనప్పుడు ఆయా పనుల్లో ఎంతెంత అవినీతి జరిగింది? ఎవరెవరికి ఎన్ని ముడుపులందాయోనన్న విషయాలుమున్సిపల్ సమావేశాల్లో బయటపడుతున్నాయి. 1965 మున్సిపాలిటీల చట్టం ఎన్నోవిధులు, బాధ్యతలను పురపాలక సంఘాలకు కల్పించింది.చట్టప్రకారం మున్సిపాలిటీలు నిర్వర్తించాల్సిన విధులు పదిహేనుకు పైగా ఉన్నాయి. వాటిని తుతూ మంత్రంగానే చేపడుతున్నారు. అవి మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల వ్యవస్థ, పారిశుద్ధ్యం, అంటువ్యాధుల నివారణ, అనాధశవాలకు అంత్యక్రియలు, ఆహార పదార్థాల్లో కల్తీ నివారణ,రోడ్లనిర్వహణ విద్యుచ్ఛక్తిసౌకర్యం, ముఖ్యగణాంకాల సేకరణ, మార్కెట్ల నిర్వహణ, నిర్మాణ వ్యవహారాలు, పన్నుల వసూళ్లు. వీటన్నింటి బాధ్యతలన్నీ సక్రమంగానిర్వహించి ప్రజాభివృద్ధికి మున్సిపాలిటీలు దోహదపడాలి. మున్సిపల్ కౌన్సిల్లో సర్వసభ్య సమావేశాల మినిట్స్ పుస్తకాలను, పన్నుకట్టే ప్రతి పౌరుడూ ఎప్పుడైనా వెళ్లి పరిశీలించవచ్చు. ఆ సమావేశాల ఎజెండా తీర్మానాల ప్రకారమే ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టాలని చట్టం నిర్దేశిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో సంక్షేమ పథకాల అమల్లో కనిపిస్తున్నంత చురుకుదనం, పట్టణ ప్రాంతాల్లో కానరావడం లేదు. జన్మభూమి, క్లీన్ అండ్ గ్రీన్ వంటి పథకాల అమలు తీరును ఇందుకు నిదర్శనాలుగా చెప్పాలి. గతంలో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వర్ణజయంతి షహరిరోజ్ గార్ యోజన అమలు తీరు మరోప్రబల నిదర్శనం.కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అమలయ్యే ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 75శాతం, రాష్ట్రప్రభుత్వం 25శాతం నిధులు ఇస్తాయి.ఈపథకం కింద గతంలో అమలైన కొన్నిపథకాల్ని, కొత్తగా మరికొన్నింటిని ఒకే గొడుగు కిందకు తెచ్చారు. ఈ పథకానికి విడుదలైన నిధుల్నీ,వినియోగం తీరును ఒక్కసారి పరిశీలిస్తే మున్సిపాలిటీల పనితీరు ద్యోతకమవుతుంది.నిధుల వినియోగం చురుగ్గా లేకపోవడానికి పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం, బ్యాంకర్ల సహకారాలు అందకపోవడమేనని మున్సిపల్ పాలకవర్గాలు వాదిస్తున్నాయి. ఒక్కమాట లోచెప్పాలంటే తెలుగురాష్ట్రాలలోని దాదాపు అన్ని మున్సిపాలిటీలూ తీవ్ర ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్నాయి. దీనికికారణం.స్వయంకృతాపరాధం కొంత ప్రభుత్వాల ఆశ్రద్ధ మరికొంత ప్రధాన ఆదాయ వనరులపై పాలకవర్గాలు చిన్నచూపు.తమకు కావాల్సిన నిధులన్నీ రాష్ట్రప్రభుత్వమే ఇవ్వాలన్న ధోరణితో చాలామంది స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు వాదిస్తున్నారు. దేశంలో పట్టణాభివృద్ధికి ఫైనాన్స్ కమిషన్ ఇచ్చే కోట్లాది రూపాయలను రాష్ట్ర ప్రభుత్వాలు నేరుగా తమకివ్వకుండా తమకిష్టమైన అభివృద్ధి పనులకు వెచ్చిస్తోందని పాలకవర్గాలు వాదిస్తున్నాయి.

-సీనియర్ జర్నలిస్టు

# స్టాక్ మార్కెట్‌కు ముప్పు తప్పదా?

మహమ్మద్ ఆరిఫ్

పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కొందరిని మెప్పించగా.. మరికొందరిని నిరాశపర్చింది. బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజు దీని ప్రభావం స్టాక్ మార్కెట్‌పై కూడా పడింది. ఈ బడ్జెట్‌లో స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌కు సంబంధించి ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ విభాగంలో తీసుకున్న నిర్ణయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇది మదుపర్లకు భద్రతగా కొందరు విశ్లేషిస్తుండగా.. మరికొందరు భవిష్యత్తులో మార్కెట్‌కు ముప్పు తప్పదేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.తాజా బడ్జెట్‌లో కేంద్రం డెరివేటివ్స్ మార్కెట్‌కు సంబంధించి పన్నులను భారీగా పెంచింది. స్పెక్యులేషన్‌ను తగ్గించే పేరుతో ఎస్‌టీటీ (సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్) రేట్లను సవరించింది. ఈక్విటీ ఫ్యూచర్స్ ట్రేడింగ్ పై ఇప్పటి వరకు ఉన్న 0.02శాతంగా ఉన్న పన్నును 150శాతం పెంచుతూ 0.05 శాతానికి పెంచింది. మరీ ముఖ్యంగా రిటైల్ ట్రేడర్లు ఎక్కువగా ఆసక్తి చూపించే ఆప్షన్స్ ట్రేడింగ్‌లో ప్రీమియం విలువపై ఇప్పటి వరకు విధిస్తున్న 0.10శాతం ఎస్‌టీటీను 50 శాతం పెంచుతూ 0.15 శాతానికి చేర్చింది. ఫ్యూచర్స్ ఎక్సర్ సైజ్ చేసేటప్పుడు ఉన్న0.125 ఎస్టీటీని కూడా 20 శాతం పెంచి 0.15 శాతానికి తీసుకెళ్లింది. ఈ పెంపు ట్రేడర్లలో గందరగోళానికి దారితీసింది. ఈ పన్ను పెంపులను సామాన్యుల రక్షణ కవచంగా కొందరు అభివర్ణిస్తున్నారు. గతంలో విడుదలైన నివేదికల ప్రకారం ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ విభాగంలో ట్రేడింగ్ చేస్తున్న వారిలో 90 శాతం మంది నష్టాల పాలవుతున్నారు. స్టాక్‌మార్కెట్ పై పరిజ్ఞానం లేనియువత, వేతనజీవులు త్వరగా సంపన్నులవ్వాలనే ఆశతో ఇందులో దిగిఉన్నది పోగొట్టుకుంటున్నారు. పన్నులు పెంచడం ద్వారా వీరిప్రవేశాన్ని కఠినతరం చేసినట్లవుతుంది. మరోవైపు స్టాక్ మార్కెట్ అనేది సంపద సృష్టికి వేదిక. కానీ క్షణాల్లో లాభ నష్టాలను తేల్చే జూదశాలగా కొందరు మార్చేశారు. అధిక పన్నుల వల్ల స్పెక్యులేషన్ ఆధారంగా జరిగే ట్రేడింగ్ తగ్గి,పెట్టే పెట్టుబడులు స్థిరమైన ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లవైపు మళ్లే అవకాశముంది. చిన్న మొత్తాలతో పెద్ద రిస్క్ తీసుకునే ధోరణిని తగ్గించి ప్రజల్లో పొదుపు, సురక్షితమైన పెట్టుబడి అలవాట్లను ప్రోత్సహించడానికి ఈ పన్ను పెంపు దోహదపడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పన్ను పెంపువల్ల మార్కెట్ పై ప్రతికూల ప్రభావంపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే ఆందోళనలు సైతం వ్యక్తమవుతున్నాయి. మార్కెట్ సజావుగా సాగాలంటే కొనుగోలు, అమ్మకందారుల రద్దీ (లిక్విడిటీ/ వాల్యూమ్) ఉండాలి. పన్ను భారం వల్ల ట్రేడర్లు మార్కెట్ నుంచి తప్పుకుంటే ట్రేడింగ్ పరిణామం భారీగా పడిపోతుంది. దీనివల్ల పెద్ద ఇన్వెస్టర్లు తమ షేర్లను అమ్ముకోవాలన్నా, కొనాలన్నా ఇబ్బంది అవుతుంది. ఇది మార్కెట్ పతనానికి దారితీయొచ్చుననే ఆందోళన సైతం ఉన్నది. మ్యూచువల్ ఫండ్స్, బీమా సంస్థలు తమ నష్టాలను తగ్గించుకోవడానికి ఎఫ్అండ్ ఓ మార్కెట్‌ను వాడుకుంటాయి.ఇప్పుడు పన్నుల పెంపుతో ఇదిఖరీదైన వ్యవహారంగా మారుతుంది. పరోక్షంగా ఈభారం మళ్లీసామాన్య మదుపర్లపైనే పడుతుంది. ●

# బడుగులకు ఆర్థిక వనరులపై సమాన హక్కు



డా. సునీల్ కుమార్ పోతన

ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధన 2030నాటికి పేద, బడుగువర్గాలకు ఆర్థిక వనరులపై సమాన హక్కులను అందించాలి. భూమి, ఆస్తి,వారసత్వం, సహజ వనరులు, సాంకేతికత, మైక్రోఫైనాన్స్ వంటి ఆర్థిక సేవలతో సహా ప్రాథమిక సేవలను అందించాలి. భారతదేశంలో విస్తారమైన జనాభా, సామాజికఆర్థిక అసమానతలు, ప్రాంతీయ అసమానతలు, చారిత్రక అడ్డంకులతో ఈలక్ష్యాన్ని సాధించడం సంక్లిష్టంగా కనిపిస్తోంది. సేవలు, వనరులను అందించడంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, విద్య,జల్ శక్తి, పెట్రోలియం సహజ వాయువు, కమ్యూనికేషన్లు, గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాలు వంటి వివిధ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు కీలకపాత్ర పోషిస్తాయి. కేవలం విధాన రూపకల్పన మాత్రమే కాకుండా అట్టడుగున ఉన్నవారికి సేవలను సమర్థవంతమైన అమలుతో అందించాలి.ప్రధాన మంత్రి ఆవాస్ యోజన వంటి కార్యక్రమాల ద్వారా భారతదేశం కొంత పురోగతి సాధించింది.మహిళా యాజమాన్యంలోని గృహాలు సహా పేదలకు సరసమైన గృహాలను అందించే లక్ష్యాన్ని ప్రభుత్వం పెట్టుకుంది. 2025 నాటికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 1.1 కోట్లకు పైగా ఇళ్ళు మంజూరు చేసినట్లు ప్రభుత్వ నివేదికలు వెల్లడిస్తున్నాయి. వీటిలో గణనీయమైన భాగం మహిళల పేరుతో ఉన్నాయి. మహిళలకు ఆస్తి, ఆర్థిక భద్రతలో మెరుగుదలను ప్రతిబింబిస్తుంది. కానీ, భూమిపై యాజమాన్యం ఒక ప్రధాన సవాలుగా మిగిలిపోయింది. మహిళల భూమి హక్కులకు చట్టపరమైన నిబంధనలున్నప్పటికీ సామాజిక నిబంధనలు, వారసత్వ పద్ధతులు, ఆస్తిపై మహిళల నియంత్రణను పరిమితం చేస్తూనే ఉన్నాయి. గ్రామీణ భారతదేశంలో మహిళలు ఇప్పటికీ భూ యజమానులుగా ఉన్నారు. భూమిపై నిజమైన సాధికారతను సాధించలేదు. గ్రామీణ, గిరిజన వర్గాలలో భూమి రికార్డులు, వివాదాలు, అసమాన వారసత్వ పద్ధతులతో ఇది మరింత క్లిష్టంగా మారింది. విధాన ఉద్దేశం, వాస్తవ యాజమాన్యం మధ్యఅంతరం కీలకమైన అవరోధంగా ఉంది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రధాన పథకం 'ఆయుష్మాన్ భారత్. బడుగు వర్గాల కుటుంబాలకు ఆరోగ్య కవరేజీని అందించడం లక్ష్యం.వివిధ రకాల అనారోగ్యాలకు ఉచిత చికిత్సను అందిస్తోంది. సానుకూల దశ అయినప్పటికీ రాష్ట్రాలు, ప్రాంతాలలో ఆరోగ్య సేవల ప్రాప్యత అసమానంగా ఉంది. గ్రామీణ ప్రాంతాలు ఇప్పటికీ వైద్యులు, ఆసుపత్రులు, రోగనిర్ధారణ సౌకర్యాల కొరతను ఎదుర్కొంటున్నాయి. ఆరోగ్య కవరేజ్ ఎల్లప్పుడూ నాణ్యమైన సంరక్షణకు హామీ ఇవ్వదు. విద్యలో సమగ్ర శిక్ష, మధ్యాహ్నభోజన పథకంవంటి ప్రభుత్వ కార్యక్రమాలు నమోదు రేట్లను మెరుగుపరిచాయి.ప్రాథమిక విద్య నమోదు సార్వత్రిక స్థాయికి దగ్గరగా చేరుకుంది. కాలక్రమేణాడ్రాపౌట్



రేట్లు తగ్గాయి. కానీ, ముఖ్యంగా వెనుకబడిన సమూహాలలో అభ్యాస ఫలితాలు అసమానంగా ఉన్నాయి. డిజిటల్ విద్యా సాధనాల లభ్యత మెరుగుపడిన ఇంటర్నెట్ కనెక్టివిటీ, పరికర ప్రాప్యత పరిమితంగా ఉన్నగ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ అంతరాలు కొనసాగుతున్నాయి. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గృహ సదుపాయం మెరుగుపడింది. కానీ పట్టణ ప్రాంతాల్లో నిరాశ్రయుల సమస్య, అనధికారిక స్థావరాలు కొనసాగుతున్నాయి. అందరికీ, ముఖ్యంగా వలస కార్మికులు,మురికివాడల్లో నివసించే తక్కువ ఆదాయకుటుంబాలకు సరసమైన గృహాలను నిర్ధారించడంలో సవాళ్లను గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఎదుర్కొంటోంది. ప్రధాన మంత్రి ఉజ్వల యోజనతో గ్రామీణ గృహాలకు ఎల్‌పిజి వంట గ్యాస్ అందుతోంది. 2025 నాటికి 99 శాతం కంటే ఎక్కువ గృహాలు శుభ్రమైన వంట ఇంధనాన్ని పొందుతున్నాయి. వాయు కాలుష్యం, ఆరోగ్య ప్రమాదాలను గణనీయంగా తగ్గిస్తుంది. దుర్బల జనాభాకు ప్రాథమిక ఇంధన వనరును అందించడంలో ఇది ఒకప్రధాన విజయం. ప్రతి గ్రామీణ ఇంటికి నల్లాల ద్వారా నీటి సరఫరాను అందించడం లక్ష్యంగా పెట్టుకున్న జల్ జీవన్ మిషన్ ద్వారా జల్‌శక్తి మంత్రిత్వ శాఖ గణనీయమైన పురోగతిని సాధించింది. 2025 నాటికి గణనీయమైన సంఖ్యలో గృహాలు నల్లాల ద్వారా నీటి సరఫరాను పొందుతున్నాయి. అనేక గ్రామీణ ప్రాంతాలు ఇప్పటికీ అడపాదడపా నీటి సరఫరా, నాణ్యతా సమస్యలు, కాలానుగుణ కొరతను ఎదుర్కొంటున్నాయి. స్వచ్ఛభారత్ మిషన్‌తో మెరుగైన పారిశుధ్య వసతి కలిగింది. కానీ మౌలిక సదుపాయాలను నిర్వహించడంలో ముఖ్యంగా మారుమూల ప్రాంతాలలో సవాళ్లు మిగిలిఉన్నాయి. ఆర్థిక చేరిక రంగంలో లక్షలాది మందికి ప్రధాన్ మంత్రి జన్‌ధన్ యోజనతో బ్యాంకు ఖాతాలను తెరిచింది. ఈ పథకంకింద 45కోట్లకు పైగా ఖాతాలు తెరిచినట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.అనేక గృహాలకు ఆర్థిక సేవలు, ప్రత్యక్ష ప్రయోజన బదలీలు,అధికారిక బ్యాంకింగ్‌కు ప్రాప్యతను మెరుగుపరిచింది. అదనంగా, ముద్రా వంటి మైక్రోఫైనాన్స్, క్రెడిట్ పథకాలతో మాల్ వ్యవస్థాపకులు స్వయం ఉపాధి పొందుతున్నారు. చాలా మందికి అధికారిక రుణం అందుబాటులో ఉండటం పరిమితంగానే ఉంది. పూచీకత్తులేకపోవడం, సంక్లిష్టమైన డాక్యుమెంటేషన్, అధిక లావాదేవీ ఖర్చులతో తరచుగా అనధికారిక రుణదాతలపై గ్రామీణ కుటుంబాలు ఆధారపడుతున్నాయి. మైక్రోఫైనాన్స్ విస్తరించినా ఒకే విధంగా అందుబాటులో లేదు. అధిక వడ్డీ రేట్లు, తిరిగి చెల్లించే ఒత్తిళ్లు వంటి సమస్యలు రుణగ్రహీతలను ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. ప్రభుత్వ పథకాల అమలులో లింగఅసమానతలను తగ్గించాలి.షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ), మైనారిటీలు వంటి అట్టడుగు వర్గాలను చేర్చడం అవసరం. మహిళల సాధికారత లక్ష్యంగా అనేక పథకాలను ప్రవేశపెట్టింది.ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది. గృహ ఆర్థిక అంశాలపై మహిళల నియంత్రణ ఇప్పటికీ అనేక ప్రాంతాలలో పరిమితంగా ఉంది. బలహీన వర్గాలకు ప్రాథమిక సేవలు,ఆర్థికఅవకాశాలను పొందడంలో నిర్మాణాత్మక అడ్డంకులున్నాయి. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల వైపు భారతదేశ పురోగతి మిశ్రమంగాఉంది.ఒక వైపు, వివిధ మంత్రిత్వశాఖలలో చేపట్టిన ప్రభుత్వ చొరవలతో ప్రాథమిక సేవలు,ఆర్థిక చేరిక, స్వచ్ఛమైన విద్యుత్ ప్రాప్యత మెరుగైంది. 2030నాటికి లక్ష్యాలను సాధించాలంటే మంత్రిత్వశాఖల మధ్య బలమైన సమన్వయం,అట్టడుగు స్థాయిలో మెరుగైన అమలు,అసమానతలను తగ్గించడంపై దృష్టిఅవసరం. ●

# ప్రజావాక్కు



### నిబంధనలను ఉల్లంఘిస్తున్న వాట్సాప్

భారతదేశంలో ప్రజా సంభాషణల విధానాన్ని సమూలంగా మార్చిన సందేశ మార్పిడి వేదిక వాట్సాప్. వ్యక్తిగత సంభాషణల నుంచి వాణిజ్యలావాదేవీల దాకా, కుటుంబ సమూహాలనుంచి కార్యాలయసమన్వయం వరకూ స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి వ్యక్తి దైనందిన జీవితంలో ఈ వేదిక ఒక అనివార్య భాగమైంది. అటువంటి పరిస్థితుల్లో, ఇటీవలి కాలంలో భారత అత్యున్నత న్యాయస్థానం చేసిన గంభీర వ్యాఖ్యలు దేశడిజిటల్ భవిష్యత్తుపై సుదీర్ఘ ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ పరిణామాలు కేవలం ఒక సంస్థకు సంబంధించినవి కావు, ఇవి కోట్లాది మంది భారతీయుల డిజిటల్ హక్కులకు సంబంధించినవి. ఈ వ్యవహారానికి ప్రధాన నేపథ్యం 2021లో సదరు సంస్థ తన గోప్యతా విధానంలో చేసిన వివాదాస్పద మార్పులు. వినియోగదారుల వ్యక్తిగత సమాచారాన్ని తన అనుబంధ సామాజిక మాధ్యమ వేదికలతో పంచుకునేలా నిబంధనలను రూపొందించడం జరిగింది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### దోమల బెడదను నివారించాలి

రాష్ట్రంలో దోమలు అధికంగావిహరిస్తూఉన్నాయి. దీంతో ప్రజలకు డెంగీ, మలేరియా, టైఫాడ్ వంటి జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. సాయంత్రం వేళ బయట వాకింగ్ చేస్తున్న పెద్దలు,బయట ఆడుతున్న పిల్లలు విపరీతమైన దోమలతో ఇబ్బందిపడుతున్నారు. దోమల నివారణకు రాష్ట్ర ప్రభుత్వంచర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యం పై దృష్టి సారించి సంబంధిత అధికారులను అప్రమత్తం చేయాలి.వేసవికాలం ప్రారంభమౌతున్న నేపథ్యంలో వేడి నుండిఉపశమనానికైఆరుబయటకు వస్తారుకావునా దోమలబారి నుండికాపాడాల్సిన భాధ్యతప్రభుత్వంపైనే ఉంది.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### పెరుగుతున్న వాయు కాలుష్యం

దేశంలో మహానగరాలు వాయుకాలుష్య కోరల్లో చిక్కుకునిఉన్నాయి.దేశరాజధాని అందులో ప్రధానంగా ఉంది. ప్రకృతి రక్షణ, అవసరాల నియంత్రణ మరచిపోతే తెలియకుండానే హానికరవాయువులు విస్తరించి వింత వ్యాధులు ప్రబలి, వైద్యానికి నోచుకొని దుస్తితి వస్తుంది. ఇది ఏరీతిలోమనిషికి మంచిది.వాయుకాలుష్యాన్ని అరికట్టాలి.

- బి. మేఘనాదం, విశాఖపట్నం

### చెత్తతో విద్యుత్ ఉత్పత్తి

తమిళనాడు ప్రభుత్వం ఆరాష్ట్రంలో పేరుకుపోతున్న లక్షల టన్నుల చెత్తను తగల బెట్టకుండా దానిని శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించి విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి సంకల్పించిదని వార్తలో చదవడం జరిగింది. ఇటువంటి పద్ధతి మరీ కొత్త విషయం కాకపోయినా ఈదశగా ప్రయత్నాలు చేయడం లేదు. మన తెలుగు రాష్ట్రాలు తమ అధికారులను తమిళనాడుకు పంపి వారు తీసుకున్న సాంకేతికతను తెలుసుకుని మనవాళ్ళు కూడా విద్యుతుత్పత్తి చేస్తే కరెంటు కొరత తగ్గుతుంది. రాబడి పెరుగుతుంది. కాదేదీ కవితకనర్హం అన్నట్టు సరిగా ఉపయోగించుకోవడం తెలిస్తే పనికిరాని వస్తువేదీ ఉండదు.

- ఎన్.రామలక్ష్మి, సికింద్రాబాద్

### భూమి కబ్జాలను ఆపాలి

రెవిన్యూ కార్యాలయంలో ప్రతి భూమి సర్వే నంబర్, విస్తీర్ణం, మ్యాపులు ఉండాలి. ప్రభుత్వం ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన కాలనీ వివరాలు అన్ని ఉండాలి. కానీవరంగల్ జిల్లాలో భూమి కబ్జాలు, అక్రమ నిర్మాణాలు ఎక్కువగాజరుగుతున్నాయి. రెవిన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని కబ్జాలు చేసిన వారిని,అక్రమ నిర్మాణం చేసిన వారిని పట్టించు కోవడం లేదు. రెవిన్యూ అధికారులు రికార్డులులేవుఅంటున్నారు. భూమికబ్జాలకు రాజకీయజోక్యం తోడుగా ఉంటుంది.అధికా రులు రికార్డులు లేవు అని సాకులు చెప్పి రోజులు నెలలు సంవత్సరాలు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీనితో భూమి కబ్జాలు ఎక్కువ అవుతు న్నాయి. భూమిని కోల్పోయిన వాళ్లు రెవిన్యూ అధికారులకు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం వీరికి సహాయం చేయాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### మొక్కజొన్న దిగుమతులు ఎందుకు?

అమెరికాతో వాణిజ్యఒప్పందానికి భారత్ఎందుకు తల ఊపింది అన్నదే ప్రధాన ప్రశ్న. అయితే అంత చేసి ఒక్క 2.5 కిలోల మొక్కజొన్న ఒక్కమనిషికి అన్నదిమాత్రమే.అక్కడి అధికారులు భారత్‌ను ఉద్దేశిస్తూ అన్న మాటలు ఆమెరికా వాణిజ్య కార్యదర్శిమాట్లాడుతూ ఇంత సిరిసంపదలు ఉన్నభారత దేశం ఒక్క మనిషి కి 2.5 కిలోల మొక్కజొన్న కొనలేదా అన్నది ఆయన వేసేప్రధాన ఆరోపణలు. ఈనేపథ్యంలో నుండిఅమెరిక జిత్తుల మారితనాన్ని అర్థంచేసుకోవాలి.భారత్‌లో మొక్కజొన్న ప్రధాన పంటలలోఉన్నది.మళ్లీ దిగుమతిఎందుకు అనేది ప్రధాన ప్రశ్న.

- భారత అవినాష్, జనగామ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# లోక్‌సభ స్పీకర్‌పై విపక్షాల అవిశ్వాసం

## పక్షపాతంగా వ్యవహరిస్తున్నారంటూ లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు నోటీసు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:** బడ్జెట్ సమావేశాల సందర్భంగా పార్లమెంట్‌లో గందరగోళం నెలకొంటోంది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు అవిశ్వాస తీర్మానానికి సిద్ధం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. స్పీకర్ తమ గొంతుకను నొక్కేస్తున్నారని, పక్షపాతంగా వ్యవహరి స్తున్నారని పేర్కొంటూ లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చింది. ఈ నోటీసుపై 118 మందికిపైగా ప్రతిపక్ష ఎంపీలు సంతకాలు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 94సీ ప్రకారం నోటీసు ఇచ్చినట్టు కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ తెలిపారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ), డీఎంకేతో సహా పలు ప్రతిపక్ష పార్టీలకు చెందిన 120 మంది ఎంపీలు నోటీ సుపై సంతకాలు చేశారని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజన అంశాలను విపక్షం లేవనెత్తకుండా స్పీకర్ పదేపదే అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. విపక్ష సభ్యులు మాట్లాడటానికి అనుమతించడం లేదని, అది వారి ప్రాథమిక హక్కని అన్నారు. రాజ్యాంగ హక్కులను వినియోగించుకున్నందుకు 8మంది విపక్ష సభ్యులను ఏకపక్షంగా సస్పెండ్ చేశారని గొగొయ్ ఆరోపించారు. స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నోటీసులో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సంతకం చేయలేదని కాంగ్రెస్ పార్టీవర్గాలు పేర్కొన్నాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో స్పీకర్ తొలగింపు పిటిషన్‌పై ప్రతిపక్ష నేత సంతకం చేయడం సరైంది కాదని తెలిపాయి. రాహుల్ గాంధీ సంతకం చేయకపోవడానికి అదే కారణమని వివరించాయి. బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం, 8 మంది సభ్యులను సెషన్ ముగిసే వరకూ సస్పెండ్ చేయడం, ప్రధానిపై దాడికి కాంగ్రెస్ మహిళా ఎంపీలు ప్రయత్నించారని నిరాధార ఆరోపణలు చేసి బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబేపై చర్యలు తీసుకోకపోవడం వంటి కారణాలతో అవిశ్వాస తీర్మానం అంశాన్ని విపక్షాలు తెర పైకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఆర్టికల్ 94 ప్రకారం స్పీకర్‌ను తొలగించేందుకు అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టొచ్చు. ఇందుకు కనీసం 14 రోజుల ముందు నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. నోటీ సుపై కనీసం 50 నుంచి 100 మంది ఎంపీల సంతకాలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం విపక్షం తమ నోటీసుపై 118మంది ఎంపీలు సంతకం చేసినట్టు పేర్కొంది. దీంతో తీర్మానం తప్పకుండా ఆమోదిం చాల్సి న పరిస్థితి నెలకుంది. అదే జరిగితే బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారుతుంది. కానీ, ప్రభుత్వానికి అవసరమైన సంఖ్యాబలం ఉన్నందున ఈ తీర్మానం వీగిపోయినప్పటికీ స్పీకర్ స్థానాన్ని వివాదాల్లోకి లాగడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి.

**విపక్ష మహిళా ఎంపిలపై చర్యలు తీసుకోవాలి: కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు:** లోక్‌సభలో ఈనెల 4వ తేదీన ప్రధాని మోదీ కూర్చునే సీటు వద్ద విపక్ష మహిళా ఎంపీలు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఆ ఘటనకు చెందిన వీడియోను ఇవాళ కేంద్ర ప్రభుత్వం రిలీజ్ చేసింది. విపక్ష మహిళా సభ్యులు బ్యానర్లు పట్టుకుని.. మోదీ కూర్చుకునే సీటు వద్ద నినాదాలు చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మాట్లాడేందుకు ఆ సమయంలో ప్రధాని మోదీ అక్కడకు రావాల్సి ఉన్నది. కానీ విపక్ష మహిళా



ఎంపీల నిరసన వల్ల ఆయన రాలేకపోయారు. ఆ తర్వాత ప్రధాని ప్రసంగం చేయకుండానే తీర్మానాన్ని ఆమోదించినట్లు లోక్‌సభ ప్రకటించింది. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మంగళవారం ఆ రోజున జరిగిన ఘటనకు చెందిన వీడియోను తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశారు. కాంగ్రెస్ ఎంపీ జ్యోతిమణి నేతృత్వంలో కొందరు మహిళా ఎంపీలు మోదీ సీటు వద్ద ఆందోళన చేపట్టారు. ప్రధానిని అడ్డుకున్న మహిళా విపక్ష ఎంపీలపై చర్యలు తీసుకోవాలని ఇవాళ బీజేపీ మహిళా ఎంపీలు స్పీకర్‌ను కోరుతూ లేఖ రాశారు.

**హద్దులు దాటుతున్న ప్రతిపక్షాలు: కంగనారనౌత్**
ప్రతిపక్ష పార్టీలు హద్దులు దాటి ప్రవర్తిస్తున్నాయని, పార్లమెంట్‌లో జరుగుతున్న పరిణామాలను చూసి దేశం సిగ్గుపడుతోందని బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళవారం పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన ఆమె విపక్షాల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. లోక్‌సభలో రాహుల్ గాంధీ ఆర్మీ మాజీ చీఫ్ నరవణే ప్రచురితం కాని పుస్తకంలోని అంశాలను చట్టవిరుద్ధంగా ప్రస్తావించారని కంగనా ఆరోపించారు. రాహుల్ గాంధీ ఒక అనధికారిక, చట్టవిరుద్ధమైన పుస్తకాన్ని సభకు తీసుకొచ్చి మొత్తం న్యాయవ్యవస్థను అవమానించారు. ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని పుస్తక ప్రచురణ సంస్థ పెంగ్విన్ కూడా స్పష్టంచేసింది అని కంగనా అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై చర్చ జరగనీయకుండా విపక్షాలు సభలో గందరగోళం సృష్టించడంతో లోక్‌సభ మంగళవారం కూడా వాయిదా పడింది. మాకు న్యాయం కావాల్సి అంటూ కాంగ్రెస్ ఎంపీలు



నినాదాలు చేయగా, బడ్జెట్‌పై చర్చకు సహకరించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వారిని కోరారు.

**నరవణే అబద్ధమా...పెంగ్విన్ సంస్థ అబద్ధమా: రాహుల్ గాంధీ:** మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ బుక్ వివాదాస్పదమైంది. ఆ బుక్‌లో ఉన్న కొన్ని అంశాలను ఇటీవల లోక్‌సభలో రాహుల్ గాంధీ ప్రస్తావించారు. దీంతో సభలో గందరగోళం



నెలకొన్నది. అయితే మంగళవారం పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. మాజీ ఆర్మీ చీఫ్ నరవణే చేసిన ఓ ట్వీట్‌ను చదివి వినిపించారు. తాను రాసిన పుస్తకం ఆన్‌లైన్‌లో దొరుకుతోందని, లింక్ ఓపెన్ చేస్తే విషయాలు తెలుస్తాయని తన ట్వీట్‌లో నరవణే పేర్కొన్నట్లు రాహుల్ వెల్లడించారు. ఆ బుక్‌ను పెంగ్విన్ రాండమ్ హౌజ్ ఇండియా ప్రచురించినట్లు తెలిసింది. కానీ తాము ఆ బుక్‌ను ఇంకా రిలీజ్ చేయలేదని పెంగ్విన్ సంస్థ తాజాగా ప్రకటించింది. కానీ రాహుల్ మాత్రం అమెజాన్‌లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే పెంగ్విన్ కన్నా మాజీ ఆర్మీ చీఫ్ వ్యాఖ్యలను నమ్ముతున్నట్లు రాహుల్ తెలిపారు. నేను నరవణేను నమ్ముతున్నాను, ఆయన అబద్ధం చెప్పరని భావిస్తున్నా, పెంగ్విన్ అబద్ధం చెబుతుందా అన్న అంశంలో నిజాన్ని నిర్ధారించలేమని రాహుల్ అన్నారు.

**నరవణే పుస్తకంపై స్పష్టత ఇచ్చిన పెంగ్విన్**
ఆర్మీ మాజీ చీఫ్, జనరల్ ఎంఎం నరవణె పుస్తకంపై అన్ని హక్కులు తమకే ఉన్నాయని ప్రముఖ పబ్లిషింగ్ కంపెనీ పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా పేర్కొంది. ఈ పుస్తకం




విషయంలో నెలకొన్న వివాదంపై సంస్థ ఓ ప్రకటన విడుదల చేసింది. నరవణె రాసిన ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీకి ప్రభుత్వం నుంచి అనుమతి ఇంకా లభించకపోవడంతో ముద్రణ చేపట్టలేదని వివరించింది. ఆన్ లైన్ లో రిలీజ్ చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపింది. సరిహద్దుల్లో చైనా సైన్యంతో జరిగిన భారత బలగాల ఘర్షణకు సంబంధించి నరవణె ఈ పుస్తకంలో పలు విషయాలను వెల్లడించారు. ఈ వివాదాస్పద అంశాలను రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని నిలదీశారు. అయితే, నరవణె పుస్తకం అసలు పబ్లిష్ కాలేదని, మార్కెట్లోకి రాని పుస్తకంలోని విషయాలను సభలో ప్రస్తావించడమేంటని అధికార పక్షం అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో మరుసటి రోజు రాహుల్ గాంధీ నరవణె బుక్‌ను సభకు తీసుకెళ్లారు. దీంతో వివాదం రేగింది. దీనిని తీవ్రంగా పరిగణించిన ఢిల్లీ పోలీసులు సోమవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రాథమిక దర్యాప్తులో పెంగ్విన్ సంస్థ ప్రచురణకు ముందు రూపొందించిన పీడీఎఫ్ ప్రతి కొన్ని వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉందని గుర్తించినట్లు తెలిపారు.

## బాబ్రి పునర్నిర్మాణం అసాధ్యం: యుపి సిఎం యోగి

**లక్నో, ఫిబ్రవరి 10:** బాబ్రీ మసీదు పునర్నిర్మాణంపై ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మసీదు పునర్ నిర్మాణం సాధ్యం కాదని తేల్చి చెప్పారు. ఈ ప్రయత్నాలను అడ్డుకుంటామని ఆయన ఉద్ఘాటించారు. శతాబ్దాలుగా సాగు తోన్న రామజన్మభూమి బాబ్రీ మసీదు వివా దంపై 2019 నవంబర్ 9న సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. వివాదాస్పద భూమి రామజన్మభూమి ఆలయ నిర్మాణానికి అప్పగించి, దానికి ప్రత్యామ్నాయంగా మసీదు నిర్మాణం కోసం ముస్లిం వర్గానికి ఐదు ఎకరాల భూమిని కేటాయించాలని సర్వోన్నత న్యాయ స్థానం తన తీర్పులో స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అయోధ్య సమీపంలోని ధన్నిపూర్‌లో ఐదు ఎకరాలను యూపీ ప్రభు త్వం కేటాయించింది. ఆ స్థలంలో మసీదు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆసుపత్రి, లైబ్రరీ, మ్యూజియంతో కూడిన కాంప్లెక్స్ నిర్మి స్తున్నారు. ఈ తరుణంలో యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరిం చుకుంది. తీర్పు వెలువడిన రోజు కోసం ఎదురు చూసేవారి కలలు ఎప్పటికీ నెరవేరవని, అలాంటి రోజు



ఎప్పటికీ రాదని యోగి స్పష్టం చేశారు. మంగళవారం బారాబంకిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న యూపీ సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. తన వాగ్దానాలను నెరవే ర్చడంలో ప్రభుత్వం నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు. దాని పని పరిధిని మాత్రమే తమ ప్రభుత్వం మాట్లాడుతుందని అన్నారు. అయోధ్యపై బీజేపీ వైఖరిని గుర్తుచేసుకుంటూ 'మేము రాముడి కోసం వస్తాం అదే స్థలంలో ఆలయాన్ని నిర్మిస్తామని చెప్పాం.. ఇందులో ఏదైనా సందేహం ఉందా? అని పేర్కొన్నారు. భారత వారసత్వం, అద్భుతమైన సంప్రదాయాలు, సనాతన ధర్మం పట్ల గౌరవాన్ని నొక్కిచెప్పిన యోగి కాషాయ జెండా ఎల్లప్పుడూ దేశ గౌర వాన్ని పెంపొందిస్తూనే ఉంటుందని అన్నారు. అయోధ్యలోని రామమందిరంపై ప్రధాని మోదీ ధ్వజారోహణాన్ని గుర్తుచేస్తూ దానిని సనాతన చిహ్నంగా అభివర్ణించారు. సంక్షోభ సమయాల్లోనే శ్రీరాముడ్ని గుర్తుచేసు కుంటారని, లేకపోతే ఆయనను మరచిపోతారని ఇలాంటి అవకాశవాదులను రాముడు కూడా మరచిపోయాడని సీఎం అన్నారు. రామ భక్తులపై కాల్పులు జరిపి, రాముడి లక్ష్యాన్ని అడ్డుకున్న వారికి ఇక చోటు లేదని ఆయన వ్యాఖ్యానించారు. శాంతిభద్రతల విషయంలో యూపీ సీఎం హెచ్చరికలు చేశారు. నిబంధనల ప్రకారం నడుచుకుని, చట్టాన్ని పాటించేవారు ప్రయోజనం పొందుతారని, లేకుంటే నరకం వైపు వెళ్తారని హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘించడం ద్వారా స్వర్గానికి చేరుకోగలమని నమ్మేవారి కలలు ఎప్పటికీ నెరవేరవని ఆయన అన్నారు. మసీదు నిర్మాణ కోసం ఇండోఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్ (ఐసీఎఫ్) డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటయ్యింది. ఈ బోర్డు ఆధ్వర్యంలో నిధుల సేకరణ కూడా జరుగుతోంది.


## చైనా, భారత్‌లు పాకిస్థాన్‌ను నమ్మడంలేదు

### జమాయిత్ ఉలేమియా ఇస్లామ్ చీఫ్ మౌలానా ఫజ్లుర్ రెహమాన్

**రావల్పిండి, ఫిబ్రవరి 10:** షెహబాజ్ షరీఫ్ నాయకత్వంలోని పాకిస్థాన్ ప్రభుత్వంపై ఆ దేశ నాయకుడొకరు విమర్శలు గుప్పించారు. అఫ్గనిస్థాన్ విషయంలో మన విధానం దశాబ్దాలుగా ఎందుకు దారుణంగా విఫలమైందని జమాయిత్ ఉలేమియా ఇస్లామ్ (ఎఫ్) అధ్యక్షుడు మౌలానా ఫజ్లూర్ రెహమాన్ ప్రశ్నించారు. ఉగ్రవాదులు సరిహద్దులు దాటుతూనే ఉన్నారని, సైన్యం ఏం చేస్తుందని ఆయన నిలదీశారు. రావల్పిండిలో జరిగిన కార్యక్రమంలో ఫజ్లూర్ రెహమాన్ మాట్లాడుతూ అఫ్గనిస్థాన్ నుంచి వాణిజ్యం నిలిచిపోయినప్పటికీ తీవ్రవాదులు మాత్రం వస్తూనే ఉన్నారనే వైరుధ్యాన్ని ఎత్తి చూపారు. అఫ్గన్‌పై వైమానిక దాడులను తీవ్రంగా వ్యతిరేకిస్తూ అలా అయితే భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సరైందేనని గతంలో అన్నారు. దశాబ్దాలుగా మన ఆఫ్ఘన్ విధానం ఎందుకు ఇంత దారుణంగా విఫలమైంది ఒక్క దానిమ్మ లేదా పుచ్చకాయ కూడా పాకిస్థాన్‌లోకి ప్రవేశించలేదు అయినప్పటికీ ఉగ్రవాదులు సరిహద్దు దాటుతూనే ఉన్నారని అన్నారు. భారత్ మన శత్రువు అఫ్గనిస్థాన్ మన శత్రువు ఇరాన్, చైనాలు మనపై కోపంగా ఉన్నాయి.. పాకిస్థాన్ ప్రజలకు సమాధానాలు తెలుసుకునే హక్కు ఉంది. ఒక దేశం విధానాలు కేవలం ఏకాకితం, అపనమ్మకం, అభద్రతను మాత్రమే సృష్టిస్తే, ఆ దేశం మనుగడ సాగించలేదని ఆయన చెప్పారు.

## 12న దేశవ్యాప్తంగా కార్మికుల నిరసన

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:** కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశంలోని 10 ప్రధాన కార్మిక సంఘాల సంయుక్త వేదిక ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ సమ్మెలో సుమారు 30 కోట్ల మంది కార్మికులు పాల్గొంటారని, దేశవ్యాప్తంగా 600కు పైగా జిల్లాల్లో దీని ప్రభావం ఉంటుందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ ఈ సమ్మె చేపడుతున్నట్లు సంఘాలు ప్రకటించాయి. ముఖ్యంగా, కేంద్రం తీసుకొచ్చిన నాలుగు కొత్త లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, ఉపాధి హామీ పథకంలో మార్పులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ సమ్మెకు సంయుక్త కిసాన్ మోర్చా సహా పలు రైతు సంఘాలు కూడా మద్దతు ప్రకటించాయి.



గతేడాది జులై 9న జరిగిన సమ్మెలో దాదాపు 25 కోట్ల మంది పాల్గొనగా, ఈసారి అంతకంటే ఎక్కువ ప్రభావం ఉంటుందని భావిస్తున్నారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ మాట్లాడుతూ ఈనెల 12న జరిగే సమ్మెలో కనీసం 30 కోట్ల మంది కార్మికులు పాల్గొంటారు.

## పంజాబ్‌లో పెరుగుతున్న రిమోట్‌కంట్రోల్ హత్యలు



**అమృత్‌సర్, ఫిబ్రవరి 10:** పంజాబ్‌లో రిమోట్ కంట్రోల్ హత్యలు భద్రతా వర్గాలకు పెను సవాల్‌గా మారాయి. విదేశాల్లో తలదాచుకుంటున్న నేరగాళ్లు, స్థానిక ముఠాల ద్వారా హత్యలకు పాల్పడటం ఆందోళన కలిగిస్తోంది. ఆమ్ ఆద్మీ పార్టీ నేత లక్కీ ఒబెరాయ్ హత్య వెనుక కూడా విదేశీ గ్యాంగ్‌స్టర్ల నెట్‌వర్క్ ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలో పంజాబ్ పోలీసులు గ్యాంగ్‌స్టర్లపై ఉక్కుపాదం మోపారు. కొన్నేళ్లుగా పంజాబ్‌లో గ్యాంగ్‌స్టర్ల ముఠాలు పేట్రేగిపోతున్నాయి. విదేశాల్లో ఉం టున్న ప్రధాన నేరగాళ్లు, స్థానికంగా యువకులను నియమించుకుని రాజకీయ హత్యలు, బెదిరింపు వసూళ్లకు పాల్పడు తున్నారు. ఈ క్రమంలో పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ ఈ గ్యాంగ్‌స్టర్ల నెట్‌వర్క్‌ను తమకు అనుకూలంగా మార్చుకుంది. ఖలిస్తాన్ అజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు వీరిని వాడుకుంటోంది. దావూద్ ఇబ్రహీంతో గతంలో కుదుర్చుకున్న తరహాలోనే ఈ ముఠాలతోనూ ఐఎస్ఐ ఒప్పందం చేసుకుంది. డ్రగ్స్ ద్వారా వచ్చిన డబ్బులో 40 శాతం వాటాను తీసుకుని, ఆ నిధులను ఉగ్రవాద కార్యకలాపాలకు వినియోగిస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి.

## రాజ్‌పాల్‌యాదవ్‌పై చెక్‌బౌన్స్ కేసు



**ముంబయి, ఫిబ్రవరి 10:** బాలీవుడ్ హాస్యనటుడు రాజ్ పాల్ యాదవ్ ఢిల్లీలోని తీహార్ జైలులో లొంగిపోయారు. సుమారు రూ. 2.5 కోట్ల చెక్ బౌన్స్ కేసులో కోర్టు ఆదేశాల మేరకు ఆయన జైలుకు వెళ్లారు. ఈ కేసులో ఆయనకు విధించిన ఆరు నెలల జైలు శిక్షను అనుభవించనున్నారు. డబ్బు సర్దుబాటు చేసేందుకు మరింత సమయం కావాలంటూ రాజ్ పాల్ పెట్టుకున్న చివరి అభ్యర్థనను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించడంతో ఆయనకు లొంగిపోక తప్పలేదు. జైలుకు వెళ్లే ముందు రాజ్ పాల్ యాదవ్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "సార్, ఏం చేయను నా దగ్గర డబ్బు లేదు. నాకు వేరే మార్గం కనిపించడం లేదు. ఇక్కడ మేమంతా ఒంటరివాళ్లం. ఈ సంక్షోభాన్ని నేనే ఒంటరిగా ఎదుర్కోవాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఆయన జైలు అధికారుల ఎదుట లొంగిపోయారు.

## ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి

**లక్నో, ఫిబ్రవరి 10:** ఉత్తరప్రదేశ్‌లోని మధురలోని మహావన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖాపర్‌పూర్ గ్రామంలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన అయిదుగురు చనిపోయి ఉండటం తీవ్ర కలకలం రేపింది. భార్యభర్తలు, ముగ్గురు పిల్లలు విగతజీవులుగా పడి ఉన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృత దేహాలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన అయిదుగురు చనిపోవడంతో స్థానికంగా తీవ్ర కలకలంరేపింది. ఖాపర్‌పూర్ గ్రామంలోభర్త, భార్య, ముగ్గురుపిల్లలు నివాసముంటున్నారు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునిమృతదేహాలనుస్వాధీనం చేసుకున్నారు.



## లిబియా తీరంలో పడవ మునక 53 మంది మృతి

**ట్రిపోలి, ఫిబ్రవరి 10:** లిబియా తీరంలో మరో ఘోర ప్రమాదం జరిగింది. వలసదారులు, శరణార్థులతో వెళుతున్న ఒక రబ్బరు బోటు మధ్యధరా సముద్రంలో మునిగిపోవడంతో 53 మంది ప్రాణాలు కోల్పో యారు. ఈ విషయాన్ని ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ వలసల సంస్థ (ఐఓఎం) అధికా రికంగా ధృవీకరించింది. లిబియాలోని అల్‌జావియా నుంచి గురువారం రాత్రి 55 మందితో ఈ బోటు బయలుదేరింది. ప్రయాణం మొదలైన ఆరు గంటల తర్వాత, జువారా తీరానికి సమీపంలో బోటులోకి నీరు చేరి మునిగిపోయింది. ఈ దుర్ఘటనలో నైజీరియాకు చెందిన ఇద్దరు మహిళలు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. వారిలో ఒకరు తన భర్తను కోల్పోగా, మరొకరు తన ఇద్దరు పిల్లలను కోల్పోయినట్లు కన్నీటిపర్యంతమయ్యారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. ఈ ఘటన గత గురువారం జరిగినా, ఐఓఎం సోమవారం దీన్ని వెలుగులోకి తెచ్చింది. 2026లో ఇప్పటివరకు మధ్యధరా సముద్రం దాటే ప్రయత్నంలో దాదాపు 500 మంది మరణించడం లేదా గల్లంతవడం జరిగిందని ఐఓఎం తెలిపింది. ముఖ్యంగా శీతాకాలంలో స్మగ్లర్లు నడిపే పడవలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయని, చాలా సంఘటనలు నమోదు కావడం లేదని పేర్కొంది. 2011లో గడాఫీ మరణం తర్వాత లిబియాలో అస్థిరత పెరిగింది. ఆఫ్రికా దేశాల నుంచి యూరప్ కు వెళ్లే వలసదారులకు ఇది ప్రధాన మార్గంగా మారింది. హింస, దోపిడీ, బలవంతపు చాకిరీ వంటి భయానక పరిస్థితుల నుంచి తప్పించుకునేందుకే ప్రజలు ఇలాంటి ప్రమాదకర ప్రయాణాలకు సిద్ధపడుతున్నారు. ఈ నేపథ్యంలో, మానవ అక్రమ రవాణా నెట్‌వర్క్‌లను అరికట్టడంతో పాటు, వలసలకు చట్టబద్ధమైన, సురక్షితమైన మార్గాలను ఏర్పాటు చేయాలని ఐఓఎం అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చింది.

## రూ.3.25లక్షల కోట్లతో 114 రఫేల్ యుద్ధవిమానాలు



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 10:** భారత వాయుసేన అమ్ములపొదిని మరింత పదును పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. మల్టీరోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంఆర్ఎఫ్ఏ) కార్యక్రమంలో భాగంగా ఫ్రాన్స్‌కు చెందిన 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు రక్షణ మంత్రిత్వ శాఖ ఈ వారం లోనే ఆమోదం తెలిపింది. సుమారు రూ. 3.25 లక్షల కోట్ల విలువైన ఈ ఒప్పందం దేశ రక్షణ రంగ చరిత్రలోనే అతిపెద్దది కానుంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఢిల్లీ పర్యటనకు కొద్ది రోజుల ముందే ఈ కీలక పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ఒప్పందం కేవలం విమానాల కొనుగోలుకే పరిమితం కాదు. ఇందులో భాగంగా దాదాపు 100 యుద్ధ విమానాలను "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమం కింద దేశీయంగానే తయారు చేయనున్నారు. అత్యాధునిక ఫైటర్ జెట్ టెక్నాలజీ బదిలీతో పాటు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించే నిబంధనలు కూడా ఈ ఒప్పందంలో ఉన్నాయి. ఈ డీల్ ఖరారైతే ఫ్రాన్స్ తర్వాత రఫేల్ యుద్ధ విమానాలను అత్యధిక సంఖ్యలో వినియోగిస్తున్న దేశాలలో ఒకటిగా భారత్ నిలుస్తుంది. ఇప్పటికే 36 రఫేల్ వేరియంట్ ఫైటర్ జెట్లు భారత్ వద్ద ఉన్నాయి. 2024 డిసెం బర్‌లో చివరి విమానం వాయుసేనకు అందింది.

## అమెరికా చిత్రపటంలో గ్రీన్‌ల్యాండ్ కెనడా




**వాషింగ్టన్ , ఫిబ్రవరి 10:** గ్రీన్‌లాండ్, కెనడాలను అమెరికాలో భాగంగా చూపించే మ్యాప్‌ను అమె రికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా మళ్లీ పోస్ట్ చేశారు. గ్రీన్‌లాండ్ స్వాధీ నం అమెరికా జాతీయ భద్రతతో ముడిపడిన అంశంగా పేర్కొన్నారు. బ్రిటన్ ప్రధాని స్టార్మర్, ఫ్రెంచ్ అధ్యక్షుడు మాక్రాన్, ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్, మరికొందరితో తాను ఓవల్ ఆఫీస్‌లోమాట్లాడుతున్న ఫొటోను ట్రంప్ సోమవారం పోస్ట్‌చేశారు. జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా డానిష్ భూభాగాన్ని స్వాధీనం చేసుకోవాలనే తన ఆకాంక్షను మళ్లీ వ్యక్తంచేశారు. ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే కెనడా అమెరికాలో 51వరాష్ట్రంగా చేరుతుందని ప్రకటించారు. అక్కడ సైనిక స్థావరాలు ఏర్పా టుచేస్తామని ప్రజలకు లక్ష నుంచి 10 మిలియన్ డాలర్ల వరకూ అందచేసి అయినా స్వాధీనం తప్పదని స్పష్టంచేసారు. తాజాగా ట్రంప్ ఓవల్ కార్యాలయంలోని తనఛాంబర్‌లో కూడా గ్రీన్‌ల్యాండ్, కెనడాలున్న చిత్రపటం వేలాడదీసారు.

# సంక్షిప్తంగా..

## బంగ్లాదేశ్‌లో హిందూ వ్యాపారి దారుణ హత్య




**ఢాకా, ఫిబ్రవరి 10:** బంగ్లా సార్వత్రిక ఎన్నికలకు 48 గంటల ముందు హిందూ వ్యాపారిని దారుణంగా హత్య చేశారు. మైమెన్‌సింగ్ జిల్లాలో ఆయన దుకాణంలోనే కత్తితో దాడి చేసి చంపినట్లు పోలీసులు తెలిపారు. మృతుడిని త్రిషల్ సబ్ డిస్ట్రిక్ట్‌లోని బోగర్ బజార్‌లో బియ్యం వ్యాపారిగా, మెసర్స్ భాయ్ భాయ్ ఎంటర్‌ప్రైజె యజమాని సుషేన్ చంద్ర సర్కార్‌గా గుర్తించారు. ఇతను ఇదే ప్రాంతంలోని సొత్‌కాండ గ్రామంలో నివసిస్తున్నాడు. పోలీసులు చెబుతున్న వివరాల ప్రకారం ఈ సంఘటన రాత్రి 11 గంటల ప్రాంతంలో జరిగింది. త్రిశల్ పోలీస్ స్టేషన్ ఆఫీసర్ ఇన్ ఛార్జి మహ్మద్ ఫిరోజ్ హుస్సేన్ ఈ సంఘటనను ధృవీకరించలేదు.

## మా దేశంపై దాడిచేయండి: ట్రంప్‌ను అభ్యర్థించిన ఇరాన్ వ్యక్తి ఆత్మహత్య




**టెహ్రాన్, ఫిబ్రవరి 10:** తమ దేశంతో అమెరికా చర్చలు జరపవద్దని కోరుతూ ఇరాన్‌కు చెందిన ఓ వ్యక్తి అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌ను అభ్యర్థించాడు. ఇరాన్‌పై అమెరికా దాడి చేయడమే సరైన మార్గమంటూ సామాజిక మాధ్యమాల్లో విడియో విడుదల చేశాడు. తర్వాత ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకుని చనిపోయినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. బాధితుడిని బుషె హర్ నగరానికి చెందిన హక్కుల కార్యకర్త పొరియా హమీదీగా గుర్తించారు. గత వారం అతడు 10 నిమిషాల విడియోను విడుదల చేశాడు. అందులో అమెరికా ప్రభుత్వానికి పలు విజ్ఞప్తులు చేశాడు.

## యునైటెడ్ కింగ్‌డమ్ ప్రధాని రేసులో షబానా



**లండన్, ఫిబ్రవరి 10:** ఎప్‌స్టీన్ ఫైళ్ల వివాదం బ్రిటన్‌లో మరోసారి రాజకీయ సంక్షోభానికి దారితీసింది. ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా చేస్తారని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే ఒకవేళ స్టార్మర్ వైదొలిగితే యుకె తదుపరి ప్రధానిగా ఎవరు ఎన్నికవుతారనే దానిపై చర్చ మొదలైంది. ఈ రేసులో మహిళా ఎంపి షబానా మహ్మద్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. అదే జరిగితే బ్రిటన్ చరిత్రలోనే పాక్ మూలాలు ఉన్న తొలి ముస్లిం ప్రధానిగా షబానా నిలవనున్నారు. షబానా మహ్మద్ ప్రస్తుతం స్టార్మర్ ప్రభుత్వంలో హోంమంత్రిగా కొనసాగుతున్నారు. 45 యేళ్ల షబానా 2010 నుంచి బర్మింగ్‌హమ్ లేడీవుడ్ స్థానానికి ఎంపిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వృత్తిరీత్యా బారిస్టర్.

## కెనడా-అమెరికా మధ్య బ్రిడ్జిని బ్లాక్ చేస్తాం: ట్రంప్



**వాషింగ్టన్, ఫిబ్రవరి 10:** కెనడాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విరుచుకుపడ్డారు. ఇప్పటివరకు అమెరికా నుంచి పొందిన అన్ని ప్రయోజనాలకు ప్రతిఫలంగా తిరిగి తమకు మూల్యం చెల్లించాలని.. లేకపోతే కఠినచర్యలు తీసుకుంటామని ఆ దేశాన్ని హెచ్చరించారు. తమ నుంచి పొందిన వాటికి పూర్తి పరిహారం చెల్లించేవరకు కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్‌ను అమెరికాలోని మిచిగాన్‌తో కలిపే గోర్డీ హోవే అంతర్జాతీయ వంతెనను బ్లాక్ చేస్తామని బెదరించారు. 2014లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఒబామా తెలివి తక్కువగా ఆలోచించి ఈ వంతెన నిర్మాణానికి కావాల్సిన మినహాయింపులు ఇచ్చారని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రూ. 500కోట్ల పరువు నష్టం దావా వేసిన అసోం సిఎం



**గువాహతి, ఫిబ్రవరి 10:** అసోంలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార, ప్రతిపక్ష నేతల మధ్య ఆరోపణలు తారస్థాయికి చేరాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి, ఆయన కుటుంబీకులు దాదాపు 1,200బిఘాల భూమి ఆక్రమించారంటూ కాంగెస్ నేతలు ఆరోపించారు. దీనిపై తీవ్ర అభ్యం తరం వ్యక్తం చేసిన సిఎం హిమంత బిశ్వశర్మ తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఆరోపణలు చేసిన కాంగ్రెస్ నేతలపై పరువునష్టం దావా వేసినట్లు వెల్లడించారు. జితేంద్రసింగ్, భూపేంద్ర సింగ్ బఘేల్, గౌరవ్ గొగొయ్‌ల నుంచి రూ.500కోట్ల నష్టపరిహారం కోరుతూ దావా వేశాను' అని అసోం ముఖ్య మంత్రి పేర్కొన్నారు.

# సర్పంచ్‌లకు అంగన్వాడీల పర్యవేక్షణ

## 11 మందితో కమిటీ ఏర్పాటు

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బాలలకు సంబంధించిన అంగన్వాడీ కేంద్రాలను పర్యవేక్షించే బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీ సర్పంచ్‌లకు అప్పగించింది. ఈ మేరకు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. సర్పంచ్ చైర్మన్‌గా 11 మందితో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ కమిటీలో సర్పంచ్‌తో పాటు, అంగన్వాడీ టీచర్ కన్వీనర్‌గా, ఏఎన్ఎం, పాఠశాల సైన్స్ టీచర్, రిటైర్డ్ ఉద్యోగి, ఆరుగురు చిన్నారుల తల్లులు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ గర్భిణులు, తల్లులు, బాలింతలకు ప్రతీనెలా బియ్యం, పప్పు, బాలామృతం పంపిణీని పర్యవేక్షించనున్నది. అలాగే ఆరోగ్యలక్ష్మి ద్వారా లబ్ధిదారులకు అందుతున్న భోజనాన్ని పరిశీలిస్తుంది. అయితే దీనిపై అంగన్వాడీ టీచర్స్ అసోసియేషన్ నాయకులు మాత్రం అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క బాలల ఆరోగ్యమే ప్రధానంగా అల్పాహార కార్యక్రమాన్ని అమలు చేయనుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 35,781 అంగన్వాడీ కేంద్రాల్లోని దాదాపు 8లక్షల మంది పిల్లలకు ఈ పథకాన్ని విస్తరించనున్నారు. ఇప్పటికే అంగన్వాడీల్లో ఇప్పటికే మధ్యాహ్న భోజనం, గుడ్లు, బాలామృతం అందిస్తుండగా, ఇకపై అల్పాహారం కూడా అందించనుంది. ఒక రోజు కిచిడీ, మరో రోజు ఉప్మా ఇలా రకరకాలైన మెనూ రూపొందించారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా తెలంగాణ ఫుడ్స్ ద్వారా సిద్ధం చేసిన ఆహారాన్ని పిల్లలకు అందించనున్నారు. ఈనేపథ్యంలో వీటన్నింటి పర్యవేక్షణ ఈ కమిటీలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నాయి.

# కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వండి

## ప్రభుత్వానికి గోపాలమిత్రల వినతి

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** ఆర్టిఫిషియల్ ఇన్సర్మేషన్ వర్కర్‌గా గుర్తింపు ఇస్తూ, మండల పశు వైద్యఅధికారి ఆధీనంలో తమ సేవలను ఉపయోగించుకునే విధంగా ఆదేశాలు ఇవ్వాలని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ గోపిని గోపాల మిత్రలు కోరారు. ప్రతినెల కనీస వేతనంగా రూ. 26 వేల రూపాయలను అందించాలని విన్నవించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర గోపాల మిత్ర సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షులు సింగం రాజు ప్రధాన కార్యదర్శి మల్లేష్ ఆధ్వర్యంలో పలువురు మంగళవారం హైదరాబాద్‌లో పశుసంర్థకశాఖ డైరెక్టర్‌ను కలిశారు. ప్రతీ గోపాలమిత్ర కుటుంబానికి మెడికల్ ఇన్సూరెన్స్ అవకాశం కల్పిస్తూ శాఖలో ఖాళీగా ఉన్న ఆఫీస్ అపార్టుమెంట్ సీనియర్ ప్రాతిపదికన పరీక్షలు నిర్వహించి అవకాశం కల్పించాలని కోరారు.

# టెట్-2026 జనవరి ఫలితాలు విడుదల

## వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన విద్యా శాఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జనవరి 3 నుంచి 20 వరకు నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)-2026 జనవరి పరీక్షల ఫలితా లను పాఠశాల విద్య శాఖ అధికారులు మంగళవారం రాత్రి విడుదల చేశారు. టెట్ ఫలితాలను పాఠశాల విద్య శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు పాఠశాల విద్య డైరెక్టర్, టెట్-2026 ఛైర్మన్, టెట్ కన్వీనర్ మంగళవారం ప్రకటించారు. అభ్యర్థులు తమ ఫలితాలను వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచిం చారు. టెట్ ఫలితాలు సోమవారం రాత్రి పొద్దుపోయాక వెబ్‌సైట్‌లో ప్రత్యక్షమయ్యాయి. వెబ్‌సైట్‌లో పెట్టిన ఫలితాలను 15 నిమిషాల్లోనే తొలగించారు. దీంతో మంగళవారం ఉదయం నుంచే అభ్యర్థుల నుంచి, మీడియా నుంచి టెట్ అధికారులకు ఫలితాల గురించి వాకబుగా చేయగా.. రాత్రి 9 గంటలకు ఫలితాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు ప్రకటించారు. జనవరి 3న ప్రారంభమైన పరీక్షలు 20తో ముగిశాయి. పరీక్షలకు సరాసరి 82.09 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. ప్రాథమిక కీని జనవరి 30న విడుదల చేయగా ఫిబ్రవరి 1 వరకు అభ్యంతరాలను స్వీకరించారు.

ఈసారి జరిగిన టెట్ పరీక్షలకు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు కూడా భారీగా హాజరయ్యారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకి కూడా టెట్ తప్పనిసరి అంటూ సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఇప్పటికే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న టీచర్లు టెట్ పరీక్షకు హాజరయ్యారు. 9 రోజులపాటు ... 15 సెషన్స్‌లో పరీక్షలను సజావుగా నిర్వహించారు. టెట్-2026 పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 18 జిల్లాల్లో 97 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, హైదరాబాద్, జగిత్యాల, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్ నగర్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, నల్గొండ, నిజామాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. టెట్-2026కి 2,37,754 దరఖా స్తులు వచ్చాయి. వారిలో 1,95,181 మంది పరీక్షలకు హాజరయ్యారు. టెట్ దరఖాస్తుల్లో ఇప్పటికే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారి నుంచి 72,673 దరఖాస్తులు వచ్చాయి. వారిలో ప్రభుత్వ స్కూల్స్‌లో పనిచేస్తున్న వారు 49,236 మంది దరఖాస్తు చేసుకున్నారు. పేపర్-1కి 85,538 దరఖాస్తులు రాగా వాటిలో ఇన్ సర్వీస్ టీచర్ల నుంచి 27,391 దరఖాస్తులు వచ్చాయి. పేపర్-2కి 1,52,216 దరఖాస్తులు రాగా ... వాటిలో ఇన్ సర్వీస్ టీచర్ల నుంచి 45,282 దరఖాస్తులు వచ్చాయి.



ఇళ్లల్లో నుండి బయటకు వచ్చిన స్థానికులు

# గాజులరామారంలో భూప్రకంపనలు

## భయాందోళనతో బయటకు పరుగులు తీసిన స్థానికులు

**హైదరాబాద్ (జీడిమెట్ల), ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** ఉదయం వేళ ప్రజలంతా ఎవరి పనుల్లో వారు నిమగ్నమై ఉండగా పది గంటల ప్రాంతంలో ఒక్కసారిగా స్వల్ప భూకంపం రావడంతో తీవ్ర ఆందోళన గురయ్యారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారావు సర్కిల్ పరిసర ప్రాంతాలలో భూకంపం రావడంతో స్థానికులు, అపార్ట్మెంట్ వాసులు భయాందోళన గురై బయటకు పరుగులు తీశారు. స్వల్ప భూప్రకంపనలతో స్థానిక పాఠశాలలోని విద్యార్థులను యాజమాన్యం ఇంటికి పంపించేశారు. గాజులరామారం పరిధిలోని ఆదర్శనగర్, కైసర్‌నగర్, మెట్టుకానిగూడ, దేవేందర్‌నగర్ తదితర ప్రాంతవాసులు భూప్రకంపనలతో రోడ్లపై చేరుకున్నారు.

**మెట్టుకానిగూడ పరిధిలోని పలు ప్రాంతాల్లో భూకంపం..**

కుత్బుల్లాపూర్ సర్కిల్ గాజులరామారం డివిజన్ మెట్టుకాని గూడా ప్రాంతంలో మంగళవారం ఉదయం ఉదయం సరిగ్గా 10 గంటల సమయంలో కొన్ని సెకండ్ల పాటు భూమి కదిలినట్లు ( భూ కంపం ) అయినట్లు స్థానికులు భావిస్తున్నారు. అకస్మాత్తుగా భూకంపనం రావడంతో భయభ్రాంతులకు గురైన ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ ఘటన సమయంలో పాఠశాలల్లో ఉన్న చిన్నపిల్లలు కూడా తీవ్ర భయానికి గురయ్యారు.

తరగతుల్లో ఉన్న విద్యార్థులు బయటకు వచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పిల్లలు, ఉపాధ్యాయులు భయంతో బయటకు రావడంతో స్థానికంగా ఉన్న స్కూల్స్ యాజమాన్యాలు పాఠశాలలకు శెలవు ప్రకటించాయి. ఇది భూకంప ప్రభావమా? లేదా స్థానికంగా ఏదైనా ఇతర కారణంతో కంపనం ఏర్పడిందా? అనే అంశంపై నిపుణులు, అధికారుల నుంచి అధికారిక సమాచారం రావాల్సి ఉంది.

# జూన్ నాటికి 9 వేల ప్రభుత్వ స్కూళ్లకు ఇంటర్నెట్ సౌకర్యం!

## డిజిటల్ భారత్ నిధి, టి ఫైబర్ సహకారంతో ఏర్పాటు

## ఇప్పటికే 2,649 స్కూళ్లలో ఏర్పాటు పూర్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో కొన్నింటికి ఇప్పటికే ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించగా.. 2026- 27 విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి మరికొన్నింటిలోనూ నెట్ సౌకర్యాన్ని కల్పించనున్నారు. జూన్ నాటికి రాష్ట్రంలోని 9వేల స్కూల్స్‌కి ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. డిజిటల్ భారత్ నిధితోపాటు టి ఫైబర్ సహకారంతో రాష్ట్రంలోని గవర్నమెంట్ స్కూల్స్‌లో ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించనున్నారు. ప్రభుత్వ స్కూల్స్‌కి ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడంలో భాగంగా గత రెండు నెలల్లో 2,649 పాఠశాలలకు నెట్ సౌకర్యం కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 8956 గవర్నమెంట్ స్కూల్స్‌లో ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 2026-27 విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి 8,956 స్కూల్స్‌లో ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడానికి అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే ఇప్పటికే 2,649 పాఠశాలల్లో గత రెండు నెలల్లో ఇంటర్నెట్ కనెక్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. మిగిలిన 6,307 బడులకు జూన్ నాటికి పూర్తి చేయాలని అధికారులు ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. 8,956 పాఠశాలల్లో 5,354 పాఠశాలలకు డిజిటల్ భారత్ నిధి కింద బీఎస్ఎన్ఎల్ నెట్‌ను అందుబాటులోకి తీసుకురానుండగా.. మరో 674 పాఠశాలలకు టీఫైబర్ విభాగం ఉచితంగా ఈ సదుపాయాన్ని అందించడానికి ముందుకొచ్చింది. ఈ రెండూ కలిపి 6,028 పాఠశాలలకు ఉచితంగా నెట్ సౌకర్యాన్ని కల్పిస్తుండగా.. మరో 2,928 పాఠశాలలకు బిల్లు చెల్లింపు ప్రాతిపదికన ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించడానికి ఒప్పందాలు జరిగాయి. ఇంటర్నెట్ సౌకర్యం కోసం బీఎస్ఎన్ఎల్‌కు నెలకు రూ.599 చెల్లించనుండగా.. టీఫైబర్‌కు రూ.900 చొప్పున చెల్లించనున్నారు. దేశ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని కేంద్రం నిర్ణయించిన నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరంలో జాతీయ సగటు 50.5 శాతం ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించగా.. అదికాస్త రాష్ట్రంలో 21.90 శాతంగా ఉంది. 2024-25 విద్యా సంవత్సరం నాటికి జాతీయ సగటు 58.60 శాతానికి పెరగగా.. రాష్ట్రంలోనూ 52.90 శాతం పాఠశాలలకు ఈ సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడానికి రాష్ట్ర సర్కార్ చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే కొత్తగా 8,956 పాఠశాలలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించనుంది. రాష్ట్రంలో ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు సుమారు 26వేల వరకు ఉండగా.. అందులో జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూల్స్ సుమారు 2వేల వరకు ఉన్నాయి.

# ఎఫ్ఎస్ఎల్ అగ్నిప్రమాదంపై థర్డ్ పార్టీ విచారణ

## హైదరాబాద్‌కు చేరిన సెంట్రల్ ఎఫ్ఎస్ఎల్, పుణే ఫైర్‌సేఫ్టీ అకాడెమీ నిపుణులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోరెన్సిక్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్) అగ్ని ప్రమాదంపై థర్డ్ పార్టీ విచారణకు సెంట్రల్ ఫోరెన్సిక్ ల్యాబ్ (సిఎఫ్ఎస్ఎల్), పూణేలోని ఫైర్ సేఫ్టీ అకాడమి నిపుణులు మంగళవారం రంగంలో దిగారు. ఇందులో సిఎఫ్ఎస్ఎల్ నిపుణుల బృందం హైదరాబాద్‌కు చెందిన వారు కాగా పుణేలోని ఫైర్‌సేఫ్టీ అకాడమి నిపుణులు మహా రాష్ట్ర నుంచి వచ్చారు. వీరికి రాష్ట్ర ఎఫ్ఎస్ఎల్ ని పుణులతో పాటు రాష్ట్ర ఫైర్ సేఫ్టీ అధికారులు కేసు విచారణలో సహ కరిస్తారు. ఈ దుర్ఘటనపై ఇప్పటికే నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకు ని విచారణ చేస్తుండడం తెలిసిందే. దీంతో పాటు అగ్ని ప్రమాదంపై ఫైర్ సేఫ్టీ విభాగం అధికారులు వేరుగా విచారిస్తున్నారు.

అయితే ఈ ప్రమాదం లో కీలకమైన ఓటుకు నోటు కేసుతో పాటు ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన రికార్డులు కాలిపోయాయని, దీని వెనుక కుట్ర వుందని వార్తలు వస్తున్న నేపథ్యంలో దీనిపై థర్డ్ పార్టీ విచారణకు పోలీసు శాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా సిఎఫ్ఎస్ఎల్, పూణేలోని ఫైర్ సేఫ్టీ అకాడమి ని పుణులు సొంతంగా విచారణ చేబట్టారు. ఈ రెండు విభాగాల అధికారులు మంగళవారం సాయంత్రం ప్రమాదం జరిగిన ఎఫ్ఎస్ఎల్ మొదటి అంత స్తును పరిశీలించారు. ఇక్కడ కాలిపోయిన రికార్డులను కూడా వారు పరిశీలించారు. ఇందులోని సమాచారాన్ని తిరిగి పునరు ద్ధరించేందుకు తీసుకుం టున్న చర్యలను వారు ఇక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిఎఫ్ఎస్ఎల్, పూణేలోని ఫైర్ సేఫ్టీ అకాడమి నిపుణులు విచారణ రెండు మూడు రోజుల పాటు సాగే వీలుందని తెలిసింది. అనంతరం వారు దీనిపై పోలీసు శాఖకు వేరు వేరుగా నివేదిక ఇచ్చే వీలుంది.



మంగళవారం డిజిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న డిజిపి శివధర్‌రెడ్డి

# ఎఫ్ఎస్ఎల్ ప్రమాదంలో రికార్డులన్నీ సురక్షితం

## దుర్ఘటనపై పుణే ఫైర్ అకాడెమీ, కేంద్ర ఎఫ్ఎస్ఎల్ ఆధ్వర్యంలో విచారణ

## డిజిపి శివధర్‌రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** నాంపల్లిలోని రాష్ట్ర ఫోరెన్సిక్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్)లో జరిగిన అగ్నిప్రమాదంలో మంటలు చెలరేగిన మొదటి అంతస్తులో కొన్ని ఫైళ్లు కాలిపోయినా, కీలకమైన అన్ని రికార్డులు సురక్షితంగా ఉన్నాయని డిజిపి శివధర్‌రెడ్డి తెలిపారు. ఇక్కడ సంభవించిన ప్రమాదంలో కీలక రికార్డులన్నీ కాలిపోయాయని వస్తున్న వార్తలు అవాస్తవమని ఆయన తెలిపారు. మంగళవారం డిజిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ విషయాలను వెల్లడించారు. ఎఫ్ఎస్ఎల్ దుర్ఘటనలో ఓటుకు నోటు కేసులో రికార్డులతోపాటు ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన ఆధారాలు దహనం అయ్యాయని. దీని వెనుక కుట్ర ఉందని జరుగుతున్న ప్రచారం పూర్తిగా అబద్ధమని ఆయన తెలిపారు. అగ్నిప్రమాదంపై పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నారని, ఎఫ్ఎస్ఎల్ విభాగంలోని క్లూస్ బృందం అంతర్గతంగా విచారిస్తున్నారని ఆ యన తెలిపారు. ఓటుకు నోటు కేసుకు సంబంధించిన రికార్డులన్నీ చాలా కాలం క్రితమే కోర్టుకు ఇవ్వడం జరిగిందని, ఈ కేసుకు సంబంధించి ఎ లాంటి రికార్డులు, ఆధారాలు ఎఫ్ఎస్ఎల్‌లో లేదని, దీంతోపాటు ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన విచారణ తాలూకు రికార్డులను కూడా కోర్టుకు అప్పగించామని ఆయన తెలిపారు. ఎఫ్ఎస్ఎల్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై నిజానిజాలు వెలికి తీసేందుకు పూణెలోని ఫైర్ అకాడమితో విచారణ చేయిస్తున్నామని, దీంతోపాటు కేంద్ర ఎఫ్ఎస్ఎల్ నిపుణులు వేరుగా విచారిస్తున్నారని డిజిపి తెలిపారు. అగ్నిప్రమాదంలో కొన్ని ఫైల్స్ కాలిపోయి న మాట వాస్తవమేనని, వీటిని ఎఫ్ఎస్ఎల్ అధికారులు తిరిగి పునరుద్ధరిస్తున్నారని ఆయన వెల్లడించారు. ఎఫ్ఎస్ఎల్‌లో సర్వర్ల భద్రతకు బ్యాకప్ లేదని ఆయన తెలిపారు.

# కొండాపూర్ జంగమోనికుంట కబ్జాపై హైడ్రా యాక్షన్

## రూ.700 కోట్ల విలువైన 4 ఎకరాల చెరువును కాపాడి కంచె వేసిన అధికారులు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** చెరువును ఆక్రమించి ప్లాట్లను చేసి విక్రయించేందుకు సిద్ధం చేసిన వైనంపై హైడ్రా యాక్షన్‌కు దిగింది. దాదాపు 700 కోట్ల రూపాయల విలువైన నాలుగు ఎకరాల చెరువు భూమిని కాపాడి చుట్టూ ఫెన్సింగ్ వేశారు. కొండాపూర్‌లోని జంగమోని కుంట చెరువు ఆక్రమణలను మంగళవారం తొలగించిన హైడ్రా అధికారులు చెరువు భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి బోర్డులు ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శేరిలింగంపల్లి మండల పరిధిలోని కొండాపూర్ మజీద్‌బండలో సర్వే నెంబర్ 134లో జంగమోని కుంట చెరువు ఉంది. నాడు చుట్టు ప్రక్కల ప్రాంతాల భూములకు సాగునీటిని అందించిన ఈ చెరువు చుట్టూ నిర్మాణాలు పుట్టుకురావడంతో చెరువులోకి నీళ్ల వచ్చే అవకాశం లేకుండా పోయింది. దీన్ని ఆసరాగా తీసుకున్న కొంతమంది కబ్జాదారులు చెరువు స్థలాని ని ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేపట్టారు. చెరువు భూమిలో మట్టిపోసి చదును చేయడంతో పాటు ప్లాట్లు చేసి విక్రయించేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయమై గతంలోనే రెవెన్యూ అధికారులు కబ్జాదారుల మీద క్రిమినల్ కేసులు సైతం నమోదు చేశారు. కానీ చెరువు భూమి ఆక్రమణపై వెనక్కు తగ్గని కబ్జాదారులు తాజాగా గతకొని న్ని రోజులుగా మరోసారి మట్టి నింపి చదును చేయ సాగారు. ఈ విషయాన్ని స్థానికులు హైడ్రాకు పిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి, సర్వే నిర్వహిం చారు. దాదాపు 4 ఎకరాల జంగమోని కుంట చెరువును ఆక్రమించేం దుకు కబ్జాదారులు ప్ర యత్నిస్తున్నట్లు తెలుసు కున్న హైడ్రా అధికారులు మంగళవారం యాక్షన్‌కు దిగింది. చెరువు భూమిలో పాక్షికంగా ఏర్పాటు చేసిన నిర్మాణాలను నేలమట్టం చేసి 4 ఎకరాల చెరువు భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. దీంతో పాటు సదరు స్థలం జంగమోని కుంట చెరువు అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. మరోసారి చెరువు భూమి ఆక్రమణకు ప్రయత్నిస్తే కబ్జాదారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



చెరువు భూమి చుట్టూ ఫెన్సింగ్ వేస్తున్న దృశ్యం

# తెలంగాణపై కేంద్రం ఆర్థిక వివక్ష

## నిధుల్లో కోత... ఇది ఫెడరలిజంపై దాడే

## వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** కేంద్రంలోని మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాలతో దేశానికి అధికంగా ఆదాయం సమకూర్చుతున్న దక్షి ణాది రాష్ట్రాలు అన్యాయానికి గురవుతున్నాయని, ఇది కేవలం ఆర్థిక వివక్షే మాత్రమే కాదని, రాజకీయ ఉద్దేశంతో కూడిన వివక్ష అని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు.

'వికసిత్ భారత్' నినాదమిస్తూ దేశ అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం.. దక్షి ణాది రాష్ట్రాల పట్ల ముఖ్యంగా తెలంగాణ విషయంలో స్పష్టమైన వివక్ష, నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తోందని దుయ్యబట్టారు. దేశ ఆదాయానికి దక్షి ణాది వెన్నెముక అని, 2018-19 నుంచి 2022-23 వరకు అయిదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం వసూలు చేసిన మొత్తం పన్నులు రూ.90.80 లక్షల కోట్లు అయితే, ఇందులో దక్షిణాది రాష్ట్రాల నుండే పావుభాగానికి పైగా రూ. 22.86 లక్షల కోట్లు వచ్చాయన్నారు. అయినప్పటికీ దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం తిరిగి ఇచ్చిన నిధులు మాత్రం కేవలం 16.3 శాతం మాత్రమేనని గణాంకాలు చెబుతున్నాయని స్పష్టం చేశారు. ఇది ఆర్థిక సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధమని మంత్రి వ్యాఖ్యానించారు.

పన్నులు చెల్లించిన ప్రతి రూపాయికి తిరిగి వచ్చే నిధులను పోల్చితే కేంద్రం పాటిస్తున్న ద్వంద్వ వైఖరి బయటపడుతుందని తెలిపారు. దక్షి ణాది రాష్ట్రాలకు రూపాయికి సగటున 30 పైసలు ఇస్తూ, ఇదే సమయంలో బీహార్, ఉత్తరప్రదేశ్ లాంటి ఉత్తరాది రాష్ట్రాలకు రూ.1కి రూ.4 చొప్పున ఇస్తున్నారని, ఇది ఆర్థిక అసమతుల్యతను పెంచడమే కాకుండా, ఉత్తర, దక్షి ణాది రాష్ట్రాల మధ్య విభేదాలను సృష్టించే ప్రమాదకర ధోరణి అని హెచ్చరించారు. ఎక్కువ పన్నులు చెల్లించే రాష్ట్రాలను శిక్షి ంచడం, తక్కువ వసూళ్లు చేసే రాష్ట్రాలను ప్రోత్సహించడం కేంద్ర విధానంగా మారిందని ఆరోపించారు.

కేంద్రం చెప్పుకునే వికసిత్ భారత్ విధానం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతి నిధ్యం వహించే బిజెపి ఎంపీలు, కేంద్ర మంత్రులు కూడా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని పదేళ్లలో ఏనాడు ప్రశ్నించకపోగా, రాష్ట్రానికి అన్ని తెచ్చాం, ఇన్ని చేశాం, రాష్ట్ర ఖజానాకు కేంద్రమే పూర్తి నిధులు సమకూరుస్తుందనట్లు మాట్లాడటం వారి పతనానికి నాంది అని మంత్రి తుమ్మల హెచ్చరించారు. జాతీయ రహదారుల నిర్మాణాలను కూడా రాష్ట్రానికి విడుదల చేసే నిధుల ఖాతాలలో వేస్తున్న బీజేపీ నేతలు, వాటిని నిర్మించి మళ్లీ ప్రజల నుండే టోల్ చార్జీల రూపంలో వసూలు చేస్తున్న విషయాన్ని మరిచారా అని ప్రశ్నించారు. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రుణమాఫీ, రైతు భరోసా, పంట కొనుగోళ్లు, సాగునీటి ప్రాజెక్టులు, ఉచిత విద్యుత్ వంటి పథకాలతో భారీగా ఖర్చు చేస్తోందని, కానీ కేంద్రం నుంచి రావాల్సిన న్యాయమైన వాటా రాకపోవడం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి అడ్డంకిగా మారుతోందని మంత్రి తుమ్మల అన్నారు.

ఈసారి కేంద్ర బడ్జెట్‌లో చేర్చాల్సిందిగా తెలంగాణ చేసిన ప్రతిపాదనలలో ఒక్కటి కూడా మంజూరు చేయలేదని, ఇప్పటికైనా తెలంగాణను రాజకీయంగా శిక్షించే బడ్జెట్‌లు మానుకోని, ఫెడరలిజాన్ని గౌరవించి, తెలంగాణకు న్యాయమైన వాటా ఇవ్వాలని కేంద్రప్రభుత్వానికి హితవు పలికారు.

లేకపోతే 'వికసిత్ భారత్' ఒక నినాదంగానే మిగిలిపోతుందని, నిజమైన దేశ అభివృద్ధి సాధ్యం కాదని హెచ్చరించారు.

# ఆంధ్ర నుండి రాష్ట్రానికి రూ.408.48 కోట్ల బకాయి

## స్పష్టం చేసిన కేంద్రం

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ పునర్వవస్థీరకరణ చట్టం 2014 ప్రకారం రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్‌లోని ఉమ్మడి సంస్థల నిర్వహణ కోసం తెలంగాణ ప్రభుత్వం నిధులు ఖర్చు చేసింది. ఈ మేరకు దీనికి సంబంధించి కేంద్రం క్లారిటీ ఇచ్చింది. ఖర్చు చేసిన నిధులను తిరిగి చెల్లించే అంశంపై కేంద్ర ప్రభుత్వం కీలక వివరాలను వెల్లడించింది. లోక్‌సభలో ఖర్చు చేసిన నిధులను తిరిగి చెల్లించే అంశంపై కేంద్ర ప్రభుత్వం కీలక వివరాలను వెల్లడించింది. బిజెపి సభ్యులు ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నలకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానమిస్తూ ఖర్చు చేసిన నిధులను తిరిగి చెల్లించే అంశంపై కీలక వివరాలను వెల్లడించారు. రాష్ట్ర విభజన తదుపరి ఉమ్మడి హైకోర్టు, రాజ్‌భవన్ లాంటి రాజ్యాంగబద్ధమైన ఉమ్మడి సంస్థల నిర్వహణ కోసం తెలంగాణ ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.408.48 కోట్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తిరిగి చెల్లించాల్సి ఉన్నదని తెలిపారు. ఈ బకాయిలను వడ్డీ సహా చెల్లించాలని కోరుతూ గతంలో కేసీఆర్ ప్రభుత్వం 2022 జూలై 5న లేఖ రాసిందని, దీంతో ఆ వివాదాన్ని పరిష్కరించేందుకు కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో పలు సమావేశాలు జరిగాయని వివరించారు. వీటికి సంబంధించిన ఖర్చుల వివరాలను సరిచూసుకోవాలని 2025 ఫిబ్రవరి 3న జరిగిన సమావేశంలో కేంద్ర ప్రభుత్వం రెండు రాష్ట్రాలకు సూచించిందని వెల్లడించారు. ఆ అకౌంట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శి తాజాగా కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)కు లేఖ రాసినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం ఏపీ ఆర్థికశాఖ, పబ్లిక్ వర్స్ డిపార్ట్‌మెంట్ సమన్వయంతో ఆ గణాంకాలను సరిచూసే బాధ్యతను తీసుకున్నట్టు కాగ్ కార్యాలయం గత నెల 8న లేఖ ద్వారా వెల్లడించిందని తెలిపారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అకౌంటెంట్ జనరల్స్‌ను కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందని పంకజ్ చౌదరి పేర్కొన్నారు.

# రాష్ట్రంలో డిప్యూటీ ఇఒల కొరత!

## 62 పోస్టులకు రెగ్యులర్‌గా పనిచేస్తున్న వారు నలుగురే

## 24 పోస్టుల రిక్రూట్‌మెంట్ కోసం టిజిపిఎస్‌సికి విద్యా శాఖ లేఖ

## 12 డిఇఒ పోస్టుల్లోనూ రెగ్యులర్‌వారు నలుగురే

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పాఠశాల విద్యలో పర్యవేక్షణ చేసే అధికారుల కొరత తీవ్రంగా ఉంది. జిల్లా విద్యాశాఖాధికారి పోస్టులు, డిప్యూటీ జిల్లా విద్యాశాఖాధికారి పోస్టులతోపాటు మండలి విద్యాధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లా స్థాయిలో ఉండాల్సిన అధికారులు కూడా రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో పర్యవేక్షణ సక్రమంగా జరగడం లేదు. రాష్ట్రంలో 12 డీఈవో పోస్టులు మంజూరు కాగా వాటిలో ప్రస్తుతం నలుగురు మాత్రమే రెగ్యులర్ డీఈవోలు కొనసాగుతున్నారు. మిగిలిన 8 డీఈవో పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఇక రాష్ట్ర వ్యాప్తంగా 62 డిప్యూటీ డీఈవో పోస్టులు మంజూరు కాగా.. వాటిలోనూ కేవలం నలుగురు మాత్రమే రెగ్యులర్ డీఈవోలుగా కొనసాగుతున్నారు. మిగిలిన 58 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తం 62 పోస్టుల్లో 30 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాల్సి ఉంటుంది. అలా భర్తీ చేయాల్సిన పోస్టులు 24 ఉన్నాయి. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టుల భర్తీ కోసం విద్యా శాఖ అధికారులు ఖాళీలను భర్తీ చేసేలా రిక్రూట్‌మెంట్ చేయాలని కోరుతూ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి)కి లేఖ రాశారు.

అయితే ఈ పోస్టుల భర్తీలో ఇంటర్వ్యూలను నిర్వహించాలని పేర్కొంటూ టిజిపిఎస్‌సి విద్యాశాఖకు లేఖ రాసింది. దీనిపై వివరణ ఇస్తూ.. ఇప్పటికే రాష్ట్రంలో గ్రూప్-1, గ్రూప్-2 పోస్టుల భర్తీలోనే ఇంటర్వ్యూలను తొలగించిన నేపథ్యంలో డిప్యూటీ డీఈవోల భర్తీలో ఇంటర్వ్యూల ప్రస్తావన ఉండదని పేర్కొంటూ వివరణ పంపించినట్టు తెలిసింది. దీంతో డిప్యూటీ డీఈవోల డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ప్రారంభం కాలేదు.


ఇక డీఈవో పోస్టుల్లో కేవలం నలుగురే రెగ్యులర్ డీఈవోలు కొనసాగుతున్నారు. డీఈవోలుగా పదోన్నతులు ఇవ్వాలంటే సర్వీస్ రూల్స్ లేకపోవడంతోపాటు, కొందరిపై ఛార్జ్ మెమోలు పెండింగ్‌లో ఉండటంతో పోన్నతుల ప్రక్రియ ఆగిపోయింది. దీంతో ప్రస్తుతం డిప్యూటీ డీఈవోలుగా ఉన్న నలుగురు ఇన్‌చార్జ డీఈవోలుగా కొనసాగుతున్నారు. మరో ముగ్గురు ఐఎఎస్‌లు ఇన్‌ఛార్జ్ డీఈవోలుగా కొనసాగుతున్నారు. మిగిలిన వాటిల్లో జడ్‌పి సీఈవో, పరిశ్రమల శాఖ, ఇతర శాఖల అధికారులు ఇన్‌ఛార్జ్ డీఈవోలుగా కొనసాగుతున్నారు.

### ఇన్‌ఛార్జ్ డిఇఒలుగా ముగ్గురు ఐఎఎస్‌లు

డిప్యూటీ డీఈవోలుగా పదోన్నతులు పొందాలన్నా సర్వీస్ రూల్స్ ఉండాలి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 2018లో నూతన రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు కొత్తగా సర్వీస్ రూల్స్‌ను రూపొందించాల్సి ఉంది. సర్వీస్ రూల్స్ రూపొందిస్తే వాటి మేరకు పదోన్నతులు ఇవ్వడం సాధ్యం అవుతుంది. సర్వీస్ రూల్స్ రూపొం దించనంత వరకు డిప్యూటీ డీఈవోలకి డీఈవోలుగా పదోన్నతులు రావు, అలాగే గ్రేడ్-2 జీహెచ్‌ఎంలకు గ్రేడ్-1 జీహెచ్‌ఎంలుగా పదోన్నతులు రావు, డిప్యూటీ డీఈవోలుగా పదోన్నతులు పొందడం అసాధ్యం.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే సర్వీస్ రూల్స్‌ను రూపొందించి పదోన్నతులను ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# కల్తీ నెయ్యి కేసు రంగంలోకి ఇడి



### రూ.235 కోట్లు హవాలా మార్గంలో చేతుల మారినట్లు గుర్తింపు

### సిట్ అధికారుల నుంచి సమగ్ర సమాచారం సేకరించిన ఇడి

**విజయవాడ, ఫిబ్రవరి 10 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల నెయ్యి వివాదంలో తాజాగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ కేసును సిట్ విచారణ చేసి.. అనేక అంశాలను గుర్తించింది. రూ.235 కోట్ల విలువైన ఈ కుంభకోణంలో హవాలా మార్గాల ద్వారా భారీ మొత్తాల్లో సొమ్ము చేతులు మారినట్లు పేర్కొంది. దీంతో, ఈ వ్యవహారంలో తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. అందుకు సంబంధించిన సమగ్ర వివరాలను ఇడి అధికారులు సిట్ నుంచి తాజాగా తీసుకున్నారు. ఈ కేసుకు సంబం ధించిన ఎఫ్ఐఆర్, 36 మంది నిందితుల సమాచారం, వారి రిమాండ్ రిపోర్టులు, ఇప్పటివరకూ దాఖలు చేసిన అభియోగ పత్రాలు, వివిధ రాష్ట్రాల్లోని హవాలా ఏజెంట్ల ప్రమేయం, వారి పాత్ర తదితర అంశాలపై సమాచారం తీసుకుని ఇడి విచారణకు సిద్ధం అయింది. ఈ కేసులో భారీ ఎత్తున మనీ లాండరింగ్ జరిగినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ భావిస్తోంది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఇడి వివరాలు కోరింది. పూర్తి సమాచారం రాబట్టేందుకు సిద్ధమైంది. సిట్ విచారణలో టిటిడికి నెయ్యి సరఫరా వివరాలు... ఏ సంస్థ నుంచి ఎంత మేర సరఫరా చేసారు.. అందులో నాణ్యత ఎంత వంటి అంశాలపైన పూర్తి స్థాయి సమాచారం సేకరించింది. తమ సంస్థతో పాటు వైష్ణవి, ఏఆర్, మాల్‌గంగా డెయిరీల ద్వారా టిటిడికి సరఫరా చేసిన భోలేబాబా డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్‌లు ఈ అక్రమ కార్యకలాపాల కోసం విజయవాడ, చెన్నై, హైదరాబాద్, గుజరాత్, ఢిల్లీ, గ్వాలియర్ తదితర ప్రాంతాల్లోని పలువురు హవాలా ఏజెంట్ల ద్వారా డబ్బులు చెల్లింపులు జరిగినట్లు సిట్ అధికారులు ఆధారాలు సేకరించారు. ఈ వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉంది... ఎవరికి నగదు ముట్టింది వంటి అంశాల పైన ఆరా తీస్తున్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో హవాలాతో పాటు వివిధ మార్గాల్లో వచ్చిన డబ్బు ఏం చేశారు? ఎక్కడికి మళ్లించారు? అనేది ఇడి దర్యాప్తు చేయనుంది. దీంతో.. ఇడి ఇప్పుడు ఎవరికి నోటీసులు ఇవ్వనుంది?.. ఏం తేల్చనుంది?. ఈ కేసు ఎలాంటి మలుపు తీసుకుంటుందనేది ఆసక్తి కరంగా మారుతోంది.

## నేడు కొడంగల్‌కు సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఫిబ్రవరి10:** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బుధవారం వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో పర్యటించనున్నారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉదయం 11.30కు కొడంగల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల (బాలురు)లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అనంతరం తిరిగి హైదరాబాద్‌కు పయనమవుతారు.

## గృహాల సౌర విద్యుత్ లెక్కింపు తీరు కరెక్ట్ కాదు

### ఎస్పీడిసిఎల్ విధానాన్ని తప్పపట్టిన వినియోగదారుల ఫోరం

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ విషయంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) వ్యవహారాన్ని వినియోగదారుల ఫోరం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ పెట్టుకున్న వారు వినియోగించే విద్యుత్తును లెక్కించే తీరు సరికాదని తప్పుపట్టింది. వినియోగదారుడు ఉపయోగించిన మొత్తం విద్యుత్తు యూనిట్లలో సోలార్ ప్యానెల్ ద్వారా గ్రిడ్‌కు సరఫరా చేసిన యూనిట్లు తొలగించిన తరువాత మిగిలిన నికర యూనిట్లకు మాత్రమే బిల్లు వసూలు చేయాలని ఆదేశించింది. కూకట్‌పల్లికి చెందిన జి.వేణుగోపాల్ తన ఇంటిపై 3 కిలోవాట్ల సోలార్ పవర్ ప్యానెల్స్‌తోపాటు, దాని ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును లెక్కించడానికి నెట్‌మీటర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. గతంలో ఇంటికి సరఫరా అయిన యూనిట్ల నుంచి సోలార్ ప్యానెల్ ద్వారా గ్రిడ్‌కు సరఫరా అయిన యూనిట్లను తగ్గించి, బిల్లులు వేసేవారు. కానీ గత ఏడాది ఆగస్టు నుంచి మాత్రం ఇంటికి సరఫరా అయిన మొత్తం యూనిట్లకు బిల్లులు వేస్తున్నారు. అనంతరం ఆ బిల్లు నుంచి గ్రిడ్‌కు సరఫరా అయిన విద్యుత్తును తగ్గిస్తున్నారు. ఈ కారణంగా శ్లాబులు మారుతున్నాయని, కరెంట్ బిల్లులు రెట్టింపు అవుతున్నాయని ఫిర్యాదు చేశారు. వాదనలు విన్న ఫోరం చైర్‌పర్సన్ బి లలిత, సభ్యులు మంత్రు నాయక్, వి.అనిల్ రెడ్డిల ధర్మాసనం కేవలం నికర యూనిట్లకు మాత్రమే బిల్లు వేయాలని ఆదేశించింది.

# నేనెవరికీ దత్తపుత్రుడిని కాను

### మా తల్లిదండ్రులు పెట్టిన పేరు మార్చే అధికారం మీకెక్కడిది?

### సరదా ఉంటే మీ పేరు రేవంత్‌ఖాన్‌గా మార్చుకోండి

### మజ్లిస్‌తో కాపురం చేసినన్ని రోజులు మీపై నిప్పులు పోస్తూనే ఉంటాం

### కెసిఆర్‌కు, మీకు ఏదైనా ఉంటే మీరే తేల్చుకోండి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతుండడంతో ఓటమి తప్పదని గ్రహించిన సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీపై, తనపై పనిగట్టుకుని విమర్శలకు దిగుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎవరికీ దత్తపుత్రుడిని కానని, కేసీఆర్‌కు రేవంత్ కు ఏదైనా తగాదాలు ఉంటే వాళ్లు వాళ్లే తేల్చుకోవాలని హితవు చెప్పారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు మార్చే అధికారం మీకెవరిచ్చారని సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి రేవంత్ వచ్చి రెండున్నరేళ్లు అవుతోందని, ఈ రెండున్నరేళ్లలో తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఎక్కువగా ఇచ్చిందా? లేక రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువగా ఇచ్చిందో ప్రజలకు చెప్పాలని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతాయి తప్పితే.. చేసేదేమీ ఉండదని ఎద్దేవా చేశారు. తెలంగాణకు మోదీ ప్రభుత్వం ఏమిచ్చిందో వివరించేందుకు బహిరంగ చర్చకు తాను సిదమని, సెక్రటేరియేట్ లేదా ప్రెస్ క్లబ్‌లో ఎక్కడ చర్చ పెడతారో చెప్పండి వస్తాననని సీఎంకు మరో సవాల్ విసిరారు. హామీలు అమలు చేయాలని ప్రశ్నిస్తే తమపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇది సరైన పద్ధతి కాదని, అంత సరదాగా ఉంటే సీఎం తన పేరును రేవంత్‌ఖాన్‌గా మార్చుకోవాలని, తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఘాటుగా వ్యాఖ్యానించారు. తనపై సీఎం వ్యక్తిగత విమర్శలకు దిగారని, తన పేరు, ఇంటిపేరు మార్చి పిలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎంఐఎంతో కాపురం చేసినన్ని రోజులు నిప్పులు పోస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మజ్లిస్‌తో రహస్య ఒప్పందాలు చేసుకుని లోపాయికారీ రాజకీయాలు నడుపుతున్నాయని ఆయనఆరోపించారు.

రాష్ట్రంలో మూడు వేల డివిజన్లలో మజ్లిస్ ఉండి కూడా పోటీ చేయకపోవడం వెనుక కుమ్మక్కే కారణమన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలన్నీ గాలిలో కలిసిపోయాయని విమర్శించారు. చేతకానితనాన్ని కప్పి పుచ్చుకోవడానికి కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్ నిందలు వేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. రెండున్నరేళ్ల పాలనలో కాంగ్రెస్ తెలంగాణ ప్రజలకు చేసింది శూన్యమని దుయ్యబట్టారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయం అనివార్యమని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి బీజేపీకి అద్భుతమైన స్పందన వచ్చిందని, దాంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఓటర్లకు భారీగా డబ్బులు వెదజల్లుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే ప్రధాని మోదీ వచ్చి మోరీలు సాఫ్ చేస్తారా అని సీఎం అడుగుతున్నారని... మరి మున్సిపల్ మంత్రిగా సీఎం రేవంత్ వెళ్లి మోరీలు సాఫ్ చేస్తారా? అని ప్రశ్నించారు. దేశం స్వచ్ఛంగా ఉంచాలనే ఉద్దేశంతో స్వచ్ఛ భారత్ పథకం తీసుకొచ్చి గ్రామాలు, పట్టణాల్లో పరిశుభ్రతను తీసుకొచ్చిందే కేంద్ర ప్రభుత్వమని గుర్తు చేశారు. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు కేంద్రంతో సంబంధం ఏముందని ప్రశ్నిస్తున్నారని, పట్టణ ప్రాంతాలకు, గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన భారీగా నిధులు అందజేస్తోందని గుర్తు చేశారు. ఈ విషయం సీఎం రేవంత్‌రెడ్డి తెలుసుకోవాలన్నారు.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టు చేస్తామని ఎప్పుడు కూడా కేంద్రం చెప్పనేలేదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల క్రమాలు, అధికార దుర్వినియోగం, అరాచకాలను ప్రజలు మర్చిపోలేదని, ఆ పార్టీకి ఓటేసినా.. మూసీ నదిలో వేసినా ఒక్కటేనని ఘాటుగా వ్యాఖ్యానించారు. తమ ఇంటికి కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు రావొద్దంటూ రిటైర్ బెనెఫిట్స్ రాని ఉద్యోగులు బోర్డులు పెట్టుకున్నారని, డీఏలను తొలిసారిగా వాయిదాల రూపంలో రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏది ఉన్నా స్టీరింగ్, హారన్, ఎస్కలేటర్ తమ చేతుల్లో ఉందంటూ గతంలో అసదుద్దీన్ ఒవైసీ చెప్పగా, నేడు సీఎం రెడ్డి అయినా, రావు అయినా తమ దగ్గరికి రావాల్సిందేనని అని అక్బరుద్దీన్ ఒవైసీ చసిన వ్యాఖ్యలు దారుణమన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు మజ్లిస్ పార్టీకి బానిసలుగా బతుకుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీఆర్ఎస్, కాంగ్రెస్ హయాంలో జరిగిన అవకతవకలు, అక్రమాల గురించి విచారణ జరుపుతామని ప్రకటించారు.

# సర్కారీ విభాగాల్లో అవినీతి పెరిగింది, చర్యలు తీసుకోండి

### ముఖ్యమంత్రికి ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విభాగాల్లో అవినీతి పెరిగి పోయిందని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ పేర్కొంది. ఈ మేరకు సంస్థ కార్యదర్శి పద్మనాభ రెడ్డి మంగళవారం నాడు సిఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. తప్పు చేస్తే శిక్ష పడుతుందనే భయం ప్రభుత్వ ఉద్యోగుల్లో ఎక్కడా కనిపించడం లేదని ఆయన తెలిపారు. సర్కారీ ఉద్యోగులపై ఎసిబి, విజిలెన్స్ విభాగాలు విచారణ జరిపి ప్రభుత్వానికి పంపిన నివేదికలపై సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. లంచం తీసుకుంటూ పట్టుబడిన ఉద్యోగులతో పాటు ఆశ్రిత పక్షపాతం, బంధు ప్రీతితో ప్రభుత్వానికి నష్టం కలిగించే అధికారులపై సర్కారు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, ఇది సరైనది కాదని ఆయన తెలిపారు. అక్రమార్కులపై చర్యల కోసం సంబంధిత విభాగాల నివేదికలు ఏళ్ల తరబడి ప్రభుత్వం వద్ద పడివున్నాయని ఆయన తెలి పారు. సచివాలయంలో కొందరు అధికారులు అవినీతికి కొమ్ముకాస్తూ ఎసిబి, విజిలెన్స్ నివేదికలను ఏదో ఒక వంకతో సాగదీసి చివరకు నో పనిష్మెంట్‌గా చెబుతూ కేసులను డ్రాప్ చేస్తున్నారని, దీనివల్ల అవినీతిపరులకు మరింత ఊతం ఇచ్చినట్లుగా వుందని పద్మనాభ రెడ్డి తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో ఎసిబి, విజిలెన్స్ పెండింగ్ కేసులు రెవెన్యూ విభాగంలో ఎన్ని వున్నాయో...? సమాచార హక్కు చట్టం ద్వారా 2021లో దరఖాస్తు చేస్తే దీనిపై సమాచారం ఇవ్వడానికి సంబంధిత అధికారులు నిరాకరించారని ఆయన వెల్లడించారు.

దీనిపై అప్పీల్‌కు వెళ్లగా 2026 జనవరి 27వ తే దీన సమాచారం అందిందని, దీనిని పరిశీలిస్తే రాష్ట్ర సచివాలయంలో ఎసిబి, విజిలెన్స్ విభాగాల నివేదికలపై చర్యలు తీసుకోవడం లేదని స్పష్టమ వుతుందని పద్మనాభ రెడ్డి పేర్కొన్నారు. రెవెన్యూ శాఖ ఇచ్చిన సమాచారం ప్రకారం ఆ శాఖలో మొత్తం 323 ఎసిబి కేసులుంటే అందులో కేవలం ఐదు మాత్రమే డిస్పోజ్ అయ్యాయని, మిగిలిన 318 కేసులు పదేళ్ల నుంచి వివిద దశలలో పరిశీలనలో వున్నాయని చెబుతుండడం వింతల్లో కెల్ల వింతగా ఆయన అభివర్ణించారు.

ఇదే సమయంలో విజిలెన్స్ కేసులు మొత్తం 129 వుండగా ఇందులో కేవలం ఎనిమిది మాత్రమే డిస్పోజ్ కాగా మిగతా 121 కేసులు ఏళ్ల తరబడి పరిశీలన లో వున్నాయని ఆయన తెలిపారు. ఇక ఎసిబి అధికారులు నిత్యం ఏదో ఒక చోట లంచం తీసుకుంటున్న వారిని పట్టుకుంటునే వున్నా లంచావతారులు దొరుకుతుండడం ఆగడం లేదని ఆయన తెలిపారు.



## అమెరికాపై విజయం సాధించిన పాకిస్థాన్

### 32 పరుగుల తేడాతో యుఎస్ఎ ఓటమి

### ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా సాహిబ్‌జాదా ఫర్హాన్

**కొలంబో, ఫిబ్రవరి 10:** టి20 ప్రపంచకప్‌లో మంగళవారం జరిగిన 12వ మ్యాచ్‌లో 32 పరుగుల తేడాతో అమెరికాజట్టుపై పాకిస్తాన్ గెలిచింది. టాస్ గెలిచిన యుఎస్ఎ జట్టు కెప్టెన్ మొనాంక్‌పటేల్ పాక్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. తొలుత బ్యాటింగ్‌చేపట్టిన పాకిస్తాన్ తొమ్మిది వికెట్ల నష్టానికి నిర్ణీత ఓ వర్లలో 190 పరుగులుచేసి ప్రత్యర్థికి 191 పరుగుల లక్ష్యం విధించింది. తదనంతరం లక్ష్యఛేదనలో అమెరికా కొంతమేర తడబడింది. ఎనిమిది వికెట్లు నష్టపోయి 158 పరుగులకే ఆలౌట్ కావడంతో 32 పరుగుల తేడాతో పాకిస్తాన్ మ్యాచ్ గెలిచింది. బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ జట్టులో ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ 41 బంతుల్లో ఆరుఫోర్లు,ఐదు సిక్స్‌లతో 73 పరుగులుచేసి అర్ధసెంచరీ బ్రేక్‌చేసాడు. బాబర్ అజామ్ 32 బంతుల్లో నాలుగుఫోర్లు ఒక సిక్స్‌తో 46 పరుగులుచేసి రాణించాడు. సైమ్ ఆయూబ్ 19 పరుగులుచేస్తే కెప్టెన్ సల్మాన్ ఆఘా ఒకే పరుగుతో సింగిల్ డిజిట్‌కే పెవిలియన్‌చేరాడు. చివరిలో షాదాబ్‌ఖాన్ 12 బంతుల్లో నాలుగుఫోర్లు ఒకసిక్స్‌తో 30 పరుగులుచేసి దూకుడుగా ఆడాడు. శుభం రంజనే 51, షయాన్ జహంగీర్ 49పరుగులతో పోరాడి రాణించాడు. యుఎస్ఎ జట్టులో ఓపెనర్లు ఆండ్రీస్ గౌస్ 13, షయాన్ జహంగీర్ 49లు బౌండరీలతో చెలరేగిపోయారు. పాక్‌బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టేసారు. కానీ నవాజ్ తన మొదటి ఓవర్‌లోనే గౌస్‌ను బోల్తా కొట్టించాడు. వెనువెంటనే కెప్టెన్ మొనాంక్ పటేల్‌ఋ మూడు పరుగులకే ఔట్‌చేసాడు. జహంగీర్; మ ఇలింద్‌కుమార్‌లు ఆచితూచి ఆడారు. బౌలర్లలో వాన్ షాల్క్ విక్ 25 పరుగులిచ్చా నాలుగు వికెట్లు తీసి ఆకర్షించాడు. సౌరభ్ నేత్రావల్కర్; మహ్మద్‌మోసిన్, హర్మిత్‌సింగ్ చెరొక వికెట్‌తీసారు. గత టి20 ప్రపంచకప్‌లో పాక్‌ను అమెరికా జట్టు ఓడించిన సంగతి తెలిసిందే. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా షహిబ్‌జాదా ఫర్హాన్ నిలిచాడు. 41 బంతుల్లో 73 పరుగులుచేసి తన సత్తాను చూపించాడు. మ్యాచ్‌లో అమెరికా పేసర్ శాడ్లీ వాన్ చెలరేగిపోయాడు. 25 పరుగులిచ్చి నాలుగు వికెట్లు తీసి పాక్ బ్యాటర్లను వణికించాడు.

## చైర్మన్ కుర్చీ కోసం రిసార్ట్ పాలిటిక్స్

### మేయర్ పీఠం కోసం కోట్లు కుమ్మరిస్తున్న నేతలు

### ఎక్స్ అఫీషియో ఓట్లే నిర్ణయించనున్న మేయర్, చైర్మన్ పదవులు

### మహిళా రిజర్వేషన్లతో కుటుంబ రాజకీయాలకు అవకాశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఫిబ్రవరి10:** సాధారణ వార్డు మెంబర్‌గా గెలవడం ఒక ఎత్తైతే, ఆపై మున్సిపల్ చైర్మన్గా లేదా మేయర్గా ఎంపికవ్వడం మరో ఎత్తు పరోక్ష పద్ధతిలో జరిగే ఈ ఎన్నికల్లో విజయం సాధించడానికి అవసరమైన మద్దతును కూడగట్టుకునేందుకు తెలంగాణలో అభ్యర్థులు భారీగా వెచ్చిస్తున్నారు. అధికార పార్టీలో ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో, అధిష్టానం వద్ద తమ పలుకుబడిని పెంచుకోవడమే కాకుండా, తోటి కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకునేందుకు కోట్ల రూపాయల ప్యాకేజీలను ఆఫర్ చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో వినపడుతోంది. పదవి దక్కితే వచ్చే అధికారం, కాంట్రాక్టులు, స్థిరాస్తి వ్యాపారాల్లో దక్కే ప్రయోజనాల దృష్ట్యా ఈ స్థాయి ఖర్చును ఒక పెట్టుబడిగా నేతలు భావిస్తున్నారు.ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే గెలిచిన అభ్యర్థులు జంపింగ్ కాకుండా ఉండేందుకు ప్రధాన పార్టీలు క్యాంపు రాజకీయాలకు తెరలేపాయి. తమ పార్టీ గుర్తుపై గెలిచిన వారిని, అలాగే స్వతంత్ర అభ్యర్థులను ఇతర పార్టీలు ప్రలోభపెట్టకుండా గోవా, బెంగళూరు వంటి సుదూర ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం. ఒక్కో ఓటుకు లక్షల రూపాయలతో పాటు ఇతర విలాసవంతమైన ఆఫర్లు కూడా ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మొత్తం ప్రక్రియలో ప్రజాస్వామ్యం కంటే ధనబలమే ఎక్కువగా కనిపిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి..మేయర్, చైర్మన్ ఎన్నికల్లో కేవలం గెలిచిన కౌన్సిలర్లే కాకుండా, ఆ ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఓటు వేసే అవకాశం ఉంటుంది. మెజారిటీకి అతి సమీపంలో ఉన్న చోట్ల ఈ ఓట్లు అత్యంత కీలకం కానున్నాయి.

## పవన్‌కల్యాణ్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

### రాష్ట్ర ఎన్నికల సంఘానికి తెలంగాణ జనసేన ఫిర్యాదు

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నేడు జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తమ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ జనసేన డిమాండ్ చేసింది. ఈ మేరకు జనసేన తెలంగాణ నాయకులు మంగళవారం ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కి ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉన్న సమయంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి జనసేన పార్టీ అధ్యక్షుల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తోపాటు పార్టీ అభ్యర్థులపై చేసిన అవమానకర, ఉద్రిక్తతలు రేకెత్తించే వ్యాఖ్యలను జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని రాష్ట్ర ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్, రాష్ట్ర నాయకులు రాధా రామ్ రాజలింగం అన్నారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ విధానాలపై మాట్లాడాల్సిన చోట వ్యక్తిగత విమర్శలు, అవహేళనలకు దిగడం ఎన్నికల నియమావళి ఉల్లంఘన అన్నారు. రాజ్యాంగ పదవిలో ఉన్న ప్రజాప్రతినిధి సామాజిక జనసేన పార్టీ ప్రతిష్టను దెబ్బతీయడానికి, ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేయడానికి చేసిన ఈ వ్యాఖ్యలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈ వ్యవహారంపై తక్షణ చర్యలు తీసుకుని, సంబం ధిత వీడియో ప్రసారాన్ని నిలిపివేయాలని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను కొరారు. ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి పైన చట్టపరమైన చెర్యలు తీసుకోవాలని తెలంగాణా ఎన్నికల కమీషనర్ రాణి కుముదిని కోరినట్టు తెలిపారు.

# పత్రికలు సమాజానికి ప్రాణవాయువు!

### ఒయు తెలుగు లిటరరీ కాంగ్రెస్‌కు హాజరైన విదేశీ తెలుగు ప్రతినిధులు

**హైదరాబాద్ (తార్నాక), ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** తెలుగు మృతభాష కాదని అమృత భాష అని వివిధ దేశాల నుంచి హాజరైన తెలుగు ప్రతినిధులు పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ ఆధ్వర్యంలో రెండో తెలుగు లిటరరీ కాంగ్రెస్ రెండో రోజు ఆర్ట్స్ కళాశాలలో వివిధ అంశాలపై సదస్సు నిర్వహించారు. రూమ్ నెంబర్ 121 లో మంగళవారం 'దేశ విదేశాల్లో 'తెలుగు భాషా వ్యాప్తికి జరుగుతున్న కృషి మార్గదర్శనం' అనే అంశంపై పద్మవిభూషణ్ సంజీవ నరసింహా అధ్యక్షతన చర్చను నిర్వహించారు. జయ పీసపాటి మాట్లాడుతూ హాంకాంగ్‌లో తాము తెలుగు ఫెస్టివల్‌ను నిర్వహించడంతోపాటు పిల్లలకు నాట్యం, నృత్యం, వాద్యంలను నేర్పిస్తున్నామని తెలిపారు. అలాగే తెలుగు బడి కార్యక్రమాన్ని కూడా కొనసాగిస్తున్నామని చెప్పారు. అమెరికా న్యూయార్క్ నుంచి హాజరైన గూడూరు శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు లిటరరీ అసోసియేషన్ ద్వారా తాము తెలుగు సాహిత్య సేవలు చేస్తున్నామని చెప్పారు. పద్యాలు, లలిత గీతాలు, నేర్పిస్తున్నామన్నారు. గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ ద్వారా తమ కార్యక్రమాలను 30 దేశాలకు విస్తరింపచేశామని కల్వల విశ్వేశ్వర్ చెప్పారు. 100 దేశాల్లో తెలుగు భాష ఉందని వివరించారు. ఆస్ట్రేలియా నుంచి హాజరైన విజయ మాట్లాడుతూ ప్రతి శనివారం రెండు గంటలపాటు తాము తెలుగులో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తెలుగు భాష ఉత్సవాన్ని నిర్వహించడంతోపాటు భారతం, భాగవతాన్ని పిల్లలకు నేర్పిస్తున్నామన్నారు. రేడియో కార్యక్రమాలు కూడా చేపడుతున్నామన్నారు. జర్మనీ నుంచి హాజరైన గణేష్ తొట్టిపూడి మాట్లాడుతూ సిపి బ్రౌన్ తెలుగు వ్యాకరణాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు తెలుగు భాషను నేర్చుకోవడం కోసం టూల్స్ డెవలప్ చేసామని చెప్పారు. ఇక్కడ మూడు నాలుగు తరాల నుంచి తెలుగు భాషను మాట్లాడుతూ కాపాడుతున్నారని వివరించారు.

**పత్రికలు సమాజానికి ప్రాణవాయువు**

**'వార్త' సహ సంపాదకుడు ఎ.వి.వి.ప్రసాద్**

'మారుతున్న పత్రికలు.. ఉద్యోగ అవకాశాలు' అనే అంశంపై ప్రముఖ తెలుగు దినపత్రిక వార్త సహ సంపాదకుడు ఎ.వి.వి ప్రసాద్ మాట్లాడుతూ పత్రికలు సమాజానికి ప్రాణవాయువు లాంటి వన్నారు. సమాజంలో కీలక వ్యవస్థగా మీడియా వ్యవహరిస్తోందని, ప్రతికారంగంలో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అయితే కొత్తగా ఆలోచించే శక్తి, వార్తను కొత్త కోణంలో చెప్పగల సామర్థ్యం ఉంటే ఈ రంగంలో ముందుకు వెళ్లగల రన్నారు. సమాజా నికి ఏమి చేయగలమనే లక్ష్యంతో పత్రికా రంగంలో అడుగుపెడితే మంచి అవకాశాలుంటాయని చె ప్పారు.

తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో పట్టు సాధించి, నైపుణ్యంతో పనిచేస్తే తెలుగు పత్రికల్లో మంచి స్థానం సంపాదించవచ్చని సూచించారు. భాషలో పట్టు రావాలంటే భాషపై లోతైన పరిజ్ఞానం అవసరం అన్నా రు. సృజనాత్మక శక్తి కల్గిన వారే ప్రతికారంగంలో నిలదొక్కుకుంటారని చెప్పారు.



ఆచార్య కమలాకరశర్మ, ఆచార్య డా. మూర్తి రేమిళ్లచే జ్ఞాపికను అందుకుంటున్న 'వార్త' సహసంపాదకుడు ఎ.వి.వి.ప్రసాద్

ఈ సందర్భంగా ఉస్మానియా విశ్వ విద్యాలయంలో తెలుగు సాహిత్య మహాసభలను ఘనంగా నిర్వహించిన వైస్‌చాన్సలర్ ప్రొ. కుమార్ మొలగరం, ప్రిన్సిపల్ ప్రొ. కాశీం, కన్వీనర్ ప్రొ.కమలాకర్ శర్మ, సదస్సు కో కన్వీనర్ డా. మూర్తి రేమిళ్ల తదితరులకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు. అనంతరం వడ్లమాని దుర్గ, జంధ్యాల కిషోర్ శరత్‌బాబు మాట్లాడుతూ బాల్యం నుంచే తెలుగు భాషపై మక్కువ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

మూర్తి రేమిళ్ల, వెల్మల కృష్ణారావు, నరసింహులు మరాఠీ ఇస్రో రిటైర్డ్ సైంటిస్ట్ జయకృష్ణ కిషోర్, నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె వి ఎన్ డి ప్రసాద్, డా. సగిలి సుధారాణి తదితరులు ప్రసంగించారు.

'తెలుగు భాషా పరిశోధనలో శాస్త్ర సాంకేతిక సాధనాల వినియోగం' అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆచార్య వైరెడ్డి శ్యామల అధ్యక్షత వహించారు. ఆధునిక సాంకేతికతతో తెలుగు భాషకు మెరుగులు దిద్దాల్సిన అవసరం ఉందని చెప్పారు.

ఆన్‌లైన్‌లో తెలుగు భాషా బోధన గురించి డాక్టర్ ఝాన్సీ ఉడుము, తెలుగు భాషా పరివ్యక్తికి మార్గాలు అనే దానిపై సిరికొండ నరసింహరాజు, తెలుగులో సాంకేతిక అభివృద్ధి సాంకేతిక వినియోగంపై రెహమానుద్దీన్ షేక్, తెలుగు పరిశోధనల్లో శాస్త్ర సాంకేతికత వినియోగంపై దాసరి కరుణలు ప్రసంగించారు. రూమ్ నెంబర్ 133లో జరిగిన సదస్సు తెలుగు లిటరరీ కాంగ్రెస్ రెండోరోజు మంగళవారం రూమ్ నెంబర్ 133లో 'సోషల్ మీడియా లైక్స్, షేర్స్, వైరల్ సాహిత్యం' అనే అంశంపై సదస్సును నిర్వహించారు. రాజీ కన్నా, చరణ్ పరిమి, అమృత రాజ్, సాత్వికలు ఈ అంశంపై ప్రసంగించారు. అలాగే 'యువ రచయితల సాహిత్యం గమనం, గమ్యం' అనే అంశంపై సాయి వంశీ, శివశంకర్, ఉదయ్, రాము వేర్ల వెంకటనారాయణ, విమల ప్రసంగించారు.

'సీనియర్ రచయితల నుంచి మేమేం కోరుకుంటున్నాం' అనే అంశంపై దండ వెంకట రాములు, బాలు అగ్నివేష్, హాతి రామ్, ధరణి ప్రసంగించారు.

## తెలంగాణలో బిసి రిజర్వేషన్ల పెంపు బిల్లులు పరిశీలనలో..

### లోక్‌సభలో కేంద్రం స్పష్టీకరణ.. ప్రశ్నించిన ఈటల రాజేందర్

### శాసన సభ కార్యదర్శి నుంచి రెండు బిల్లులు వచ్చినట్లు కేంద్రం వెల్లడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఫిబ్రవరి10:** తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులు పరిశీలనలో ఉన్నాయని లోక్ సభలో కేంద్ర ప్రభుత్వం తెలిపింది. తెలంగాణలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడంపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. దీనితో కేంద్ర మంత్రి బీఎల్ వర్మ వివరణ ఇచ్చారు. రెండు బీసీ బిల్లులు రాష్ట్రపతి ఆమోదం కోసం వచ్చాయని, అవి పరిశీలనలో ఉన్నాయని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ పెంపునకు సంబంధించి తెలంగాణ శాసనసభ కార్యదర్శి నుంచి రెండు బిల్లులు రాష్ట్రపతి ఆమోదానికి వచ్చాయని తెలిపారు. ఈ బిల్లులు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ అసెంబ్లీలో ఆమోదం పొందిన రెండు బిల్లులను కేంద్ర ప్రభుత్వానికి పంపించడం తెలిసిందే.

## అడుగడుగునా ఎన్నికల కోడ్ ఉల్లంఘన

### కాంగ్రెస్ నేతలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు బిఆర్ఎస్ ఫిర్యాదు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఫిబ్రవరి10:**తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల వేళ అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తుంగలో తొక్కుతోందని భారత రాష్ట్ర సమితి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ కురువ విజయ్ కుమార్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదినిని కలిసి, అధికార కాంగ్రెస్ పార్టీ అక్రమాలపై సమగ్ర వినతి పత్రాన్ని సమర్పించింది.మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలిసి కాంగ్రెస్ నేతలు అడ్డదారులు తొక్కుతున్నారని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రచారం ముగిసినా.. అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బొమ్మెర రామ్మూర్తి, సురివి యాదయ్య గౌడ్, పార్టీ లీగల్ సెల్ ప్రతినిధి సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

## రంజీ ట్రోఫీలో సంచలనాలు

### చరిత్రలో తొలిసారిగా సెమీస్ చేరిన జమ్మూ కాశ్మీర్, ఉత్తరాఖండ్

### క్వార్టర్ ఫైనల్‌లో ఓడిపోయిన మాజీ ఛాంపియన్లు ముంబయి, మధ్యప్రదేశ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** భారత దేశవాళి క్రికెట్‌లో టెస్ట్ ఫార్మట్‌కు కేరాఫ్‌గా నిలిచిన రంజీ ట్రోఫీలో సంచలనాలు నమోదయ్యాయి. రంజీ ట్రోఫి చరిత్రలో తొలిసారిగా జమ్మూ కాశ్మీర్, ఉత్తరఖండ్ జట్లు సెమీ ఫైనల్‌కు చేరాయి. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో జమ్మూ కాశ్మీర్ మాజీ ఛాంపియన్ మధ్యప్రదేశ్‌పై 56 పరుగుల తేడాతో గెలుపొందగా ఉత్తరఖండ్ ఝార్కండ్‌పై ఇన్నింగ్స్ ఆరు రన్ల తేడాతో గెలుపొందింది. రంజీ ట్రోఫీలో 67 ఏళ్లుగా పాల్గొంటున్న జమ్మూ కాశ్మీర్ గతంలో క్వార్టర్స్ వరకు చేరుకున్న దాఖలాలు వున్నా సెమీస్ చేరడం ఇదే తొలిసారి. క్లబ్ క్రికెట్ స్థాయి జట్టుగా పేరున్న జమ్మూ కాశ్మీర్ రంజీ సెమీస్ చేరడం వెనుక ఆ జట్టు సమిష్టి దాగివుందని కోచ్ తెలిపాడు. ఇక ఉత్తరఖండ్ కూడా చరిత్ర సృష్టిం చి రంజీ ట్రోఫిలో తొలిసారి సెమీస్ చేరింది. ఈసారి రంజీ క్వార్టర్స్‌లో జరిగిన మరో వింత 42 సార్లు రంజీ ట్రోఫి గెలిచి, టోర్నీలోనే అత్యంత బలంగా వున్న మాజీ ఛాంపియన్ ముంబాయి జట్టు ఓడిపోవడం. లీగ్ మ్యాచ్‌లో టాపర్‌గా వుండి కర్నాటకతో పోటీపడి నాలుగు వికెట్ల తేడాతో ఓ డి పోయింది. టీమిండియా ఆటగాడు కెఎల్ రాహుల్ సెంచరీతో తన జట్టును విజయం వైపు నడిపించి ముంబాయి ఆశలపై నీళ్లుచల్లాడు. మరో క్వార్టర్స్‌లో తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ బెంగాల్ చేతిలో ఇన్నింగ్స్ తేడాతో ఓడిపోయింది.

# రాష్ట్రంలో పట్టణాల అభివృద్ధికి ప్రాధాన్యత


ఉప్పల్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎం.రజితరెడ్డి తదితరులు

## ఐటి శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు
## రెండేళ్లలో రూ.380 కోట్లతో పనులు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**హైదరాబాద్(ఉప్పల్), ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** రాష్ట్రంలో పట్టణాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో రూ.62 కోట్ల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబుతోపాటు శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, పలువురు కార్పొరేటర్లు, స్థానిక నేతలతో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఉప్పల్ నియో జకవర్గంలో రూ.116 కోట్ల పలు పనులు చేపడుతున్నామని, గత రెండేళ్ల కాలంలో గ్రేటర్ పరిధిలో సిఎం రేవంత్‌రెడ్డి మున్సిపల్ మంత్రిగా ఉంటూ నగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చి దిద్దుతున్నారని తెలిపారు. నగరంలో మౌలిక సదుపాయాల తోపాటు మంచినీరు, డ్రైనేజీ, క్రీడా వ్యవస్థను కూడా అభివృద్ధి చేయాలని నిర్ణయిం చినట్లు తెలిపారు. ఉప్పల్‌లో యువ తకు క్రీడా సదుపాయలు కల్పించాలనే లక్ష్యంతో రూ.9 కోట్లతో ఫుట్‌బాల్ స్టేడియం నిర్మిస్తున్నామని తెలిపారు. ఎస్ఎన్‌డిపి కింద రూ35 కోట్లతో చెరువు సుందరీకరణ, హెచ్ ఎండిఏ కింద రూ.8 కోట్లతో ఆరో వాటర్ ప్లాంటు, రూ. 2 కోట్లతో పాఠశాల భవనం నిర్మిస్తున్నామని తెలిపారు. కాప్రాలో రూ.55 కోట్లతో పలు పనులు చేపట్టినట్లు ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వాలు ప్రజలను ప్రలోభాలు పెట్టిందని, గ్రేటర్‌లో గత ప్రభుత్వం పనితీరు, కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరు చూడాలని కోరారు. ఉప్పల్‌లో గతంలో బిఆర్ఎస్ రూ.195 కోట్లు ఖర్చు చేసిందని, కాంగ్రెస్ పార్టీ వచ్చిన తర్వాత రెండేళ్ల కాలంలో రూ.380 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా పట్టణాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ముందుకు సాగుతున్నామని తెలిపారు. తెలంగాణలోని అన్ని మున్సి పాలిటిలకు పెద్ద ఎత్తున నిధులు ఇచ్చామని తెలిపారు. బతుకమ్మ కుంట తరహాలోనే ఉప్పల్ నల్ల చెరువును అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. హైడ్రా అంటే బిజెపి, బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేశారని తెలిపారు. చెరువులు, మౌళిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రాబోయే మూడేళ్లలో మిగిలిన కార్పొరేషన్లను కూడా అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

**కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల తోపులాట : మంత్రి కాలికి గాయం**

మంత్రి శ్రీధర్‌బాబు ఉప్పల్ పర్యటన సందర్భంగా కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ నేతల మధ్య మరోసారి నినాదాలు, తోపులాట చోటు చేసుకుంది. ఉప్పల్ ఏసిపి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేసినా పలువురు నేతలు పోటీపడి నేతల దృష్టిలో పడేందుకు తంటాలు పడ్డారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నేతల అనుచరులు పోటాపోటీగా నినాదాలు చేయడంతో పలుమార్లు మంత్రి శ్రీధర్‌బాబు వారించారు. ఉప్పల్ ఆర్‌వో ప్లాంటు ప్రారంభం సమయంలో మంత్రి శ్రీధర్‌బాబు కాలు కొందరు తొక్కడంతో ఆయనకు స్వల్పంగా గాయాలు అయ్యాయి. ఉప్పల్ భగాయత్‌లో బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నేతలు తోపులాట సందర్భంగా కొంత ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఇరువర్గాలను సముదాయించి పంపించి వేశారు. పోలీసులకు పరస్పరం పిర్యాదు చేసుకున్నారు.

# నేడు లా సెట్ పరీక్షపై టిశాట్ స్పెషల్ లైవ్

## 90 రోజులు ప్రత్యేక ప్రసారాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని లా కాలేజీల్లో లా కోర్సుల్లో చేరడం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న లాసెట్‌పై టీ-సాట్ ప్రత్యేక లైవ్ షోను నేడు(బుధవారం) నిర్వహించనుంది. లాసెట్‌పై 90 రోజులపాటు ప్రత్యేక ప్రసారాలను టీ-సాట్, నిపుణ ఛానళ్లలో ప్రసారం చేయనున్నట్లు టీ-సాట్, సాఫ్ట్ నెట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లా సెట్ పరీక్షపై నేడు టీ-సాట్ ప్రత్యేక అవగాహన లైవ్ కార్యక్రమాన్ని ఉదయం 11 నుండి 12 గంటల వరకు నిపుణ ఛానల్‌లో ప్రసారం చేయనున్నారు. ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో లా సెట్ తెలంగాణ కన్వీనర్ ప్రొఫెసర్ బి.విజయలక్ష్మి సలహాలు, సూచనలు అందిస్తారని వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.
లా సెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ తమ సందేహాలను లైవ్ కార్యక్రమం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ నెల 12 నుంచి ప్రత్యేక ప్రసారాలను ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. మే 18న నిర్వహించబోయే లా సెట్ పరీక్ష కోసం తెలంగాణ యువతను సిద్ధం చేసేందుకు ప్రత్యేక డిజిటల్ ప్రసారాలను ఈ నెల 12 నుండి మే 12 వరకు 90 రోజులు పాటు రోజుకు రెండు పాఠ్యాంశ భాగాల చొప్పున 180 ఎపిసోడ్స్‌ను ప్రసారం చేయనున్నామని తెలిపారు. సాయంత్రం ఆరు నుండి ఏడు గంటల వరకు టీ-సాట్ నిపుణ ఛానల్, ఉదయం ఆరు నుండి ఏడు గంటల వరకు విద్యలో పునః ప్రసారం కానున్నాయని సీఈవో తెలి పారు. జనరల్ నాలెడ్జ్, మెంటల్ ఎబిలిటీ, కరెంట్ అఫైర్స్ అండ్ అప్టిట్యూడ్ ఫర్ ద స్టడీ ఆఫ్ ద లా సబ్జెక్టులపై ప్రత్యేక ప్రసారాలుంటాయన్నారు. టీ-శాట్ ప్రసారం చేసే డిజిటల్ పాఠ్యాంశాలను సద్వి నియోగం చేసుకోవాలని సీఈవో వేణుగోపాల్ రెడ్డి తెలంగాణ యువతకు సూచించారు.

# పంచాయతీరాజ్ చట్టంపై నూతన సర్పంచ్‌లకు శిక్షణ

## శిక్షకులకు తర్ఫీదు
## మార్చి 31లోగా శిక్షణ పూర్తిచేసేలా పంచాయతీరాజ్ శాఖ కార్యాచరణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** ఇటీవల పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పించేందుకు శిక్షణా తరగతులను పంచాయ తీరాజ్‌శాఖ నిర్వహించనుంది. మార్చి 31లోగా శిక్షణను పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొం దించింది. అందులో భాగంగా శిక్షణ ఇచ్చే అధికారులకు ముందుగా రాజేంద్రనగర్ లోని టీజీఐఆర్‌డీలో తరగతులు నిర్వహిస్తున్నారు. పంచాయతీరాజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ ఏంవీ శైలేష్ హాజరై దిశానిర్దేశం చేస్తున్నారు. గ్రామాల్లో పాలన పారదర్శకంగా సాగాలన్నా, నిధుల వినియోగం సక్రమంగా ఉండాలన్నా చట్టంలోని నిబంధనలు సర్పంచ్‌లు, వార్డుమెంబర్లకు తెలియాలని పంచాయతీరాజ్‌శాఖ చెబుతోంది. చట్టానికి లోబడి బాధ్యతలు నిర్వహించేలా సర్పంచ్‌లను, వార్డు సభ్యులను సన్నద్ధం చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. ప్రతీ జిల్లా నుంచి నలుగురు జిల్లా, మండలస్థాయి అధికారులతోపాటు 25మంది చొప్పున పంచాయతీ కార్యదర్శులను ఎంపిక చేసి శిక్షణా ఇస్తున్నారు. ఈ నెల 13వ తేదీలోగా ట్రైనర్స్‌కు శిక్షణ పూర్తికానుంది. ఆ తర్వాత ట్రైనర్లు రాష్ట్రంలోని 12769 మంది సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. మార్చి 31లోపు రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల పాలకవర్గాలకు జిల్లా కేంద్రాల్లో పూర్తిస్థాయిలో శిక్షణ కొనసాగనుంది.

# ఇంటర్ బోర్డు కమాండ్ కంట్రోల్‌ను పరిశీలించిన ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి

## సిసి కెమెరాలతో పారదర్శకంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు
## బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** రాష్ట్ర ఇంటర్ విద్యా మండలి కార్యాలయంలో కొనసాగుతున్న కమాండ్ కంట్రోల్‌ను షెడ్యూల్డ్ కుల అభివృద్ధి శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ మంగళవారం సందర్శించి.. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల తీరును పరిశీలించారు. తన పర్యటన సందర్భంగా కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి సిసిటివి నిఘా ద్వారా జరుగుతున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను ఆయన పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రభుత్వరంగ కాలేజీలతోపాటు ప్రైవేట్ జూనియర్ కళాశాలలలో సిసిటివి నిఘాలో ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. సిసిటివి నిఘా కారణంగా పారదర్శకత గణనీయంగా పెరిగిందని, ఎటువంటి బాహ్య జోక్యం లేకుండా పరీక్షలు సకాలంలో నిర్వహించబడు తున్నాయని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలియజేశారు. గోప్యత, సామర్థ్యాన్ని నిర్ధారించడానికి ప్రశ్నపత్రాలను ఆన్‌లైన్‌లో పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ నెల 25 నుండి ప్రారంభమయ్యే ఇంటర్ వార్షిక థియరీ పరీక్షలకు కూడా ఇదే నిఘా వ్యవస్థ కొనసాగుతుందని స్పష్టం చేశారు. సిసిటివి కెమెరాలను పరీక్ష కేంద్రం ప్రవేశ ద్వారం, చీఫ్ సూపరింటెండెంట్ గది, పరీక్షా హాళ్ల వద్ద ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6,000 సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేయ బడ్డాయని తెలిపారు. పరీక్షాహాళ్ల లోపల మొబైల్ ఫోన్‌లను నిషేధించామన్నారు. ఫేస్‌రికగ్నేషన్ సిస్టమ్(ఎఫ్ఆర్ఎస్) ద్వారా విద్యార్థుల హాజరును సేకరించనున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య తెలిపారు.

# ప్రభుత్వం సంపద సృష్టించకుండా.. ఆస్తులను అమ్ముతోంది: కల్వకుంట్ల కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 10:** మున్సిపల్ బూతుల వర్షం ఆగిపోవడం సంతోషంగా ఉందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం చూశాక.. పార్టీ గుర్తులు లేకుండా ఎన్నికలు జరిగితే బాగుండేదని కవిత అభిప్రా యపడ్డారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో మంచినీరు, పారిశుధ్యం లోపిస్తోందని, ఈ అంశాలపై ఎన్నికల ప్రచారంలో చర్చ జరగలేదని ఆమె వ్యాఖ్యానించారు. మున్సిపల్ ఎన్నికల్లో మంచి వ్యక్తులను ఎన్నుకోవాలని ప్రజలకు సూచించారు. కేవలం సిద్ధిపేట మున్సి పాలిటీకి మాత్రమే నిధులు మంజూరు అయ్యాయని.. హరీశ్‌రావు, ముఖ్యమంత్రికి మధ్య ఏముందో అర్థం చేసుకోవాలని కవిత అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంపద సృష్టించకుండా.. ఆస్తులను అమ్ముతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే బడ్జెట్‌లో అన్ని వర్గాలకూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.
50శాతం మంది రైతులకు ఇంకా రుణమాఫీ చేయలేదని వెల్లడిం చారు. రుణ మాఫీపై చర్చకు తాము సిద్ధమని.. సచివాల యాలనికి రమ్మంటారా.. ముఖ్యమంత్రి సొంత జిల్లాకు రమ్మంటారా అంటూ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా నిజాలు చెప్పాలన్నారు.
డిప్యూటీ సిఎం, ఆర్థికమంత్రి భట్టి విక్రమార్కకు జాగృతి తరపున వినతిపత్రం అందిస్తామని కవిత తెలిపారు. లేబర్ కోడ్‌కు వ్యతిరేకంగా 12వ తేదీన బంద్‌కు జాగృతి మద్దతు ఇస్తోందని వెల్లడించారు. ఈ క్రమంలోనే ఎంఐఎం పార్టీ పొద్దు తిరుగుడు పువ్వులా.. ఎవరు అధికారంలో ఉంటే వారి వెంట ఉంటుందని సెటైర్లు వేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాయల తెలంగాణకు ఒవైసీ బ్రదర్స్ మద్దతు ఇచ్చారని, రేవంత్‌రెడ్డి ఆర్ఎస్ఎస్ మనిషి అన్న ఒవైసీ.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సపోర్ట్ చేశారని కవిత విమర్శించారు.

# పిఎంజివై నిధుల మంజూరుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపండి

## సిఎస్ రామకృష్ణారావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన నాలుగవ దశలో భాగంగా రాష్ట్రంలో రోడ్ కనెక్టివిటి లేని 227 ఆవాసాల్లో 642 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సచివాలయంలో పిఎంజిఎస్‌వై 4వ దశ పనుల మంజూరుకై పంపే ప్రతిపాదనలపై రాష్ట్ర స్థాయి స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్‌లతోపాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ, పి.ఎం.జి.ఎస్.వైలో భాగంగా ఇప్పటి వరకు మూడు దశలలో రాష్ట్రానికి మంజూరైన రహదారులు, వంతెనల నిర్మాణ పనులను పూర్తి చేశామని, ఈ పథకం నాలుగవ దశ క్రింద రాష్ట్రంలో పక్కా రహదారులు లేని 227 ఆవాసాలల్లో 642.23 కిలోమీటర్ల రహదారుల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు. అయితే, వీటిలో, 34 పనులకుగాను 148 కిలోమీటర్లకు అటవీ శాఖ అనుమతులు పొందాల్సి ఉందని, ఈ మార్గాల్లో బ్రిడ్జిల నిర్మాణ పనులకు సంబంధించి మరో వారం రోజుల్లో డినిఆర్‌లను పూర్తి చేస్తామని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్ తెలిపారు.

# మేలైన విత్తనోత్పత్తితోనే నకిలీలకు అడ్డుకట్ట

## ఆ బాధ్యత వ్యవసాయ శాఖదే
## రాష్ట్ర రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** నకిలీ విత్తనాలను అరికట్టాలంటే వ్యవసాయశాఖ ఆధ్వ ర్యంలో మరిన్ని మేలైన విత్తనాలను ఉత్పత్తి చేసి రైతులకు ఇవ్వాలని వ్యవసాయశాఖ ఉన్నతా ధికా రులకు తెలంగాణ రైతు కమిషన్ ఛైర్మన్ కోదండ రెడ్డి సూచించారు. విత్తనోత్పత్తిని పెం చాలని అందుకు కావాల్సిన ఏర్పాట్లు చేసేం దుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విత్తనో త్పత్తి క్షేత్రాల భూములు అన్యాక్రాంతం కాకుండా హద్దులను ఏర్పాటు చేసుకొని చుట్టూ ఫెన్సింగ్ చేయాలని నిర్దేశించారు. ఎక్కడైనా భూ సమస్యలు వున్న చోట ఆ అంశాన్ని వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి దృష్టికి లేదంటే ప్రభుత్వ దృష్టికి తేవాలని సూచించారు.
వ్యవసాయ శాఖకు చెందిన భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత అధికా రులపై ఉందన్నారు. ఈ మేరకు వ్యవసాయశాఖ ఆధ్వ ర్యంలో కొనసాగుతున్న విత్తనోత్పత్తి క్షేత్రాలపై రైతు కమిషన్ మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది.
ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అయిదు జిల్లాలో 8 చోట్ల సీడ్ ఫార్మ్ ఉన్నాయని, 1629 ఎకరాల్లో వున్న సీడ్ ఫార్మ్‌లో వివిధ రకాల విత్తనాలను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో విత్త నోత్పత్తి చేస్తున్నట్లు అధికారులు కమిషన్‌కు వివరించారు. ప్రధానంగా వరి, పెసర, జనుము, కందులు విత్తనోత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు కేవీఎన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్‌తో పాటు వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ నర్సింగరావు, జాయింట్ డైరెక్టర్ సుచరిత, డీడీఏ నాగ మల్లీశ్వరి, ఏడీఏ ఉషారాణి, సీడ్ ఫార్మ్‌కు చెందిన అగ్రికల్చర్ అధికారులు వైద్యనాథ్, సక్రియ నాయక్, ఇంద్రసేన్, అనిల్ కుమార్, వాసు తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల రాష్ట్ర సంఘ అధ్యక్షుడు కొక్కుల దేవేందర్

# గ్రంథాలయ పెన్షనర్ల పెండింగ్ డిఎలను వెంటనే చెల్లించాలి

## సిటీ సెంట్రల్ లైబ్రరీలో పెన్షనర్ల రాష్ట్ర సర్వసభ్య సమావేశం

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల రాష్ట్ర సంఘ సర్వసభ్య సమావేశం మంగళవారం నగర కేంద్ర గ్రంథాలయంలో జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొక్కుల దేవేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పెన్షనర్ల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కొక్కుల దేవేందర్ మాట్లాడుతూ.. జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్లకు ప్రస్తుతం ఐ ఎఫ్ ఎం ఐ ఎస్ పోర్టల్ ద్వారా పెన్షన్లు చెల్లిస్తున్నందుకు, అలాగే ఏప్రిల్ 1వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల గ్రంథాలయ పెన్షనర్లకు ఇదే పోర్టల్ ద్వారా చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.
కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ అధ్యక్షులు కే. లక్ష్మయ్య మాట్లాడుతూ పెన్షనర్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉండాలని కోరారు. పెన్షనర్లకు రావాల్సిన 5 డీఏ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. ఎంతో కాలంగా వేచి చూస్తున్న హెల్త్ కార్డ్స్‌ను త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. సమావేశంలో సంఘ ప్రధాన కార్యదర్శి సోమశివయ్య, కోశాధికారి దాచేపల్లి బుచ్చయ్య, పెన్షనర్ల జేఏసీ ప్రధాన కార్యదర్శి తులసి సత్యనారాయణ, తుమ్మ సత్యనారాయణ, వీరప్ప, పి. నాగేశ్వరరావు, వి. నాగేశ్వరరావు, సిద్దుల జ్ఞానేశ్వర్, కృష్ణ ప్రసాద్‌లతో పాటు వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నగరంలో రాంగ్‌సైడ్ డ్రైవ్‌పై స్పెషల్‌డ్రైవ్

## వారం రోజుల్లో 21,713 కేసులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణకు చేబట్టిన అరైవ్, అలైవ్ కార్యక్రమంలో భాగంగా జంట నగరాలలో రాంగ్‌సైడ్ డ్రైవ్‌పై ట్రాఫిక్ పోలీసులు నిర్వహిస్తున్న దాడుల్లో వారం రోజుల వ్యవధిలో 21,713 కేసులు నమోదు చేశారు. ఈ నెల రెండవ తేదీ నుంచి తొమ్మిద తేదీ వరకు నగర వ్యాప్తంగా ఈ దాడులు నిర్వహించినట్లు సిటీ ట్రాఫిక్ జాయింట్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ మంగళవారం మీడియాకు తెలిపారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ వల్ల వాహనాలు నడిపే వారితో పాటు ఎదురుగా వచ్చే వారు కూడా ప్రమాదాల బారిన పడతారని జోయల్ డేవిస్ ఈ సందర్భంగా తెలిపారు. దీంతో పాటు ఆయా ప్రాంతాలలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుందని, ఇది అందరికి ఇబ్బందికరంగా మారుతు ందని ఆయన తెలిపారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ తీవ్రమైన ట్రాఫిక్ నేరమని ఆయన వెల్లడించారు. ట్రాఫిక్ నిబంధనలను వాహన దారులు కచ్చితంగా పాటించి డ్రైవింగ్ చేసిన పక్షంలో 90 శాతానికి పైగా ప్రమాదాలను నివారించవచ్చని ఆయన తెలిపారు. రోడ్ సేఫ్టీలో భాగంగా ఈ నెలాఖరు వరకు రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌పై దాడులు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ విషయంలో వాహనదారులకు ఆయా ప్రాంతాల పోలీసులు అవగాహన కార్య క్రమాలు నిర్వహిస్తున్నారని జోయల్ డేవిస్ తెలిపారు. ఈ విషయంలో వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు తోడ్పాటునందించాలని ఆయన కోరారు. ట్రాఫిక్ సమస్యలపై హెల్ప్‌లైన్ 9010203626 లేదా 8712661690కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.


సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.జి.చిన్నారెడ్డి.

# సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 375

**హైదరాబాద్ (బేగంపేట), ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 375 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 126 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 23 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 172 దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణికి 1 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 53 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జీ.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజలు సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సూర్యప్రకాష్, ఎసిపి ఉమేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇసుక లారీని ఢీకొట్టిన అంబులెన్స్!

**హైదరాబాద్ (వనస్థలిపురం), ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** స్పీడ్‌గా వెళ్తున్న ఒక అంబులెన్స్ అదుపుతప్పి ఆగిఉన్న ఇసుక లారీని ఢీ కొట్టాడడంతో అందులో ఉన్నవారు గాయాల పాలైన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్ నగర్‌కు చెందిన పాండయ్య అనే వ్యక్తి అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో ఓ ప్రైవేట్ అంబు లెన్స్‌లో నగరంలోని ఇమేజ్ హాస్పిటల్‌కు వెళ్లే క్రమములో మంగళ వారం మధ్యాన్నం హయత్‌నగర్ నుండి ఆటోనగర్ ఇసుక డంపింగ్ యార్డ్ వద్దకు చేరుకోగానే స్పీడ్‌కు అదుపుతప్పి ప్రక్కనే ఆగిఉన్న లారీని వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో అంబులెన్స్ డ్రైవర్ కుమారస్వామితోపాటు అటెండర్ చంద్రకళ సహా పాండయ్యకు గాయాలయ్యాయి. అదేవిధంగా లారీ డ్రైవర్ యాదయ్యకు సైతం గాయాలు కావడంతో వెంటనే స్థానికులు పక్కనే ఉన్న ప్రజు ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు అతి వేగమే ప్రమాదానికి కారణమని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ట్రంప్, మోడీ దిష్టిబొమ్మలు దగ్ధం చేస్తున్న ప్రజాసంఘాల నేతలు

# అమెరికాతో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసేదాకా పోరాడుదాం

## ప్రజాసంఘాల నేతల పిలుపు

**హైదరాబాద్ (ముషీరాబాద్), ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** అమెరికాతో బీజేపీ ప్రభుత్వం చేసుకున్న స్వేఛ్ఛావాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసేవరకు పోరాడుదామని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, సిఐటియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం అమెరికాకు లొగిపోయి, ఏకపక్షంగా చేసుకున్న స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని నిరసిస్తూ సమంగళవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గోల్కొండ క్రాస్‌రోడ్స్‌లో మోడీ, ట్రంప్‌ల దిష్టి బొమ్మలు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీ జరుతున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువజనులు, మహిళలు, మేధావులు అందరూ భాగస్వాములు కావాలని కోరారు. అమెరికాతో బీజేపీ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం వల్ల మన దేశ వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బ తినటమే కాకుండా రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా గ్రామగ్రామాన మోడీ, ట్రంప్‌ల దిష్టిబొమ్మలు దహనం చేయాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ కార్మిక వర్గం నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదనం చేయాలని పిలుపునిచ్చారు. కార్యరకమంలో సీఐటియూ నేతలు ఎస్.వీరయ్య, ఈశ్వర రావు, ఎస్వీ రమ, ప్రసాద్, సోమన్న, ఎం.శ్రీనివాస్, ఎం.వెంకటేష్, కుమార్, దశరథ్, రైతు సంఘం నేతలు అరిబండి ప్రసాదరావు, మూడ్ శోభన్ తదితరులు పాల్గొన్నారు.

# ఒబిసిలకు ప్రధాని మోడీతోనే న్యాయం సాధ్యం

## ఎంపి ఆర్.కృష్ణయ్య ధీమా

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** ఒబిసిలకు చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం న్యూఢిల్లీలోని ఎపి భవన్ పరిసర ప్రాంతాలలో ఆనేకమంది బిసిలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎపి భవన్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. బిసిల నినాదాలలో ఎపి భవన్ దద్దరిల్లింది. ఆంధ్రప్రదేశ్ బిసి సంఘం, తెలంగాణ బిసి సంఘం ఆధ్వర్యంలో ఎపి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎన్.మారేష్, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ ఈ కార్యక్రమాలకు అధ్యక్షత వహించారు. ఈ ధర్నాలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఓబిసిల డిమాండ్ల సాధనకు దేశవ్యాప్తంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఓబిసిల సమస్యలపై దృష్టిని సారించిందని, ప్రధాని నరేంద్రమోదీతోనే ఓబిసిలకు న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. నేడు ఓబిసిల ఉద్యమం పతాక స్థాయికి చేరుకుందని ఈ దశలో ఉద్యమాన్ని మరింతగా ఉధృతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. చట్ట సభలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని, బిసి ఉద్యోగులకు ప్రమోషన్‌లలో రిజర్వేషన్‌లు కల్పించాలని ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని, కేంద్ర విద్యా, ఉద్యోగ రిజర్వేషన్‌లు బిసిల జనాభా ప్రకారం 27 శాతం నుంచి 56 శాతానికి పెంచాలని, విద్యా, ఉద్యోగ రిజర్వేషన్‌లపై ఉన్న క్రిమిలేయర్‌ను ఎత్తివేయా లని, బిసిలకు ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. డా.ఎన్.మారేష్ మాట్లాడుతూ నియోజక వర్గాల పునర్విభజన జరుగుతున్న నేపథ్యంలో చట్టసభలలో బిసిలకు సరైన న్యాయం జరగాలంటే పార్లమెంట్‌లో బిసి బిల్లు అమోదం పొందాలని, ఇందుకు ప్రధాని కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.
ఈ ర్యాలీ, ధర్నాలో బిసి నేతలు పితాని ప్రసాదం, బొమ్మన కోటేశ్వర్ రావు, యార్లగడ్డ సందీప్, బోగి రమణ, ఉమా, ప్రవీణ్‌ముదిరాజ్, విశాల్‌గౌడ్, ప్రీతం, కుమార్ రాజా, రాజశేఖర్, హేమంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీలోని ఎపిభవన్‌లో అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న ఒబిసిలు. చిత్రంలో ఆర్.కృష్ణయ్య, డా.ఎన్.మారేష్, భరత్‌కుమార్ తదితరులు

# ఎకరాకు లక్షల ఆదాయం గడిస్తూ..




**చేతినిండా డబ్బు విదేశాల్లో విలాసవంతమైన జీవితం.. ఇవేమీ తృప్తినివ్వలేదు. మనం తినేదీ పిల్లలకు పెడుతున్నదీ విషం అన్న ఆవేదన ఆమెను నిద్రపోనివ్వలేదు. అంతే... విదేశాల నుంచి విమానం దిగారు. 'సాగు చేయడం నీ వల్ల కాదు' అని భయపెట్టినచోటే. ఎకరాకు రూ. లక్షల ఆదాయం గడిస్తూ... ఔరా అనిపిస్తున్నారు... గొంది ఝాన్సీ లక్ష్మి. తన ప్రయాణాన్ని తెలుసుకుందాం..**

పుట్టి పెరిగిందంతా తిరుపతిలోనే. నాన్నకు వ్యవసాయమంటే ఇష్టం. అమ్మ చిన్నప్పటి నుంచీ ఆరోగ్యానికి ప్రాధాన్యమిచ్చేది. 2008లో పెళ్లయ్యాక అమెరికా వెళ్లాం. పదేళ్లు అక్కడే ఉన్నాం. కానీ నా మనసు ఎప్పుడూ పల్లెటూరి చుట్టూనే తిరిగేది. నా ఇద్దరు పిల్లలు క్రీడాకారులు. వాళ్లకి మంచి ఆహారం ఇవ్వలేకపోతున్నా అన్న బాధ. ఆ సమయంలోనే రాజీవ్ దీక్షిత్, ప్రకృతి వ్యవసాయ నిపుణులు విజయరామ్ మాటలు నా ఆలోచనలకి ఓ రూపాన్నిచ్చాయి. అల్యూమినియం పాత్రలు, రసాయన మందుల వెనకున్న నిజాలు తెలుసుకున్నాక.... ప్రకృతి వ్యవసాయం చేయాలనుకున్నా.

**మూడెకరాల పొలంలో..** .అమెరికాలో ఉన్నప్పుడే మట్టి పాత్రలు తెప్పించుకుని వంట చేయడం ప్రారంభించాను. మన ఆరోగ్యం మన వంటింట్లోనే, మన మట్టిలోనే ఉందని అర్థమైంది. 2018లో ఇండియాకు తిరిగొచ్చేశాం. వ్యవసాయం చేయాలన్న కోరిక ఉంది కానీ, భూమి దొరకడమే కష్టమైంది. ఎంతో తిరిగితే చివరికి వికారాబాద్ జిల్లా తాండూరు దగ్గర మూడెకరాలు దొరికాయి. పొలం పనులకు ఎవరూ వచ్చేవారు కాదు. కొత్త ప్రదేశంలో ఒక మహిళ వ్యవసాయానికి దిగితే సమస్యలు ఎలా ఉంటాయో అర్థమైంది. మానసికంగా ఎంతో ఆవేదనకు అయ్యా. అలాగని వెనకడుగేయలేదు. డ్రాగన్ ఫ్రూట్ వేస్తానంటే హార్టీకల్చర్ అధికారులు...ఇక్కడ పండదు వద్దన్నారు. నాకు చూద్దామని పించింది. రెండున్నర ఎకరాల్లో 'హైడెన్సిటీ' పద్ధతిలో సాగు మొదలుపెట్టాను. ఎతునత మడులు కట్టి, దగ్గర దగ్గరగా 6,344 మొక్కలు నాటాను. మొక్కల మధ్యలో మెంతి కొత్తిమీర.. వంటి అంతర పంటలూ వేశా. ఎరువులేకుండా పంట ఎలా వస్తుందని చాలామంది అడిగారు. సమాధానంగా 35 గిర్ జాతి ఆవుల్ని కొన్నా.. జీవామృతం, ఘన జీవామృతం తయారు చేసి ఎరువుగా వేస్తున్నా. తెగుళ్లకి పురుగు మందులు వాడకుండా వెన్న తీసిన మజ్జిగను 15-20 రోజులు పులియబెట్టి, ఇంగువ కలిపి మొక్కలకి స్ప్రే చేస్తాను. దీనివల్ల మొక్క బలంగా ఎదుగుతుంది.

**శ్రమను నమ్ముకున్నా...** రసాయన మందులు వేసే రైతులకు ఎకరానికి 17 టన్నుల వరకు దిగుబడి వస్తే నాకు మూడున్నర టన్నులే వచ్చింది. అయినా బాధపడలేదు. గ్రామస్థులకు సేంద్రియ పంటమీద అవగాహనలేక మొదట నా దగ్గర కొనేవారు కాదు. దీంతో తాండూరు దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల్లో 500 కిలోలు ఉచితంగా పంచాను. క్రమంగా సేంద్రియ ఉత్పత్తులపై ప్రజల్లో విశ్వాసం పెరిగింది. ప్రస్తుతం మార్కెట్ రేటు కంటే ఎక్కువకు విక్రయిస్తున్నా నాణ్యత వల్ల కొంటున్నారు. దీనితో పాటు రోజూ 6570 లీటర్ల పాలను విక్రయిస్తున్నాను. మొదట్లో కూలీలు దొరక్క చాలా ఇబ్బందిపడ్డా. ఆవుపాలు పితకడం, పెరుగు చిలికి నెయ్యి తీయడం వరకు అన్నీ మాన్యువల్గా చేసేదాన్ని. పేడ తీసి నేనే జీవామృతం కలిపేదాన్ని.. ఆ తర్వాత మెషీన్ తెచ్చుకున్నా. ప్రస్తుతం తెలంగాణ గోశాల సేవా సమితికి జైంట్ సెక్రటరీగా పని చేస్తున్నాను. నాలాంటి ఆలోచనలున్న రైతులను కలుపుకొంటున్నా.. నాలాగా మరో పదిమంది రైతులు గో ఆధారిత వ్యవసాయం వైపు రావాలంటే నా ఆశయం.

## పిల్లల్లోనూ ఒత్తిడి !



పెద్దవాళ్లకంటే బోలెడు బాధ్యతలుంటాయి, వాళ్లకు ఒత్తిడి ఉందంటే నమ్మొచ్చు. కానీ చిన్నపిల్లలకు ఏ సమస్యలుంటాయి ఒత్తిడి పెరగడానికి అనే భ్రమలో ఉంటారు చాలామంది. కానీ పిల్లలకూ ఒత్తిడి ఉంటుంది. అదే భవిష్యత్తులో వాళ్లకు ఎదురయ్యే అనారోగ్యాలకు కారణం అంటున్నారు యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాస్త్రవేత్తలు. ఇంట్లో తల్లిదండ్రుల మధ్య జరిగే గొడవలూ, తోటిపిల్లల హేళనలూ, వెక్కిరింతలూ, పేదరికంతో ఎదురయ్యే కష్టాలూ, చీటికీ మాటికీ గొడవలు ఇరుగూ పొరుగు వంటివన్నీ... పిల్లలపై ఒత్తిడిని పెంచుతాయి. ఈ పరిస్థితులు పిల్లల మానసిక స్థితినే కాకుండా శరీరంలో ప్రతి అవయవం పైనా ప్రభావం చూపిస్తాయి. దీన్ని శాస్త్రవేత్తలు బయలాజికల్ ఎంబెడింగ్ అంటున్నారు. అలాగే ఒత్తిడి ఎదురైన ప్రతిసారీ శరీరం తనని తాను సిద్ధం చేసి కొన్ని రసాయనాలను విడుదల చేస్తుంది. పిల్లల్లో ఆస్తమా, నిద్ర లేమి, బరువు పెరగడం వంటి సమస్యలు పెరుగు తాయి. మెదడులో వచ్చిన మార్పులు వారిలో ఏకాగ్రత కోల్పోయేట్టు చేశాయి. చదువులో వెనకబడిపోతారు. అందుకే పిల్లల బాల్యం ఒత్తిడికి దూరంగా ఉండేలా చూడమంటున్నారు శాస్త్రవేత్తలు.





సోషల్‌మీడియాలో ఎక్కడ చూసినా రోజ్ మెరీ నూనె ప్రస్తావనే! జుట్టు వేగంగా పెరిగేలా చేస్తుంది, తెల్లజుట్టును నల్లగా చేయగలదంటూ విపరీతంగా ప్రచారం జరుగుతోంది. ఇది వాస్తవమేనా? నెట్‌వర్క్ రోజ్మెరీలో యాంటీ

## రోజ్‌మెరీ వాస్తవమేనా?

ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబియల్ గుణాలెక్కువ. ఇవి రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి. దీంతో కుదుళ్లు గట్టిపడి, కురులు రాలడం తగ్గుతుంది. యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు చుండ్రుతోపాటు ఇన్ఫ్లమేషన్నీ తగ్గిస్తాయి. తగ్గుదల పెరుగుదలకు సాయపడతాయి. ఆక్సిడేటివ్ స్ట్రెస్ని తగ్గుతుంది కాబట్టి, కురులు సహజ రంగును కోల్పోవు. కాబట్టి, తెలుపు రంగులోకి మారే ప్రక్రియ ఆలస్యమవుతుంది. అయితే ఇప్పటికే తెలుపులోకి వచ్చిన వాటిని నలుపుగా మారుస్తాయన్న దానికి శాస్త్రీయంగా రుజువులు లేవు. అయితే దీన్ని నేరుగా కూడా రాయకూడదు. క్యారియర్ ఆయిల్ తప్పనిసరి, అంటే కొబ్బరి, జోజోబా, ఆముదం వంటి వాటిలో కలిపే వాడాలి. పావుకప్పు నూనెకు కొన్ని చుక్కలు కలిపి రాసుకుంటే సరిపోతుంది. కనీసం నూనె అయిదు నిమిషాలు మర్దన పట్టించాక. సమయం లేదనుకుంటే షాంపూ నీటిలో 35 చుక్కలు చేర్చి, తలంటుకున్నా మంచిదేనట. కాబట్టి, మీకెలా అనువో చూసుకోండి అలా వాడి చూడండి అయితే ఇది అందరికీ పడుతుందన్న నమ్మకం లేదు. చర్మం తప్పనిసరి, దురద, ఎరుపుదనం నాన్‌ప్పుడే కొనసాగించండి.

మంత్రాలకు చింత కాయలు రాలుతాయా? స్తోత్రానికి కాసులు కురుస్తాయా? ఈ అనుమానం చాలా మందికి వస్తుంది. అయితే ఇక్కడ మనం శంకరాచార్యుల వారి గురించి, కనకధారాస్తోత్రం గురించీ ప్రస్తావించాల్సి వుంటుంది. . ఆది శంకరాచార్యులవారు బిక్షాటనకు వెళ్ళి, ఒక సారి ఒక పేదరాలి ఇంటికి వెళ్ళి,' భవతీ బిక్షాం వేహి' అని పిలిచారు. అయితే ఆ ఇట్లు ఒక కటిక నిరుపేదని కటక దారిద్రాన్ని అను భవిలిస్తున్నది. పిడికెడు బిక్షం

## లక్ష్మీ అనుగ్రహిస్తుంది..

వేపు లేకపోయి సమ్మలకు కంటతడి పెట్టుకుంది. కానీ సన్యాసి తన వాకిట నిలిచి వున్నాడు. ఉట్టి చేతులలో ఎలా పంపేది? ఇంట్లో కొన్ని ఎండిపోయిన ఉసిరికాయలు వున్నాయి. అవి తెచ్చి శంకరుల జోలెలో వేసింది. ఆమె దయనీయస్థితిని చూసి శంకరులవారు చలించిపోయారు. ఆశువుగా ఆమహాలక్ష్మిని సుత్తించారు. మహాలక్ష్మీదేవి ప్రత్యక్షం అయ్యింది. ఏమి కావాలి నాయనా అని అడిగింది. అప్పుడు శంకరాచార్యులవారు ' ఈ పేదరాలికి సంపదను ప్రసాదించు తల్లీ' అని కోరారు. అందుకు లక్ష్మీదేవి ఇలా అంది. 'ఈమె పూర్వజన్మలో ఎవ్వరికీఏ దానమూ చేయలేదు. ఎలాసిరులు ఇవ్వగలను' అంది. అందుకు శంకరాచార్యుల వారు ఏమన్నారంటే, 'అమ్మా ఈమె తనకు మిగిలిన ఆ కొద్ది ఉసిరికలను ఏమి ఆలోచించకుండా దానం చేసింది. ఇంతకన్నా పుణ్యం ఏముంటుంది? అని వేడుకున్నారు. వెంటనే ఆ మహాలక్ష్మీదేవి బంగారు ఉసిరికలను వర్షించింది. ఆ తల్లి కరుణ లభించాలే గాని ఇలాంటి కనకధారలకు కోదవ ఏముంటుంది. కానీ ఆ లక్ష్మీదేవి ఎవరిపై పడితేవారిమీద తనకరుణ చూపించదు. స్వార్థ చింతనే ధ్యేయంగా ఎన్ని సార్లు కనకధారా స్తోత్రం చదివినా లక్ష్మీదేవి కనికరిం చదు. ఆదిశంకరులవారు జగద్గురువు. లోకానికి మేలు జరగాలని కాంక్షించే స్వామివారు. ఆపేదరాలు ఆ సమయంలో స్వామివారికి బిక్షం వేయలేకపోతు న్నానే విలపించింది. తనకు సిరులులేవని బాధపడలేదు. నిర్మల మనస్సుతో ఆలోచించింది. ఆ సమయంలో ఆమె ఆలోచనంతా బిక్ష వేయలేకపోతున్నానే తప్ప మరో ధ్యాసలేదు. ఆదిశంకరులు సాక్షాత్తూ శివాంశసంభూతులు, ఆమె ఆర్తి స్వామివారిని కదిలించావి. స్తుతించారు. ధనలక్ష్మి సంతసించి కనకధారగా కురిపించింది. ఆ తల్లికి తెఇయదా? ఆమె మన ఆర్తి, అర్హతలను చూసి మరీ అనుగ్రహిస్తుంది. దానం చేసే వారికే సంపద నిలుస్తుంది. సుఖ శాంతులను ఇస్తుంది. సంపాదించిన ధనాన్ని కొంతలో కొంతైనా భగవత్సేవకు, దీన జనుల సేవకు ఉపయోగించాలి. సంపాదన లక్ష్యం కేవలం తన స్వార్థం కోసం మాత్రమే కారాదు.

ఓం మహాలక్ష్మీచ విన్మహే విష్ణు పత్నైచ ధమహి తన్నో లక్ష్మీ: ప్రచోదయాత్.

-డా. పులివర్తి కృష్ణమూర్తి

## ఉసిరి రసం..



కావలసినవి : నీళ్ళు: రెండు గ్లాసులు
ఉసిరికాయలు: నాలుగైదు
టమాటాలు: రెండు మూడు,
రసం పొడి: టేబుల్ స్పూను
నూనె/ నెయ్యి: టేబుల్ స్పూను
ఆవాలు, జీలకర్ర: అరస్పూను
చొప్పునఎండు మిరపకాయలు: రెండు
ఇంగువ: చిటికెడు, పసుపు : చిటికెడు
కొత్తిమీర: నాలుగు రెబ్బలు, ఉప్పు: తగినంత

**తయారు చేసే విధానం:** గిన్నెలో నీళ్ల పోసి బాగా మరిగించాలి. అందులో ఉసిరి తొక్కు (ఉప్పువేసి దంచి పెట్టుకున్నది) ఒక పెద్ద స్పూను వేయాలి. ఒక వేళ అది లేకపోతే ఉసిరికాయల్ని చిన్న ముక్కలుగా తరిగి మిక్సీ పట్టి, ఆ ముద్దను ఇందుకోసం వాడుకోవచ్చు. టమాటాలను చిన్న ముక్కలుగా తరిగి ఈ నీళ్లలో వేసి ఉడికించుకోవాలి. ఇది మన ఇష్టాన్ని బట్టి వేసుకోవచ్చు. లేదా ఉత్తి ఉసిరి చారే చేసుకోవచ్చు. ఒక స్పూను చారు పొడిని కూడా గిన్నెలో వేయాలి. చిటికెడు పసుపుతో పాటు తగినంత ఉప్పును కూడా జోడించాలి. చారు బాగా మరిగాక స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. ఇప్పుడు తిరగమోత మూకుట్లో కాస్త నెయ్యి లేదా నూనె వేసి కాగనిచ్చి, ఆవాలు, జీలకర్ర జోడించి.. చిటపటలాడాక ఎండు మిరపకాయలు తుంచి వేయాలి. చివర్లో చిటికెడు ఇంగువను కూడా జోడించి, పోపు ముగించి చారులో ఒంపేయాలి. చివరగా సన్నగా తరిగిన కొత్తిమీరను చారు గిన్నెలో చల్లితే కార్తిక మాసంలో అన్నంతో పాటు తినేందుకు వేడివేడి ఉసిరి చారు సిద్ధం!

## రైస్‌తో నైస్‌గా..

**జుట్టు రాలడానికి, మెరుపుని కోల్పోవడానికి కారణాలు ఎన్నో. ఒత్తిడి, కాలుష్యం, వాతావరణంలో తేడాలు.. అన్నీ కుదుళ్లపైనే ప్రభావం చూపుతాయి. అందుకే, జుట్టు సంరక్షణకు ఖరీదైన షాంపూలు, కండిషనర్లు వాడుతుంటారు. ఇందుకోసం వేలకు వేలు ఖర్చు చేస్తుంటారు. అయితే, వంటింట్లో దొరికే బియ్యం నీటితోనే జుట్టును మెరిసేలా చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.**

బియ్యం కడిగిన నీటిలో అమినో యాసిడ్లు, విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. ఇవి జుట్టుకు సరైన పోషణను అందిస్తాయి. ఈ నీటికి రోజ్ వాటర్‌ను కూడా కలిపితే.. మరిన్ని అద్భుతమైన ప్రయోజనాలు అందుతాయి. ఇందుకోసం ముందుగా ఒక గ్లాసులో కొన్ని బియ్యం తీసుకొని, శుభ్రంగా కడగాలి. అందులోనే తగినన్ని నీళ్లు పోసి రాత్రంతా నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం ఆ నీటిని వడకట్టి ఒక గిన్నెలోకి తీసుకోవాలి. అందులో ఒక టేబుల్ స్పూన్ రోజ్ వాటర్, తక్కువ గాఢత కలిగిన షాంపూ (ఒక టేబుల్ స్పూన్) వేసి బాగా కలపాలి. స్నానం చేసేటప్పుడు ఈ షాంపూ మిశ్రమాన్ని జుట్టుకు, కుదుళ్లకు బాగా పట్టించి.. మెల్లగా మసాజ్ చేయాలి.జుట్టుపై కనీసం 10 నిమిషాలపాటు అలాగే ఉంచడం మంచిది. దీనివల్ల బియ్యం నీటిలోని



పోషకాలన్నీ జుట్టు కుదుళ్ల లోపలికి చేరుతాయి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో జుట్టును శుభ్రంగా కడుక్కోవాలి. ఇలా రెగ్యులర్‌గా చేయడం వల్ల జుట్టుకు సహజసిద్ధమైన మెరుపు వస్తుంది. జుట్టు కుదుళ్లు దృఢంగా మారి, వెంట్రుకలు రాలడం తగ్గుతుంది. రోజ్ వాటర్ కూడా కలవడం వల్ల.. జుట్టు మరింత తేమగా మారి, చిక్కులు పడకుండా ఉంటుంది. జుట్టులోని మురికి కూడా తొలగిపోయి, చుండ్రు బాధ తప్పుతుంది.

# తెర

## 'నువ్వే ఉండిపో ఇలా' సాంగ్స్ లాంచ్



అదోనై పిక్చర్స్ క్రియేషన్స్ సమర్పణలో ప్రముఖ కొరియగ్రాఫర్ సత్య మాస్టర్ దర్శకత్వంలో అంకిత జాదవ్, రోహిత్ భోగ హీరో హీరోయిన్స్‌గా నటించిననువ్వే ఉండిపో ఇలా, నువ్వేలే పేరుతో రెండు సాంగ్స్ రిలీజ్ కార్యక్రమం హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ పాటలకు కెకె రెడ్డి ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. జయంత్ ఆర్యన్ సంగీతాన్ని సమకూర్చిన నువ్వే ఉండిపో ఇలా, నువ్వేలే పాటలకు రాంబాబు గోసాల సాహిత్యాన్ని అందించారు. సింగర్స్ లిప్సిక, అదితి భావరాజు పాడారు. దర్శకులు సాయి రాజేశ్, శైలేష్ కొలను, కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్, అషురెడ్డి అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొరియోగ్రాఫర్, డైరెక్టర్ సత్య మాస్టర్ మాట్లాడుతూ నేను ఒక ఈవెంట్ కోసం యూఎస్ కు వెళ్లినప్పుడు ప్రొడ్యూసర్ కే రెడ్డితో పరిచయం ఏర్పడింది. అప్పటికే ఈ సాంగ్స్ హిందీ వెర్షన్ రెడీగా ఉన్నాయి. తెలుగులో చేయాలనే ఆలోచనను వారు నాతో షేర్ చేసుకున్నారు. నిర్మాత కేకే రెడ్డి మాట్లాడుతూ మా నువ్వే ఉండిపో ఇలా, నువ్వేలే సాంగ్స్ లాంఛ్ కు వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. మంచి లవ్ ఫీల్ తో ఈ పాటలను బ్యూటిఫుల్‌గా పిక్చరైజ్ చేశారు.హీరోయిన్ అంకిత జాదవ్ మాట్లాడుతూ నేను బాలీవుడ్ నుంచి వచ్చాను. అక్కడ మ్యూజిక్ ఆల్బమ్స్ చేస్తుంటాను. మ్యూజిక్ డైరెక్టర్ జయంత్ ఆర్యన్ మాట్లాడుతూ ఈ సాంగ్స్ ను మేము హిందీలో చేశాం వాలని నటి అషురెడ్డి మాట్లాడుతూ, నువ్వే ఉండిపో ఇలా, నువ్వేలే సాంగ్స్ చాలా బాగున్నాయి.

## ప్రేక్షకులు మెచ్చేలా ఉంటుంది



దర్శకుడు కె.వి. అనుదీప్

జాతిరత్నాలు తో హాస్య చిత్రాలలో కొత్త పంథాను సృష్టించిన దర్శకుడు కె.వి. అనుదీప్, ఇప్పుడు.ఫంకీతో మరోసారి థియేటర్లలో నవ్వుల వర్షం కురిపించడానికి వస్తున్నారు. మాస్ కా దాస్ విశ్వక్ సేన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాలో కయాదు లోహర్ కథానాయిక. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.ప్రేమికుల దినోత్సవం కానుకగా ఒకరోజు ముందుగా ఫిబ్రవరి 13న విడుదలవుతున్న ఫంకీ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలు విశేషంగా ఆకట్టుకొని అంచనాలను రెట్టింపు చేశాయి. విశ్వక్ సేన్ ఇందులో ఒక సినిమా దర్శకుడి పాత్రలో కనిపిస్తారు. ఈ పాత్రను రాసుకున్నప్పుడే విశ్వక్ అయితే బాగుంటారు అనిపించింది.

**ఫంకీ సినిమా జానర్, కథాంశం ఏమిటి? జాతిరత్నాలకు భిన్నంగా ఉంటుందా?**

ఫంకీ చిత్రం పూర్తి కొత్తగా ఉంటుంది. జాతిరత్నాలు తరహా హాస్యం ప్రయత్నించి కొందరు విఫలమయ్యారు..

**ఈ సినిమాలో మీరు నటించారా? భవిష్యత్తులో పూర్తిస్థాయి నటుడిగా మారే ఆలోచన ఉందా?**

ఫంకీలో నేను అతిథి పాత్రలో కనిపిస్తాను. నాకు నటుడిగా కంటే దర్శకుడిగా సినిమాలు చేయడమే ఆసక్తి. దర్శకుడిగానే మరిన్ని సినిమా చేయాలని ఉంది.

**ఫంకీ కథ మొదట ఎవరికి వినిపించారు?**

నిర్మాత నాగవంశీకి మొదట ఈ కథ వినిపించాను. ఆయనకు కథ నచ్చి, వెంటనే సినిమా చేయడానికి అంగీకరించారు.

**త్రివిక్రమ్ సినిమా చూశారా?** నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్న సమయంలో త్రివిక్రమ్ సినిమా చూశారు.

నిర్మాత చినబాబు(ఎస్.రాధాకృష్ణ) గురించి?

ఈ సినిమా కోసం చినబాబుతో ఎంతగానో ప్రయాణం చేశాను. సినిమాకి సంబంధించిన అన్ని విషయాలు ఆయనతో చర్చించేవాడిని.

## ఆడియన్స్‌కి ఖచ్చితంగా హై



హిట్ మేకర్ అనిల్ రావిపూడి

హై

హిట్ మేకర్ అనిల్ రావిపూడి అసోసియేట్, అతని అనేక బ్లాక్‌బస్టర్ చిత్రాలకు సహ రచయితగా పని చేసిన ఎస్ కృష్ణ పోలిస్తే . హై అస ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌తో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ టీజర్ ఒక గ్రిప్పింగ్ ఆంథాలజీగా హై ని అర్థం చేసుకునే నలుగురు వ్యక్తులను ప్రజెంట్ చేసింది. ఎస్ కృష్ణ ఒక బోల్డ్ కథని ఎమోషన్స్ తో కూడిన డ్రామాగా ప్రజెంట్ చేశారు. మొత్తం తారాగణం అద్భుతమైన పెర్ఫార్మెన్స్ లతో ఆకట్టుకున్నారు.సినిమాటోగ్రాఫర్లు మల్లు నాయక్, సునీల్ రెడ్డి గట్టి క్లోజప్‌లు, స్పీడ్ కట్‌లు , కలర్ పాలెట్‌ను వాడుకున్న తీరు ఆకట్టుకుంది. ఇవన్నీ అడ్రినలిన్‌పంపింగ్ వైబ్రెన్సీని ఇచ్చాయి. టీజర్ లాంచ్ ఈవెంట్ లో బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. సాయి ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాడు. నా సినిమాలకు పనిచేస్తూ గ్యాప్‌లో ఈ షూటింగ్ చేసేవాడు.ప్రొడ్యూసర్ దిల్ రాజు మాట్లాడుతూ, అందరికి నమస్కారం. అనిల్ తో పాటు సాయి తో కూడా మాకు జర్నీ ఉంది. స్క్రిప్ట్ విషయంలో సినిమా విషయంలో అనిల్ తో ఫైట్ చేసే కెపాసిటీ ఉన్న వ్యక్తి సాయి. ప్రొడ్యూసర్ సురేష్ బాబు మాట్లాడుతూ, అందరికి నమస్కారం. సాయి అనిల్ రియల్ ట్రూ ఫ్రెండ్స్. వెంకటేష్ తో సినిమా చేస్తున్నప్పుడు వాళ్ళ వర్కింగ్ స్టైల్ చూశాను. యాక్టర్ డైరెక్టర్ ప్రొడ్యూసర్ ఎస్ కృష్ణ మాట్లాడుతూ, అందరికీ థాంక్యూ సో మచ్. ఈ సినిమా చూసే వాళ్ళకి మంచి హై ఇస్తుందని అన్నారు.

## 'అమరావతికి ఆహ్వానం' నుండి పాట విడుదల





అమరావతికి ఆహ్వానం సినిమా నుండి దుం దుం డియ్యాల పాట విడుదల లుంబిని పార్క్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సాంగ్ రిలీజ్ చేసిన చిత్ర యూనిట్ శివ కంఠంనేని, ధన్య బాలకృష్ణ, ఎస్తేర్, సుప్రిత, హరీష్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన సినిమా అమరావతికి ఆహ్వానం. ఈ మూవీలో సీనియర్ నటులు అశోక్ కుమార్, భద్రమ్, జెమిని సురేష్, నాగేంద్ర ప్రసాద్ ఇతర కీలక పాత్రలు పోషించారు.

డైరెక్టర్ జీవీకే ఈ మూవీని తెరకెక్కించారు. ప్రముఖ నిర్మాత ముప్పా వెంకయ్య చౌదరి గారి నిర్మాణ సారథ్యంలో జి. రాంబాబు యాదవ్ సమర్పణలో లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బేనర్‌పై కేఎస్ శంకర్‌రావు, ఆర్ వెంకటేశ్వర రావు ఈ సినిమాను నిర్మించారు. "అమరావతికి ఆహ్వానం" సినిమా ఫిబ్రవరి 13న ప్రపంచవ్యాప్తంగా రాబోతుంది.

జెమినీ సురేష్ మాట్లాడుతూ ,అమరావతికి ఆహ్వానం మూవీలో ఫస్ట్ టైమ్ ఒక డిఫరెంట్ క్యారెక్టర్ చేశాను. ఈ సినిమాలో ఒక పిచ్చివాడి పాత్రలో నేను కనిపిస్తాను..

మ్యూజిక్ డైరెక్టర్ పద్మనాబ్ భరద్వాజ్ మాట్లాడుతూ ,ఈ సినిమాలో దుం దుం డియ్యాల సాంగ్ ఒక సెలబ్రేషన్ మోడ్‌లో వచ్చే పాట...లిరిసిస్ట్ ఉమా వంగూరి యూఎస్ లో ఉంటారు.

## 'ఆల్ఫా' ట్రైలర్ లాంచ్





ఎల్ఎ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద హేమంత్ కుమార్, అయానా, గోపిక సురేష్ ప్రధాన పాత్రల్లో విజయ్ ఎన్ తెరకెక్కించిన చిత్రం ఆల్ఫా. ఉపశీర్షిక మెన్ లవ్ వెంజన్స్. ఈ సినిమాని హేమంత్ కుమార్, ఆనంద్‌కుమార్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 20న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ మూవీని తెలుగులో రవిశంకర్, మంజునాథ్ డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. ఈ క్రమంలో ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు సముద్ర ముఖ్య అతిథిగా విచ్చేశారు.అంతా ఆ దేవుడి అనుగ్రహంతో జరుగుతుంది అంటే. ఆ రాక్షసులు అనే డైలాగ్‌తో ట్రైలర్‌ను ఓపెన్ చేశారు. ఇక వెంటవెంటనే చూపించిన యాక్షన్ సీక్వెన్స్, ఈవెంట్‌లో హీరో హేమంత్ జాతిరత్నాలుతో రౌడీ గ్యాంగ్, మాఫియా సీన్లు అన్నీ అదిరిపోయాయి. నేను బరిలోకి కొత్తగా వచ్చాను. హీరో హేమంత్ కుమార్ మాట్లాడుతూ, నాకు తెలుగు సినిమాలంటే చాలా ఇష్టం. తెలుగు సినిమాలు ఎక్కువగా చూడటం వల్లే నాకు అంతో ఇంతో తెలుగు వచ్చింది. మా కోసం వచ్చిన సముద్ర గారికి థాంక్స్. ప్రముఖ దర్శకుడు సముద్ర మాట్లాడుతూ,ఆల్ఫా ట్రైలర్ అద్భుతంగా ఉంది. హీరో చాలా హ్యాండ్సమ్‌లా ఉన్నారు. కన్నడ నుంచి వస్తున్న హీరోలంతా ఇక్కడ సక్సెస్ కొడుతున్నారుఅని అన్నారు.తూ,ఆల్ఫాచిత్రంలో నేను పోలీస్ ఆఫీసర్‌గా నటించాను.

## 'కపుల్ ఫ్రెండ్లీ ' సినిమా ప్రి రిలీజ్ ప్రెస్ మీట్





సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న సినిమా "కపుల్ ఫ్రెండ్లీ ". ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్ గా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ "కపుల్ ఫ్రెండ్లీ" సినిమా టైటిల్ మార్చమని సెన్సార్ వారు అడిగారు. అయితే ఈ టైటిల్ తోనే సినిమ్వా న్ని. ఆ విషయంలో క్లారిటీ ఇవ్వాలనుకుంటున్నా హీరోయిన్ మానస వారణాసి మాట్లాడుతూ, కపుల్ ఫ్రెండ్లీ సినిమా ట్రైలర్ రిలీజ్ అయ్యాక చాలా పాజిటివ్ ఫీడ్ బ్యాక్ వచ్చింది. హీరో సంతోష్ శోభన్ మాట్లాడుతూ "కపుల్ ఫ్రెండ్లీ" మూవీకి ప్రతి ఒక్కరూ తమ సపోర్ట్ అందిస్తున్నారు.

## వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో అజిత్‌కు జాతీయ రికార్డు




**న్యూఢిల్లీ:** జాతీయ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 2026లో అజిత్ జాతీయ రికార్డును సమం చేశాడు. పురుషుల 71 కిలోల విభాగంలో రైల్వేకు చెందిన ఎన్ అజిత్ మొత్తం 320 కిలోలతో ఆధిపత్యం చెలాయించాడు. 145 కిలోల స్నాచ్, కేటగిరీ బెస్ట్ 175 కిలోల క్లీన్ జెర్క్ ద్వారా హైలైట్ చేయబడిన 320 కిలోల మొత్తంతో ఎన్ అజిత్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. టి మాధవన్ మొత్తం 317 కిలోలతో దగ్గరగా ఉన్నాడు. క్లీన్ జెర్క్‌లో అజిత్ 175 కిలోలతో సరిపెట్టుకున్నా స్నాచ్‌లో 142 కిలోలతో కొంచెం తక్కువకు పడిపోయాడు. ఇక మొత్తం 300 కిలోల ఎత్తి యష్ ఖండగలే కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. యష్ ఖండగలే జూనియర్ మరియు సీనియర్ విభాగాలలో మొత్తం 300 కిలోలు (138 కిలోల స్నాచ్ / 162 కిలోలు క్లీన్ జెర్క్) ఎత్తి జూనియర్ బంగారు పతకాన్ని సాధించాడు. అభినోబ్ గొగోయ్ మొత్తం 276 కిలోల బరువు ఎత్తి రజతం సాధించాడు, అందులో బలమైన 123 కిలోల స్నాచ్ కూడా ఉంది. కల్లోల్ మల్ 270 కిలోలతో పోడియంను పూర్తి చేసి కాంస్యం సాధించాడు.

## రైఫిల్ పిస్టల్ ఛాంపియన్‌షిప్స్‌లో షూటర్ నమ్యకు స్వర్ణం

**న్యూఢిల్లీ:** ఆసియా రైఫిల్ పిస్టల్ ఛాంపియన్‌షిప్స్ 2026లో జూనియర్ షూటర్ నమ్య కపూర్ స్వర్ణం సాధించింది. షూట్‌ఆఫ్ థ్రిల్లర్ తర్వాత ఒలింపిక్ డబుల్ పతక విజేత, భారత్‌కు చెందిన మను భాకర్ రజతంతో సరిపెట్టుకుంది. దీంతో ఈ ఆసియా రైఫిల్/ పిస్టల్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ పతకాల సంఖ్య 60కి చేరుకుంది. జూనియర్ మహిళల 25 మీటర్ల పిస్టల్ ఫైనల్లో, నమ్య కపూర్ ఇండోనేషియాకు చెందిన రిహాదతుల్ అసిఫాపై జరిగిన షూట్‌ఆఫ్‌లో విజయం సాధించి స్వర్ణ పతకం సాధించింది. ఇద్దరు షూటర్లు 29 షాట్‌లతో టైగా ముగించారు, తర్వాత నమ్య షూట్‌ఆఫ్‌లో మూడు హిట్‌లు కొట్టగా, ఆమె ప్రత్యర్థి స్కోరు నమోదు చేయలేకపోయింది. ఇక మహిళల 25 మీటర్ల పిస్టల్‌లో నాటకీయ డబుల్ షూట్‌ఆఫ్ తర్వాత మను స్వర్ణ పతకాన్ని తృటిలో కోల్పోయింది, ఇషా సింగ్ కాంస్య పతకాన్ని సాధించింది. డాక్టర్ కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్‌లో పోటీ పడిన మను భాకర్ ఫైనల్ ముగింపులో వియత్నాంకు చెందిన తుయ్ ట్రాంగ్ న్గుయెన్‌తో 35 షాట్‌లతో సమం చేయడంతో టైటిల్‌ను నిర్ణయించడానికి షూట్‌ఆఫ్ అవసరం అయింది. రెండవ షూట్‌ఆఫ్‌లో, మను మూడు షాట్లు పడగొట్టినప్పటికీ న్గుయెన్ ఆధిక్యాన్ని నిలుపుకుంది. ఈ తీవ్రమైన పోటీ తర్వాత రజతంతో మను సరిపెట్టుకుంది. ఈషా సింగ్ ఈ టోర్నీలో తన రెండవ వ్యక్తిగత పతకాన్ని గెలుచుకుంది. మాజీ ప్రపంచ ఛాంపియన్ అంజలి భగవత్ కాంస్య పతకం సాధించింది. ఫలితంగా మొత్తం పతకాల సంఖ్య 60కి చేరుకుంది, వీటిలో 37 స్వర్ణాలు, 13 రజతాలు మరియు 10 కాంస్య పతకాలు ఉన్నాయి.






## నెదర్లాండ్స్ ఘన విజయం

### నమీబియా 7 వికెట్ల తేడాతో చిత్తు

**న్యూఢిల్లీ:** ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో నెదర్లాండ్స్ బోణీ కొట్టింది. పాకిస్థాన్‌తో తృటిలో చేజారిన పరాజయం నుంచి త్వరగానే కోలుకుంది. గ్రూప్ ఏ లో భాగంగా మంగళవారం ఢిల్లీ వేదికగా నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. బాస్ డీ లీడే(72 నాటౌట్, 2/20) ఆల్‌రౌండ్ షోతో నెదర్లాండ్స్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన నమీబియా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 156 పరుగులు చేసింది. జాన్ నికోల్ లాఫ్టీ(38 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 42), జాన్ ఫ్రైలింక్(26 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 30) టాప్ స్కోరర్లుగా నిలిచారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన నమీబియా బ్యాటర్లలో నలుగురు మాత్రమే రెండెంకలే స్కోర్ చేయగా, మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. నెదర్లాండ్స్ బౌలర్లలో బాస్ డీ లీడే(2/20), లోగన్ వాన్ బ్రీక్(2/13) రెండేసి వికెట్లు తీయగా.. ఆర్యన్ దత్, ఫ్రెడ్ క్లాసెన్ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం నెదర్లాండ్స్ 18 ఓవర్లలో 3 వికెట్లకు 159 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. బాస్ డి లీడే(48 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 72 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. కొలిన్ అకెర్‌మన్(38 బంతుల్లో సిక్స్‌తో 32), మైఖేల్ లెవిట్(15 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 28) టాప్ స్కోరర్లుగా నిలిచారు. కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్(9 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 18 నాటౌట్) దూకుడుగా ఆడాడు. నమీబియా బౌలర్లలో బెర్నాడ్, రుబెన్, జాన్ నికోల్ తలో వికెట్ తీసారు. ఈ గెలుపుతో నెదర్లాండ్స్ గ్రూప్‌ఏలో రెండో స్థానంలో నిలిచింది. తదుపరి మ్యాచ్‌ల్లో ఆ జట్టు అమెరికా, భారత్‌తో ఆడనుంది.



## టి20 వరల్డ్‌కప్‌లో చరిత్ర సృష్టించిన న్యూజిలాండ్

### యుఎఇపై ఘనవిజయం

**న్యూఢిల్లీ:** ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో న్యూజిలాండ్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్ డీలో భాగంగా యూఏఈతో మంగళవారం చెన్నై వేదికగా జరిగిన రెండో మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన న్యూజిలాండ్ 10 వికెట్ల తేడాతో గెలుపొందింది. న్యూజిలాండ్ ఆల్‌రౌండ్ షో ముందు యూఏఈ తేలిపోయింది. టీమ్ సీఫెర్ట్(89 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో న్యూజిలాండ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన




యూఏఈ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 173 పరుగులు చేసింది. మహమ్మద్ వసీమ్(66 నాటౌట్), అలిషాన్ షరఫురీ(55) హాఫ్ సెంచరీతో రాణించారు. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ(2/37) రెండు వికెట్లు తీయగా, జాకోబ్ డఫ్ఫీ, లాకీ ఫెర్గూసన్, మిచెల్ సాంట్నర్, గ్లేన్ ఫిలిప్స్ తలో వికెట్ తీసారు. అనంతరం న్యూజిలాండ్ 15.2 ఓవర్లలో 175 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. న్యూజిలాండ్ ఓపెనర్లు టీమ్ సీఫెర్ట్(89 నాటౌట్), ఫిన్ అలెన్(84 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీలతో న్యూజిలాండ్ విజయంలో కీలక పాత్ర పోషించారు.తొలి వికెట్‌కు అజేయంగా 175 పరుగులు జోడించిన సీఫెర్ట్, ఫిన్ అలెన్ ఐసీసీ టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్య రికార్డ్ అందుకున్నారు. ఈ క్రమంలో ఇంగ్లండ్ ఓపెనింగ్ జోడీ అలెక్స్ హేల్స్, జోస్ బట్లర్ పేరిట ఉన్న రికార్డ్‌ను బ్రేక్ చేశారు. ఈ మ్యాచ్‌లో 175 పరుగుల భాగస్వామ్యంతో ఈ రికార్డ్‌ను టీమ్ సీఫెర్ట్, అలెన్ అధిగమించారు. ఈ విజయంతో న్యూజిలాండ్ గ్రూప్ డీలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. తొలి మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్‌ను న్యూజిలాండ్ ఓడించిన సంగతి తెలిసిందే. తమ తదుపరి మ్యాచ్‌లను సౌతాఫ్రికా, కెనడాతో న్యూజిలాండ్ ఆడనుంది.












## టి20 వరల్డ్ కప్‌లో అరుదైన ఫీట్

### రెండుసార్లు ట్రోఫీ నెగ్గిన కెప్టెన్

**న్యూఢిల్లీ:** టీ20 క్రికెట్ అంటే ఉత్సాహం, దూకుడు మరియు అద్భుతమైన ముగింపులు. క్రికెట్ చరిత్రలో అత్యంత ప్రసిద్ధ మరియు మరపురాని క్షణాలను సృష్టించింది. ఒకే ఓవర్‌లో ఆరు సిక్సర్లు, అద్భుతమైన క్యాచ్‌ల నుండి దిగ్గజ ఆటగాళ్ల సూపర్ హ్యూమన్ ప్రదర్శన ఉత్కంఠ కలిగిస్తుంది. క్రికెట్ ప్రపంచంలో ప్రతి ప్లేయర్‌కు ఒక వరల్డ్ కప్ గెలవాలనేది పెద్ద డ్రీమ్. అలాంటిది కెప్టెన్‌గా తన జట్టును రెండుసార్లు విశ్వవిజేతగా నిలబెట్టడం అంటే అది మామూలు విషయం కాదు.

2007 నుంచి 2024 వరకు జరిగిన టీ20 వరల్డ్ కప్ ప్రయాణంలో ఎందరో దిగ్గజ కెప్టెన్లు తమ అదృష్టాన్ని పరీక్షి ంచుకున్నారు. కానీ ఒక్కరు మాత్రం ఒక అరుదైన రికార్డును తన పేరిట రాసుకున్నారు. ఎంఎస్ ధోనీ నుంచి రోహిత్ శర్మ వరకు ఎందరో సక్సెస్‌ఫుల్ కెప్టెన్లు ఉన్నా, ఈ ఘనత ఒక్కరికే సాధ్యమైంది. 2007 ఎడిషన్‌లో ఎంఎస్ ధోనీ నాయకత్వంలో టీమ్‌ఇండియా అరంగేట్రం టోర్నీలోనే సంచలనం సృష్టించింది. సౌతాఫ్రికా వేదికగా జరిగిన ఆ టోర్నీలో యువ భారత్ పాకిస్థాన్‌ను ఓడించి మొదటిసారి ఛాంపియన్‌గా నిలిచింది. ధోనీ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలు, యువ ప్లేయర్ల పట్టుదల భారత్‌కు ఆ అరుదైన ట్రోఫీని అందించాయి. టీమ్‌ఇండియా భవిష్యత్తు కూడా ఆ విజయం నుంచి మరో స్థాయికి వెళ్లింది. ధోనీ తర్వాత ఆ రేంజ్ కెప్టెన్సీతో రోహిత్ శర్మ భారత్‌ను మళ్లీ వరల్డ్ కప్ విజేతగా నిలిపాడు. 2024లో జరిగిన గత సీజన్‌లో రోహిత్ తన పక్కా ప్లానింగ్‌తో టీమ్‌ఇండియాను ఓటమి లేకుండా నడిపాడు. ఫైనల్‌లో ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికాను ఓడించి భారత్ రెండోసారి టీ20 వరల్డ్ కప్‌ను ముద్దాడింది. రోహిత్ శర్మ ప్లేయర్‌గా 2007లో, కెప్టెన్‌గా 2024లో ట్రోఫీని గెలిచిన ఏకైక భారత ప్లేయర్‌గా అరుదైన రికార్డును కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ విజయంతో భారత్ మళ్లీ టీ20 ఫార్మాట్‌లో తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది. డారెన్ సామి కెప్టెన్సీలో వెస్టిండీస్ జట్టు టీ20 ఫార్మాట్‌లో ఎంత ప్రమాదకరమో 2012లో ప్రపంచానికి తెలిసింది. డారెన్ సామి సారథ్యంలో విండీస్ తన మొదటి టీ20 వరల్డ్ కప్ సాధించింది. శ్రీలంక వేదికగా జరిగిన ఆ టోర్నీ ఫైనల్‌లో హోస్ట్ టీమ్ శ్రీలంకను ఓడించి కరీబియన్లు కప్పును కైవసం చేసుకున్నారు. సామి తన నాయకత్వంతో జట్టును ఏకతాటిపైకి తీసుకువచ్చి అద్భుతమైన ఫలితాలను సాధించారు.

## గోల్డ్, సిల్వర్ ఇటిఎఫ్‌లలోకి పెట్టుబడుల వెల్లువ




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:** గోల్డ్ ఎక్స్ఛేంజి ట్రేడెడ్ ఫండ్స్‌లోకి పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయి. జనవరి నెలలో రూ.24,040 కోట్లమేర పెట్టుబడులు వచ్చాయి. గత ఏడాది డిసెంబరులో వచ్చిన రూ.11,647 కోట్లతోపోలిస్తే జనవరిలో రెండురెట్లుపెరిగాయి. సిల్వర్ ఇటిఎఫ్‌లు కూడా పెరుగుదలను సూచించాయి. ఇన్వెస్టర్లు రూ.9500 కోట్లు పెట్టుబడులు కుమ్మరించారు. అదే గత ఏడాది డిసెంబరులోచూస్తే 3962 కోట్లుమాత్రమే ఉన్నాయని మ్యూచువల్‌ఫండ్స్ అసోసియేషన్ ఆంఫీ ప్రకటించింది. పసిడి, వెండిల్లో భారీ అనిశ్చితి నెలకొనడం, జనవరిలో పసిడిధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో 17శాతం పెరగడం, వెండి కూడా 39శాతంపెరిగాయి. ఒకేసారి పతనం అయిన తర్వాత కూడా మళ్లీ పెరగడంతో ఇటిఎఫ్‌లపై ఆసక్తిపెరిగింది సిల్వర్, గోల్డ్ ఇటిఎఫ్‌లలో పెట్టుబడులు పెరుగుతుంటే ఈక్విటీల్లో మాత్రం తగ్గుతున్నాయి. జనవరిలో రూ.24,040 కోట్లు వచ్చాయని గడచిన ఏడు నెలలతోపోలిస్తే కనిష్టమొత్తం పెట్టుబడులు వచ్చినట్లు ఆంఫీ వెల్లడించింది. గతనెలలో ఈక్విటీలనుంచే రూ.41,639 కోట్లు విత్‌డ్రాచేసారు. గడచిన 18 నెలల్లో భారీ స్థాయిలో విత్‌డ్రా కావడం ఇదే తొలిసారి. ఇక సిస్టమేటెడ్ ఇన్వెస్ట్‌మెంట్‌ప్లాన్ సిప్ పెట్టుబడులు పెరిగాయి. ఈక్విటీ ఫండ్స్‌లోకి సిప్ ఇన్‌ఫ్లోలే పెరిగాయి. స్థూలంగా పెట్టుబడులు రూ65,667కోట్లు వచ్చినట్లు ఆంఫీ తెలిపింది. అయితే డిసెంబరుతో పోలిస్తే ఐదుశాతం తగ్గాయి. ఒక్క సిప్ పెట్టుబడులే రూ.31,002 కోట్లుగా ఉన్నాయి. విలువైన ఖనిజవనరుల్లోకి పెట్టుబడులు మళ్లిస్తున్న ఇన్వెస్టర్లు విభిన్న రంగా లమూచువల్‌ఫండ్స్‌లోకి కూడా రూ.10వేల కోట్లవరకూ పెట్టుబడులు కుమ్మరించినట్లు తెలుస్తోంది. రానురాను మూచువల్‌ఫండ్స్ విభాగం ఇపుడు పెట్టుబడులకు ఎంతో సానుకూలంగా ఉండటంతో ఇన్వెస్టర్లు తమ దృష్టిని అటువేపు మళ్లించినట్లు ఆంఫీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ చలసాని తెలిపారు.

## పాన్‌కార్డు నిబంధనలు ఏప్రిల్ 1నుంచి అమల్లోకి!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:** దేశంలో పన్నుల వ్యవస్థను మరింత సరళతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దాదాపు ఆరు దశాబ్దాల నాటి 1961 ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కొత్త ఆదాయపు పన్ను చట్టం2025ను తీసుకువస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ఈ కొత్త చట్టం 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. ఇందులో భాగంగా పన్ను చెల్లింపుదారుల సౌలభ్యం కోసం పలు నిబంధనలను సులభతరం చేశారు. ముఖ్యంగా పాన్ కార్డు వినియోగానికి సంబంధించిన లావాదేవీల పరిమితుల్లో గణనీయమైన మార్పులు ప్రతిపాదించారు. ఈ కొత్త చట్టానికి సంబంధించిన ముసాయిదా నిబంధనలను ఆదాయపు పన్ను శాఖ ఇప్పటికే విడుదల చేసింది. వీటిపై ప్రజలు, నిపుణుల నుంచి ఈ నెల 22 వరకు అభిప్రాయాలను స్వీకరించనుంది. ఈ ముసాయిదా ప్రకారం పలు ఆర్థిక లావాదేవీలకు పాన్ కార్డు తప్పనిసరి చేసే పరిమితులను సవరించారు. ప్రస్తుతం బ్యాంకులో ఒక్కసారి రూ. 50 వేలకు మించి నగదు డిపాజిట్ చేస్తే పాన్ వివరాలు ఇవ్వాల్సి ఉంది. కొత్త నిబంధనల ప్రకారం, ఒకటి లేదా అంతకంటే ఎక్కువ బ్యాంకు ఖాతాల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రూ. 10 లక్షలు, అంతకుమించి మించి నగదు డిపాజిట్ చేసినప్పుడు లేదా విత్‌డ్రా చేసినప్పుడు మాత్రమే పాన్ కార్డు వివరాలు సమర్పించాలి. ఇప్పటివరకు ద్విచక్ర వాహనాలు మినహా ఇతర వాహనాల కొనుగోలుకు పాన్ తప్పనిసరిగా ఉండేది. కొత్త విధానంలో మోటార్ సైకిళ్లతో సహా ఏ రకమైన వాహనం కొనుగోలు చేసినా దాని విలువ రూ. 5 లక్షలు దాటితేనే పాన్ వివరాలు అందించాల్సి ఉంటుంది. ఏదైనా స్థిరాస్తిని అమ్మినా, కొనుగోలు చేసినా, బహుమతిగా ఇచ్చినా ఆ ఆస్తి విలువ రూ. 20 లక్షలు దాటినప్పుడే పాన్ వివరాలు అవసరం. ప్రస్తుతం ఈ పరిమితి రూ. 10 లక్షలుగా ఉంది. ఇకపై హోటళ్లు, రెస్టారెంట్లు లేదా బాంక్వెట్ హాళ్లలో చేసే చెల్లింపులు ఒకేసారి రూ. 1 లక్ష దాటితే పాన్ కార్డు వివరాలు ఇవ్వాలి. ప్రస్తుతం ఈ పరిమితి రూ. 50,000గా ఉంది. అలాగే, ఇన్సూరెన్స్ కంపెనీలో కొత్తగా ఖాతా తెరవాలంటే ప్రీమియంతో సంబంధం లేకుండా పాన్ తప్పనిసరి చేశారు. వీటితో పాటు కంపెనీలు తమ ఉద్యోగులకు అందించే ఉచిత భోజనం లేదా పానీయాల విలువ ఒక్కో మీల్‌కు రూ. 200 మించరాదని కూడా కొత్త చట్టంలో స్పష్టం చేశారు.



వాణిజ్యం



## భారీ షాకిచ్చిన బంగారం..

### ఒక్కరోజే రూ.15000 పెరిగిన వెండి

**ముంబయి, ఫిబ్రవరి 10:** పసిడి ప్రియులకు అలర్ట్. దేశీయ మార్కెట్ల బంగారం, వెండి ధరలు మళ్లీ భారీగా పెరిగాయి. క్రితం రోజు స్థిరంగా ఉన్నప్పటికీ ఈరోజు మళ్లీ పెరగడం గమనార్హం. వెండి ఒక్కరోజే రూ.15 వేలు పెరిగి మళ్లీ రూ.3 లక్షల మార్క్ తాకింది. అంతర్జాతీయ మార్కెట్లో పసిడి రేట్లు భారీగా పెరుగుతుండడం దేశీయంగా ప్రభావం చూపిస్తోంది. ఈ క్రమంలో ఫిబ్రవరి 10వ తేదీన హైదరాబాద్ మార్కెట్లో గోల్డ్, సిల్వర్ రేట్లు తెలుసుకుందాం. భారత ప్రజలకు బంగారం అంటే ఎంత ఇష్టమో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మహిళలు ఆభరణాలుగా ధరిస్తుంటారు. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, వాణిజ్య యుద్ధాలు, సుంకాలు, డాలర్ విలువ, మార్కెట్లలో ఒడుదొడుకులు వంటి ఎన్నో కారణాలు బంగారం ధరలను ప్రభావితం చేస్తున్నాయి. ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడి మార్గంగా బంగారాన్ని ఎంచుకుంటున్నారు. ఇతర మార్గాల్లోని పెట్టుబడులను బంగారంలోకి మళ్లిస్తున్నారు. దీంతో గిరాకీ పెరిగి ధరలు దూసుకెళ్తున్నాయి. ఒకప్పుడు ఆభరణాల కోసమే కొనుగోలు చేసే బంగారం ఇప్పుడు ఒక పెట్టుబడి సాధనంగా మారిపోయింది. దీంతో పసిడి రేట్లు ఆకాశమే హద్దుగా పరుగులు పెడుతోంది. ఈ క్రమంలో ఫిబ్రవరి 10వ తేదీన హైదరాబాద్ మార్కెట్లో 22,24 క్యారెట్ల గోల్డ్ రేట్లు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. అంతర్జాతీయ మార్కెట్లో పసిడి రేట్లు మళ్లీ భారీగానే పెరిగాయి. ఇవాళ స్పాట్ గోల్డ్ రేటు 1 ఔన్సుకు 68 డాలర్లకు పైగా పెరిగింది. దీంతో ఔన్స్ బంగారం 5034 డాలర్ల పైన ట్రేడవుతోంది. స్పాట్ సిల్వర్ రేటు ఔన్సుకు 4.86 శాతం మేర పెరిగింది. దీంతో ప్రస్తుతం ఔన్స్ వెండి 81.5 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో పసిడి ధరలు కాస్త ఊరట కల్పించినట్లు కనిపించినా మళ్లీ పెరిగి షాకిచ్చాయి. ఈరోజు 24 క్యారెట్ల బంగారం రేటు 10 గ్రాములకు రూ.1310 మేర పెరిగింది. దీంతో తులం బంగారం ధర రూ.1,57,910 వద్దకు దూసుకెళ్లింది. ఇక 22 క్యారెట్ల బంగారం రేటు 10 గ్రాములపై రూ. 1200 మేర పెరిగింది. దీంతో తులం గోల్డ్ రేటు 1,44,750 వద్దకు ఎగబాకింది. ఇక బంగారంతో పాటు వెండి రేటు సైతం మళ్లీ భారీగా పెరుగుతోంది. దేశీయ మార్కెట్లో ఇటీవల భారీగా పడిపోయిన వెండి ధర మళ్లీ పుంజుకుంటోంది. ఈరోజు ఒక్కరోజే కిలో వెండి రేటు రూ.15 వేలు పెరిగింది. దీంతో మరోసారి వెండి కిలో రూ.3 లక్షల మార్క్ దాటింది. ప్రస్తుతం కిలో వెండి ధర హైదరాబాద్ మార్కెట్లో రూ.3,00,000 వద్ద ట్రేడవుతోంది.

## మూడోరోజు లాభాల్లోనే ఈక్విటీ సూచీలు

### ఇన్వెస్టర్ల కొనుగోళ్లు, త్రైమాసిక ఫలితాలు బూస్ట్

**ముంబయి, ఫిబ్రవరి 10:** ఈక్విటీసూచీలు వరుసగా మూడోరోజు కూడా లాభాల్లోనే ముగిసాయి. విదేశీ సంస్థగత ఇన్వెస్టర్లుకొనుగోళ్లు పెంచడంతో మార్కెట్లకు ఊతం లభించింది. ఇండో అమెరికా మధ్యంతర డీల్, యూరోపియన్ డీల్ వంటివి మార్కెట్లకు మద్దతిచ్చాయి. నిఫ్టీ 25,900 మార్కుఉ దాటేసింది. బిఎస్‌ఇ సెన్సెక్స్ 208.17 పాయింట్లుపెరిగి 84,273.92 పాయింట్లవద్ద స్థిరపడితే నిఫ్టీ 50 సూచీ కూడా 67.85 పాయింట్లు పెరిగింది. మూడుట్రేడింగ్‌లలో సెన్సెక్స్,నిఫ్టీలు రెండూ కూడా 1.15శాతం, 1.14శాతం చొప్పునపెరిగాయి. మహీంద్ర అండ్ మహీంద్ర 1.79శాతం, ఎల్‌అండ్‌టి 1.32శాతం, ఐసిఐసిబ్యాంకు 0.60శాతం చొప్పున పెరిగాయి. బిఎస్‌ఇలోమిడ్‌క్యాప్‌సూచీ 0.21శాతం స్మాల్‌క్యాప్‌సూచీ 0.46శాతంచొప్పున పెరిగాయి. బిఎస్‌ఇలో 2620 కంపెనీల షేర్లుపెరిగాయి. 1631 కంపెనీలు తిరోగమించాయి. 172 కంపెనీలు స్తిరంగాకొనసాగాయి. ఇక విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్ రూపాయి డాలరుతో చెలామణిని చూస్తే 90.57 వద్ద కదలాడింది. అంతకుముందురోజు 90.60గా కొనసాగిన సంగతి తెలిసిందే. బ్రెంట్‌ముడి చమురు ఏప్రిల్ సెటిల్‌మెంట్‌కు సంబంధించి 13 సెంట్లు తగ్గి బ్యారెల్‌కు 69.04 డాలర్లుగా కొనసాగింది. షేర్లలో బిఎస్‌ఇ 6.26శాతం పెరిగితే బాటా ఇండియా 3.86శాతం, నెల్‌కాస్ట్ 7.96శాతం, ఐఎస్‌జిఇసి హెవీ ఇంజినీరింగ్ 18.32శాతం చొప్పున పెరిగాయి. సైన్‌పోస్టు ఇండియా 15.23శాతం పెరిగినట్లు ప్రకటించింది. త్రైమాసిక ఫలితాలే ఈ కంపెనీలు భారీ ఊతం ఇచ్చాయి. అలాగే వేక్‌ఫిట్ ఇన్నొవేషన్స్‌కూడా 8.15శాతం, టెక్‌సమాకో రైల్ అండ్ ఇంజినీరింగ్ 2.55శాతం, ఎన్‌ఆర్‌బి బేరింగ్స్ 2.95శాతం పెరిగితే రూట్ మొబైల్ 1.64శాతం హ్యాపియస్ట్ మైండ్స్ టెక్నాలజీస్ 0.68 శాతం, శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్ 2.13శాతం చొప్పున క్షీణిస్తే గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్ ఇండియా మాత్రం 1.28శాతం షేర్లుపెరిగి ట్రేడ్ అయ్యాయి. ఇక ఐపిఒలపరంగా ఫ్రాక్టాల్ అనలిటిక్స్ 36,25,120 షేర్లకుబ ఇడ్లు సాధించింది. వాస్తవనికి 1,85,79,360గా మాత్రమే ఆహ్వానిస్తే 0.20రెట్లుపెరిగింది. తొమ్మిదిన ప్రారంభం అయిన ఈ ష్యూ 11న ముగుస్తుంది. ఐపిఒ ధరలు రూ.857 నుంచి 900మధ్యలో ఉంటాయి. ఆయేఫైనాన్స్ కూడా 72,72,272 షేర్లకు బిడ్లు రాబట్టింది. 0.16 రెట్లు ఎక్కువ బిడ్లు వచ్చాయి. 9న ప్రారంభం అయి 11న ముగస్తుంది. ఐపిఒ ధరలు రూ.122 నుంచి రూ.129గా నిర్ణయించింది.



## 61% పెరిగిన టైటాన్ జ్యుయెలరీ నికరలాభాలు




**ముంబయి, ఫిబ్రవరి 10:** టాటాగ్రూపు జ్యుయెలరీ సంస్థ టైటాన్ కంపెనీ మంగళవారం నిరకలాభాల్లో 61శాతం వృద్ధిని సాధించినట్లుప్రకటించింది. డిసెంబరుతో ముగిసన త్రైమాసికంలో రూ.1684 కోట్లు ఆర్జించింది. అదే గత ఏడాది ఇదేకాలంలో రూ.1047 కోట్లు సాధించింది. కంపెనీ రాబడులు కూడా 42శాతంపెరిగి రూ.24,915 కోట్లుగా ఉనానయి. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో రూ.17,550 కోట్లు మాత్రమే రాబట్టింది. జ్యూయెలరీ విభాగంలో పటిష్టమైన డిమాండ్ రావడంతో సంస్థ లాభాలుపెరిగాయి. బంగారం ధరలు భారీగాపెరిగినప్పటికీ పండుగల సీజన్ టైటాన్‌కు భారీగా కలిసొచ్చింది. కంపెనీ ఇబిడిటా 2475కోట్లుగా ఉంది. ఐకేర్ విభాంలో రూ.231 కోట్లు వచ్చింది.

18శాతంపెరిగింది. టైటాన్ ఇంజినీరింగ్ ఆటోమేషన్ టీల్ రాబడులు రూ.323కోట్లుగా ఉన్నాయి. 67శాతంపెరిగినట్లు కంపెనీ వెల్లడించింది. కంపెనీ షేర్లు మంగళవారం బిఎస్‌ఇలో నిలకడగా అంటే రూ.4267.05 చొప్పున కొనసాగాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.